మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శనివారం 17 అక్టోబర్ 2026 || సంపుటి: 10 || సంచిక: 282 || పేజీలు:12 || వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

దాండియా డాన్స్ చేసిన రోబో

కలీంనగర్ జిల్లా నగునూరు దుర్గాభవానీ ఆలయంలో శరన్నవరాత్రి వేడుకల్లో హ్యూమనాయిడ్ రోబో.. సంప్రదాయ దుస్తుల్లో భక్తులతో కలిసి దాండియా నృత్యం చేసింది.

అవిభక్త కవలలకు హ్యాపీ బర్త్ డే..

వీణ-వాణీల 24వ పుట్టినరోజు

2

నెలాఖరులో పార్లమెంటు ప్రత్యేక సెషన్

డీలిమిటేషన్, మహిళా బిల్లుల కోసమేనంటూ మీడియా కథనాలు

ఢిల్లీ, అక్టోబర్ 16: ఈ నెలాఖరులో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లుల ఆమోదం కోసం ఈ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని కేంద్రం భావిస్తున్నట్లు సమాచారం. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లులను వర్షాకాల సమావేశాల్లోనే ...మిగతా 2లో

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పిటిషన్‌ను హైకోర్టు సీజే ధర్మాసనం విచారించాలె

- సుప్రీంకోర్టు ఆదేశం

హైదరాబాద్, అక్టోబర్ 16: ఎలాంటి చట్టపరమైన మద్దతు లేకుండానే తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను సవాల్ చేస్తూ విజయ్ గోపాల్ అనే న్యాయవాది దాఖలు చేసిన రిట్ పిటిషన్ ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం విచారించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం గురువారం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. 'ప్రస్తుతం హైకోర్టులో ...మిగతా 2లో

హ్యుందాయ్ ప్లాంట్ ఏర్పాటు చేయండి

సంస్థ యాజమాన్యానికి సీఎం రేవంత్ రెడ్డి పిలుపు

జహీరాబాద్‌లో రూ.8,528 కోట్లతో గ్లోబల్ పరిశోధన కేంద్రం

పెండింగ్ అనుమతులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

తెలంగాణలో తయారీ రంగానికి అన్ని విధాలా సహకరిస్తామని హామీ



హైదరాబాద్, అక్టోబర్ 16 (మనం బ్యూరో): తెలంగాణను కార్ల తయారీకి అనువైన ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో హ్యుందాయ్ కార్ల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ఆ సంస్థ యాజమాన్యాన్ని కోరారు. శుక్రవారం ఇక్కడి ఎంసిహెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్లో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యూన్ చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం ...మిగతా 2లో

కిషన్ రెడ్డితో తుమ్మల భేటీ

కీలక అభివృద్ధి పనులపై వినతిపత్రాలు అందజేత

2

వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సిద్ధం

దసరా నుంచి ఓపీ సేవలు

నవంబరు, డిసెంబర్‌లో పూర్తి స్థాయిలో వైద్య సేవలు

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

3

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

కర్ణాటక పారిశ్రామిక వేత్తలకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం

గ్లోబల్ సమ్మిట్ ప్రచారంలో భాగంగా బెంగళూరు రోడ్ షోలో పాల్గొన్న ఐటీ మంత్రి

హైదరాబాద్, అక్టోబర్ 16 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని కర్ణాటక పారిశ్రామిక ప్రముఖులను రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి శ్రీధర్ బాబు సాదరంగా ఆహ్వానించారు. రాబోయే డిసెంబర్ 7 నుంచి 9 వరకు హైదరాబాద్ లోని ప్రతిష్టాత్మక భారత్ ఫ్యూచర్ సిటీలో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'ను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమ్మిట్ కు సంబంధించిన ప్రచారంలో భాగంగా బెంగళూరులో నిర్వహించిన రోడ్ షోలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలు కేవలం భౌగోళికంగానే కాకుండా, ఒకే విలువ ఆధారిత ఆర్థిక గొలుసులో రెండు కీలక భాగాలుగా కలిసి పనిచేస్తున్నాయని అభివర్ణించారు. ఏరోస్పేస్, లైఫ్ సైన్సెస్, ...మిగతా 2లో

డబుల్ డ్యూటీ చేసినోళ్లకు నగదు మాత్రమే ఇవ్వాలె

డీఆఫ్, సీఆఫ్‌లు ఇవ్వొద్దు

ఆర్టీసీ యాజమాన్యం ఆదేశాలు

ఇది చట్ట ఉల్లంఘనే..

అంటున్న ఎస్ డబ్ల్యూఎఫ్

హైదరాబాద్, అక్టోబర్ 16: డబుల్ డ్యూటీలు చేసే డ్రైవర్లు, కండక్టర్లకు డబుల్ డ్యూటీ అడ్వాన్స్ మాత్రమే చెల్లించాలని.. డీఆఫ్, సీఆఫ్ (సంబంధిత సెలవులు) మంజూరు చేయవద్దంటూ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) ఆదేశించింది. ఈ మేరకు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఈ నెల 13న అన్ని ప్రాంతీయ మేనేజర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. 'డబుల్ డ్యూటీకి బదులుగా సెలవులు ఇవ్వడంతో డ్రైవర్లు, కండక్టర్లు విధులకు అందుబాటులో ...మిగతా 2లో

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతివ్వండి

- వామపక్ష నేతలతో కాంగ్రెస్ నేతల భేటీ
- పాల్గొన్న పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, మంత్రి పొన్నం

హైదరాబాద్, అక్టోబర్ 16 (మనం బ్యూరో): త్వరలో జరుగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతివ్వాలని వామపక్ష పార్టీల నేతలను కాంగ్రెస్ నేతలు కోరారు. ఈమేరకు శుక్రవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సీపీఎం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపి వేం నరేందర్ రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సీపీఎం నేతలు సాగర్, జ్యోతి, పోతినేని సుదర్శన్, బండారు రవి కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వామపక్ష నేతలతో కాంగ్రెస్ నేతలు దేశంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి ...మిగతా 2లో

ఎల్నినో ప్రభావాన్ని ప్రజలకు వివరించండి

3

మూడు నెలల్లో.. రోహిత్ వేముల బిల్లు సిద్ధం చేయాలె

అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశం

షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు

న్యాయ, విద్యా, హోంశాఖలు, యూజీసీ భాగస్వామ్యంతో కసరత్తు

హైదరాబాద్, అక్టోబర్ 16 (మనం బ్యూరో): విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థుల హక్కులను పరిరక్షిస్తూ, కులం, సామాజిక నేపథ్యం ఆధారంగా వివక్షకు తావులేకుండా సమగ్ర చట్టాన్ని రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ప్రతిపాదిత 'రోహిత్ వేముల తెలంగాణ బిల్లు'కు సంబంధించిన ప్రాథమిక ముసాయిదాను మూడు నెలల్లోగా సిద్ధం చేసి సీనియర్ సివిల్ సర్వెంట్ల కమిటీ (సీఎస్సీ)కి సమర్పించాలని స్పష్టం చేశారు. కమిటీ ఏర్పాటు నుంచి వివిధ భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపుల వరకు ప్రతి దశను నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేయాలని, ఎలాంటి జాప్యానికి తావివ్వరాదని సూచించారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన రోహిత్ వేముల తెలంగాణ బిల్లుపై ...మిగతా 2లో

జన్ నీతి భారత్

ఐఏఎస్ అధికారి దివ్యా మిత్తల్ యూపీలో స్థాపించిన కొత్త పార్టీ

హైదరాబాద్, అక్టోబర్ 16: స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన ఐఏఎస్ అధికారిణి దివ్యా మిత్తల్ కొత్త ఇన్నింగ్స్ మొదలుపెట్టారు. 'జన్ నీతి భారత్' పేరుతో నూతన రాజకీయ పార్టీని ప్రారంభిస్తున్నట్లు గురువారం ప్రకటించారు. వచ్చే ఏడాది జరగనున్న ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో వీడియో సందేశాన్ని విడుదల చేశారు. విధాన నిర్ణయాల్లో ప్రజలే కేంద్రంగా ఉండేలా చూడటంపై తమ పార్టీ ప్రధానంగా దృష్టి సారిస్తుందని తెలిపారు. 13 ఏళ్ల పాటు ఐఏఎస్ అధికారిణిగా పని చేసిన దివ్యా మిత్తల్ ఈ ఏడాది ఆగస్టు 30న స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు.

కెనడాపై ట్రంప్ విచ్ఛిన్న కుట్ర?

19న జరగనున్న రెఫరెండమ్ నేపథ్యంలో కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఆరోపణలు

ఒట్టావా/ఆల్బెర్టా, అక్టోబర్ 16: తమ దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి అమెరికా ప్రయత్నిస్తోందని కెనడా ప్రధాని మార్క్ కార్నీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కెనడా ప్రావిన్స్ ఆల్బెర్టాలో వచ్చే సోమవారం రిఫరెండం జరగనున్న నేపథ్యంలో ప్రచార ర్యాలీలో కార్నీ మాట్లాడారు. ఆల్బెర్టా కెనడాలో భాగంగా ఉండేలా ఆ ప్రావిన్స్ ప్రజలు ఓటు వేయాలని కోరారు. అందుకు భిన్నంగా జరిగితే.. విభజన, అనిశ్చితికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. ''ప్రపంచం ప్రమాదకరంగా, సొంత లక్ష్యాల ఆధారంగా విడిపోయి ఉంది. మన సరిహద్దులకు అవతల ఉన్నవారు మనల్ని విచ్ఛిన్నం చేసి, గుప్పిట పెట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఇలా ఏమాత్రం అనుకూలంగా లేని సమయంలో రిఫరెండం జరుగుతోంది. ఇందులో నిర్ణయాత్మక ఫలితం వేర్పాటువాద సమస్యను పరిష్కరిస్తుంది. ఆల్బెర్టా విడిపోవడానికి ...మిగతా 2లో

ఉక్రెయిన్ అధ్యక్షుడిగా జెలెన్‌స్కీ పనికిరారు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్, అక్టోబర్ 16: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి విమర్శలు గుప్పించారు. యుద్ధాన్ని ముగించడానికి జెలెన్‌స్కీ సుముఖంగా లేరని.. అందువల్లే రష్యాపై దాడులు కొనసాగిస్తున్నారని విమర్శించారు. అమెరికాతో డీల్ చేసుకోవడానికి ఆయన సరైన వ్యక్తి కారని అన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడిగా ఆయన ఇక ఎంత మాత్రం పనికిరారని.. కొత్త వ్యక్తిని ఎన్నుకోవడం ఉత్తమమని ఆ దేశ ప్రజలకు సూచించారు. శాంతి చర్చలు, రాజీ యత్నాలంటూ బయటకు చెబుతారు కానీ.. లోపల మాత్రం యుద్ధం ...మిగతా 2లో

ఢిల్లీలో సీజేపీ తిరంగా మార్చ్..

పోలీసుల అదుపులో అభిజీత్ దీప్కే

ఢిల్లీ, అక్టోబర్ 16: సీజేపీ తిరంగా మార్చ్‌కు పిలుపు ఇచ్చిన వేళ శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీలో ఉద్రిక్తత నెలకొంది. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను దిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కరోల్ బాగ్‌లో ఆయన బస చేసిన చోటు నుంచి కన్నాట్ పేస్ లోని సెంట్రల్ పార్కు వద్దకు బయల్దేరడానికి సిద్ధమవుతుండగా పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. దీంతో పోలీసు వాహనాన్ని ముందుకు వెళ్లనివ్వకుండా నిరసనకారులు చుట్టుముట్టారు. పోలీసులు తనను అరెస్ట్ చేయడంపై దీప్కే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ చట్టాన్ని ...మిగతా 2లో

మరోసారి భద్రతా బలగాల 'బంధనం'లో ఢిల్లీ

సీజేపీ లెహ్రో దో తిరంగా ర్యాలీని అడ్డుకునేటందుకే!

9

పోలీసుల అదుపులో అభిజీత్ దీప్కే

(మొదటి పేజీ తరువాయి)

ఉల్లంఘించినందుకు తనను నిర్బంధించారో చెప్పాలని ప్రశ్నించారు. వారం రోజుల్లో దీప్కేను అదుపులోకి తీసుకోవడం ఇది రెండోసారి. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ.. సర్ ప్రక్రియకు వ్యతిరేకంగా ఢిల్లీలోని సెంట్రల్ పార్క్ వద్ద శుక్రవారం సాయంత్రం ఐదుగంటలకు జాతీయ జెండాను ఎగరవేయాలని సీజేపీ తన మద్దతుదారులకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. సీజేపీ సభ్యులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా అరెస్టు కూడా ఈ మార్పుకు మరో కారణం. ఈ నేపథ్యంలోనే పోలీసులు తొలుత దీప్కే నివాసం ఉన్న చోటకు వెళ్లి నోటీసులు ఇచ్చారు. సోషల్ మీడియాలో ప్రజలను రెచ్చగొడుతున్నారని, అలాంటి చర్యలు చట్టవిరుద్ధమని అందులో పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలు హాస్యాస్పదమని, హింసను ప్రేరేపించేవిధంగా ఉన్న ఒక్క వీడియోనైనా చూపించాలని దీప్కే పోలీసులతో అన్నారు.

కెనడాపై ట్రంప్ విచ్చిన్నకుట్ర?

(మొదటి పేజీ తరువాయి)

వేసే ఓటు సంవత్సరాల తరబడి అనిశ్చితికి దారితీస్తుంది'' అని ఆ ప్రావిన్స్ ప్రజలను హెచ్చరించారు. ప్రస్తుతం అమెరికా, కెనడా మధ్య ట్రేడ్ వార్ నడుస్తోంది. మరోవైపు కెనడాను తమ దేశంలో 51వ రాష్ట్రంగా చేర్చుకుంటామని పలు సందర్భాల్లో ట్రంప్ బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ వ్యాఖ్యలకు గతంలోనే కార్నీ కౌంటర్ ఇచ్చారు. ఆల్బెర్టా ప్రజలు కెనడా నుంచి విడిపోవాలని గతంలో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌చేసిన వ్యాఖ్యలు కూడా వివాదాస్పదమయ్యాయి. ఆల్బెర్టా.. చమురు, సహజవాయువులతో సుసంపన్నమైన ప్రాంతం. తాము కెనడా ఆర్థిక వ్యవస్థకు ఎంతగానో సహకరిస్తున్నప్పటికీ.. తమకు లభిస్తున్న ప్రాతినిధ్యం, నిధులు తక్కువని ఆ ప్రాంత ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. ఆర్థిక అసమానతలు, ఫెడరల్ ప్రభుత్వ విధానాలు, రాజకీయ విభేదాలు వేర్పాటువాద ఆలోచనకు బలం చేకూరుస్తున్నాయి. ఈ నేపథ్యంలో అక్టోబర్ 19న ఓటింగ్ జరగనుంది. కెనడా నుంచి వేరుపడే ప్రక్రియను చట్టబద్ధంగా ప్రారంభించాలా.. వద్దా..?అనే దానిని దీని ద్వారా నిర్ణయించనున్నారు.

ఉక్రెయిన్ అధ్యక్షుడిగా జెలెన్‌స్కీ పనికిరారు

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగించాలనే ఆయన కోరుకుంటారన్నారు. జెలెన్‌స్కీ వల్లే ఆ దేశం నాశనం అవుతోందని దుయ్యబట్టారు. మరోవైపు 2014లో రష్యా క్రిమియాను స్వాధీనం చేసుకోవడాన్ని తప్పుబట్టారు. ఈ యుద్ధం కొనసాగింపునకు గత ఒబామా, బైడెన్ ప్రభుత్వాలు అందించిన సాయంపై కూడా విమర్శలు చేశారు. కాగా..రష్యాలోని ర్యాజాన్ ప్రాంతంలో ఉన్న చమురు శుద్ధి కర్మాగారంపై ఉక్రెయిన్ గురువారం డ్రోన్ దాడులకు పాల్పడింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. మరోవైపు మధ్య ఉక్రెయిన్‌లోని కిరోవోగ్రాడ్ ప్రాంతంపై మాస్కో విరుచుకుపడడంతో ముగ్గురు మరణించగా.. ఆరుగురు గాయపడ్డారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య తక్షణమే ఇంధన వనరుల కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిందని ట్రంప్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఇది వెలువడి వారం కూడా పూర్తి కాక ముందే ఇరుదేశాలు పరస్పర దాడులకు పాల్పడుతుండడం గమనార్హం.

వీణ-వాణీల 24వ పుట్టినరోజు

హైదరాబాద్, అక్టోబర్ 16: అవిభక్త కవలలు వీణ-వాణీలు 24వ వసంతంలోకి అడుగిడనున్నారు. వారు జన్మించిన నాటి నుంచి విడదీయాలని కోరుతూ ప్రభుత్వాలు, వైద్యులను వేడుకుంటున్నా ఫలితం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీణ-వాణీలకు పుట్టిన నాటి నుంచి పదేండ్ల వయసొచ్చే వరకు హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రిలోనే ఉన్నారు. అనంతరం హైదరాబాద్ లోని శిశువిహార్కు తరలించగా అక్కడే ఉంటూ బీకాం పూర్తి చేశారు. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం బీరెశెట్టిగూడెం గ్రామానికి చెందిన మారగాని మురళి, నాగలక్ష్మి దంపతులకు రెండో సంతానంగా అవిభక్త కవలలుగా జన్మించారు. 2003 అక్టోబరు 16న సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పుట్టుకతోనే తలలు అతుక్కుని జన్మించారు. రెండేళ్ల పాటు గుంటూరుకు చెందిన వైద్యుడు నాయుడమ్మ చికిత్స అందించారు. 2006 నుంచి నిలోఫర్, ముంబయిలోని బ్రీచ్ క్యాండీ, లండన్, సింగపూర్, ఆస్ట్రేలియాలకు చెందిన ప్రఖ్యాత వైద్యులు పరీక్షించారు. అయినా తమ పిల్లల కష్టాలు తీరుతాయని ఆశించిన వారి తల్లిదండ్రులకు నిరాశే ఎదురైంది.

కిషన్ రెడ్డితో తుమ్మల భేటీ

హైదరాబాద్, అక్టోబర్ 16 (మనం న్యూస్): కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై కేంద్ర మంత్రికి వినతిపత్రాలు అందజేసి చర్చించారు. యాదాద్రి థర్మల్ ప్లాంటుకు ముఖ్యమంత్రి కోరిన విధంగా మహానది కోల్డ్ ఫీల్డ్స్ నుంచి బొగ్గును కేటాయించాలని, రాష్ట్ర రైతులకు యూరియా సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ఆర్ఎఫ్ సీఎల్ సమస్యలకు

శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటుకు కోల్ ఇండియా సీఎస్ఆర్ నుంచి రూ.100 కోట్లు మంజూరు చేయాలని, సత్తుపల్లి బ్లాక్-ఐఐఐ బొగ్గు బ్లాక్ ను సింగరేణి సంస్థకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయ ఏర్పాటును వేగవంతం చేయాలని, రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులకు త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా సత్తుపల్లి-కొవ్వూరు, పెనుబల్లి- కొండపల్లి కొత్త రైల్వే లైన్లకు ప్రాధాన్యత ఇవ్వాలని, పాండురంగాపురం-మల్కన్ గిరి రైల్వే లైన్ను సారపాక వరకు త్వరగా పూర్తి చేయాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.

నెలాఖరులో పార్లమెంటు ప్రత్యేక సెషన్

(మొదటి పేజీ తరువాయి)

ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావించింది. అయితే, నీట్ పరీక్షా పత్రాల లీకేజీ వివాదం, సీజేపీ ఆందోళనల వల్ల కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి రావడంతో ఈ ప్రతిపాదనను తాత్కాలికంగా వాయిదా వేసింది. ఇప్పుడు ప్రత్యేక సమావేశాల్లో బిల్లులను ఆమోదించుకోవాలని భావిస్తోంది.

అయితే, సర్ ప్రక్రియకు వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగుతోన్న వేళ.. ఈ బిల్లులు చర్చకు వస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. లోక్ సభలో ఎన్డీఏ కూటమికి మెజారిటీ ఉన్నప్పటికీ, రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండొంతుల సంఖ్యాబలం (సుమారు 360 స్థానాలు) వారికి లేదు. తృణమూల్ కాంగ్రెస్కు చెందిన 20మంది ఎంపీలు, శివసేన (యూబీటీ)కి చెందిన ఆరుగురు ఎంపీలు అధికార పక్షంలో చేరడంతో ప్రభుత్వ బలం పెరిగింది.

ఈ బిల్లులకు మరింత మద్దతు కూడగట్టేందుకు కేంద్ర ప్రభుత్వం డీఎంకే సహా పలు చిన్న పార్టీలతో చర్చలు జరుపుతున్నట్లు ఢిల్లీకి చెందిన మీడియా సంస్థలు వార్తలు రాస్తున్నాయి.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

పార్టీలన్నీ కూడా సీపీఐ, సీపీఎం ఇతర పార్టీలు కలిసికట్టుగా ఉద్యమం చేయాల్సిన అంశంపై చర్చించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సీపీఎం, సీపీఐ మద్దతుతో నడుస్తున్న తరుణంలో, వచ్చే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థికి మద్దతు ఇవ్వవలసిందిగా కోరగా వామపక్షాల నేతలు సానుకూలంగా స్పందించారు. శనివారం ఈ అంశంపై పార్టీపరంగా చర్చించి సానుకూల నిర్ణయాన్ని వెల్లడిస్తామని సీపీఎం నాయకులు చెప్పారు.

'కల్యాణలక్ష్మి, షాదీముబారక్' పిటిషన్‌ను హైకోర్టు సీజే ధర్మాసనం విచారించాలె

(మొదటి పేజీ తరువాయి)

పెండింగులో ఉన్న రిట్ పిటిషన్ ను విచారణ కోసం ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని డివిజన్ బెంచ్ ముందు లిస్ట్ చేయండి' అని సీజేఐ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇదీ నేపథ్యం..

సంఘటిత నిధి నుంచి ఖర్చు చేసే ప్రభుత్వ ధనానికి చట్టపరమైన అనుమతులు ఉండాలని.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్లకు అలాంటి అనుమతులేమీ లేవని.. అందువల్ల ఈ అంశాన్ని సమీక్షించాలని కోరుతూ విజయ్గోపాల్ ఈ ఏడాది హైకోర్టును ఆశ్రయించారు. ఈ పథకాల కోసం ప్రభుత్వం ఇంతవరకు రూ.16 వేల కోట్లకు పైగా ఖర్చు చేసినందున వాటి రాజ్యాంగబద్ధతను పరిశీలించాలని కోరారు. ఏకసభ్య ధర్మాసనం దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసినా తమ విధాన నిర్ణయాన్ని సమర్థించుకుంటూ కౌంటర్లు దాఖలు చేయకపోవడంతో మొత్తం 8 జీఓలపై హైకోర్టు ఆగస్టు 12న స్టే విధించింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంతవరకు ఈ రెండు పథకాల కింద చెల్లింపులు చేయకూడదని ఆదేశించింది.

ఆ ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం డివిజన్ బెంచ్ ముందు సవాల్ చేయగా.. ఏకసభ్య ధర్మాసనం జారీ చేసిన ఉత్తర్వులను ఎత్తేస్తూ సెప్టెంబరు 1న ఉత్తర్వులు జారీచేసింది. సింగిల్ జడ్జి వద్ద ఉన్న పిటిషన్ విచారణ ప్రక్రియను కూడా నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. దాన్ని సవాల్ చేస్తూ విజయ్ గోపాల్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ పై విచారించిన సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం హైకోర్టు డివిజన్ బెంచ్ సెప్టెంబరు 1న జారీచేసిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. అయితే ఏకసభ్య ధర్మాసనం ముందున్న విచారణను నిలిపివేసినందున ఆ రిట్ పిటిషన్ అక్కడి సీజే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టాలని సుప్రీం కోర్టు ఆదేశించింది.

హ్యుందాయ్ ప్లాంట్ ఏర్పాటు చేయండి

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, జహీరాబాద్‌లో ప్రతిపాదిత ప్రాజెక్టు పురోగతిపై చర్చించారు. రాష్ట్రంలో తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. జహీరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న హ్యుందాయ్ గ్లోబల్ పరిశోధన కేంద్రానికి సంబంధించిన పెండింగ్ అనుమతులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని నేషనల్ ఇన్వెస్ట్ మెంట్ అండ్ మ్యానుఫాక్చరింగ్ జోన్‌లో రూ.8,528 కోట్ల పెట్టుబడితో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ ఇంటిగ్రేటెడ్ గ్లోబల్ ఆర్అండ్ డీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. 678 ఎకరాల్లో విడతలవారీగా అభివృద్ధి చేయనున్న ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తం 4,276 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ప్రాజెక్టు పురోగతిని హ్యుందాయ్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. రాబోయే కొద్ది నెలల్లోనే ఆర్ అండ్ డీ కేంద్రం నిర్మాణానికి భూమిపూజ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రాజెక్టు పనులు వేగంగా ముందుకు సాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. దీనిపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి... అవసరమైన అనుమతుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హ్యుందాయ్ సంస్థకు హైదరాబాద్‌తో రెండు దశాబ్దాల అనుబంధం ఉంది. హైటెక్ సిటీలోని కేంద్రం అధునాతన వాహన ఇంజినీరింగ్‌కు మద్దతునిస్తూ కీలక కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ సామర్థ్యాలను మరింత విస్తరించేలా జహీరాబాద్‌లో గ్లోబల్ పరిశోధన, మెగా టెస్టింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రం ద్వారా వాహనాల రూపకల్పన, పరీక్షలు, పనితీరు, ధ్రువీకరణ, నాణ్యతా ప్రమాణాల పరిశీలనతోపాటు ఇంజినీరింగ్ ప్రక్రియలను మరింత మెరుగుపరిచేందుకు అవకాశం కలగనుంది. హ్యుందాయ్ అధునాతన సాంకేతిక సామర్థ్యాలను బలోపేతం చేయడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుంది. దేశంలో తెలంగాణ భౌగోళికంగా మధ్యలో ఉందని, హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు కలిగిన నగరమని ముఖ్యమంత్రి తెలిపారు. దేశంలోని ఆరు ప్రధాన మెట్రోపాలిటన్ నగరాలతో పోలిస్తే హైదరాబాద్ సురక్షితమైన, జీవించడానికి అనుకూలమైన కాస్మోపాలిటన్ నగరంగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. కార్ల తయారీ పరిశ్రమకు అవసరమైన రవాణా, మౌలిక సదుపాయాలు తెలంగాణలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. రహదారులు, రైలు మార్గాలు, విమానాశ్రయాల తోపాటు భవిష్యత్తులో ఓడరేవులకు హైస్పీడ్ కనెక్టివిటీ కల్పించే ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. ప్రత్యేక మొబిలిటీ క్లస్టర్ల అభివృద్ధితో వాహన తయారీ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని చెప్పారు. పెరి-అర్బన్ రీజియన్ వంటి ప్రణాళికల ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, తయారీ రంగంలో పెట్టుబడులకు తెలంగాణ అనువైన వేదికగా నిలుస్తుందని సీఎం వివరించారు. తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో 2024 ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం హ్యుందాయ్ ప్రతినిధులతో చర్చలు జరిపింది. అనంతరం 2025 జూన్లో హ్యుందాయ్ ఆర్అండ్డీ కేంద్రం ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది. ప్రపంచ స్థాయి సౌకర్యాలతో భారీ శాటిలైట్ నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని సీఎం హ్యుందాయ్ ప్రతినిధి బృందానికి వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను తెలియజేస్తూ, రాబోయే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు హాజరుకావాలని సంస్థ యాజమాన్యాన్ని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు.

డబుల్ డ్యూటీ చేసినోళ్లకు నగదు మాత్రమే ఇవ్వాలె

(మొదటి పేజీ తరువాయి)

ఉండటం లేదు. దీంతో షెడ్యూల్ సర్వీసుల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అందువల్ల డబుల్ డ్యూటీలు చేసిన సిబ్బందికి డబుల్ డ్యూటీ అడ్వాన్స్ చెల్లించాలే తప్ప డీఆఫ్, సీఆఫ్ మంజూరు చేయవద్దు. డిపోల్లో అన్ని షెడ్యూల్ సర్వీసులు నడిచేందుకు సరిపడా డ్రైవర్లు, కండక్టర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఈ ఆదేశాల అమలుపై నివేదిక సమర్పించాలి' అని పేర్కొంది. ఈ నిర్ణయంపై కార్మిక సంఘాల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది.

ఆర్టీసీలో అదే పనిగా చట్ట ఉల్లంఘన..

ఆర్టీసీలో చట్టాల్ని పదేపదే ఉల్లంఘిస్తున్నారని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్డబ్ల్యూఎఫ్) ఆందోళన వ్యక్తం చేసింది. 'డబుల్ డ్యూటీలు చేసే సిబ్బందికి మోటార్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ చట్టం-1961 ప్రకారం ఓవర్టైమ్ చెల్లించాలి. అర్హత మేరకు డీఆఫ్, సీఆఫ్లు అనుమతించాలి. డబుల్ డ్యూటీ చేసినప్పుడు సాధారణ వేతనానికి రెట్టింపు చెల్లించాలని చట్టంలో ఉంది. కానీ ప్రస్తుతం డబుల్ డ్యూటీ అడ్వాన్స్ పేరుతో కొంత మొత్తం ఇస్తున్నారు తప్ప ఓవర్టైమ్ను క్లెయిమ్ చేసుకోనివ్వట్లేదు. చట్టంలోని నిబంధనల ప్రకారం ఓవర్టైమ్ చెల్లింపులు, విశ్రాంతి రోజులకు సంబంధించిన ప్రయోజనాలను అమలు చేయాలి' అని సంఘం అధ్యక్షుడు వీరాంజనేయులు, ప్రధాన కార్యదర్శి వి.ఎస్.రావు పేర్కొన్నారు. ఈడీ (ఆపరేషన్స్) జారీచేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కోరారు.

రోహిత్ వేముల బిల్లు సిద్ధం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

సీనియర్ సివిల్ సర్వెంట్ల కమిటీ రెండో సమావేశం జరిగింది. ప్రతిపాదిత బిల్లు రూపకల్పనకు అనుసరించాల్సిన విధానం, కమిటీ కూర్పు, న్యాయపరమైన అంశాలు, వివిధ వర్గాలతో సంప్రదింపుల ప్రక్రియపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. విద్యార్థుల హక్కులకు సమర్థవంతమైన రక్షణ కల్పించేలా చట్టాన్ని రూపొందించేందుకు స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని ఉప ముఖ్యమంత్రి అదికారులకు దిశానిర్దేశం చేశారు. 'రోహిత్ వేముల చట్ట రూపకల్పన ప్రక్రియకు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ (ఎస్సీడీడీ) నాయకత్వం వహించాలని సూచించారు. అవసరమైన సంబంధిత శాఖలు, సంస్థలకు కమిటీలో ప్రాతినిధ్యం కల్పించాలని, న్యాయశాఖను భాగస్వామిగా చేర్చాలని స్పష్టం చేశారు. విద్యాశాఖ, హోంశాఖ, యూజీసీ తదితర సంస్థల భాగస్వామ్యంపై పరిశీలన జరపాలని సూచించారు. కమిటీని వీలైనంత త్వరగా ఏర్పాటు చేసి, ముసాయిదా తయారీకి అవసరమైన కార్యాచరణను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు.

ఢిల్లీలో నిరసనలను నిషేధించాలి

ప్రధాని మోడీకి వర్తక సంఘాల లేఖ

ఢిల్లీ, అక్టోబర్ 16:దేశ రాజధాని ఢిల్లీలో వరుస ఆందోళనలు, నిరసన ప్రదర్శనల కారణంగా తమ వ్యాపారాలు దారుణంగా దెబ్బతిన్నాయని వర్తక సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. దసరా, ధంతేరస్, దీపావళి వంటి అత్యంత కీలకమైన పండుగల సీజన్లో (అక్టోబర్-డిసెంబర్) వ్యాపార కేంద్రాలలో నిరసనలను వెంటనే నిషేధించాలని, ఆందోళనల వల్ల జరిగిన రూ. 2,000 కోట్ల మేర నష్టాన్ని ఆందోళనకారుల నుంచే రికవరీ చేయాలని డిమాండ్ చేస్తూ లాజ్పత్ నగర్, సరోజినీ నగర్, ఆటోమోటివ్ పార్ట్స్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ రాశారు. అక్టోబర్ 10న జరిగిన ఆందోళనలు, ఆ తర్వాత నెలకొన్న ఉద్రిక్తతల వల్ల భయాందోళన చెందిన వినియోగదారులు దాదాపు 4-5 రోజుల పాటు మార్కెట్లకు రాకపోవడంతో షాపులు వెలవెలబోయాయని వర్తకులు లేఖలో పేర్కొన్నారు.

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

(మొదటి పేజీ తరువాయి)

సెమీకండక్టర్లు, అలాగే టెక్స్టైల్స్ వంటి అధునాతన రంగాలలో పారిశ్రామిక భాగస్వామ్యాల కోసం కర్ణాటక వ్యాపార దిగ్గజాలకు విభిన్న ప్రతిపాదనలను అందజేశారు.'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం దూసుకెళ్తోందని మంత్రి స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఒక లక్ష కోట్ల డాలర్లకు, అలాగే 2047 నాటికి ఏకంగా 3 లక్షల కోట్ల డాలర్ల మహా ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆయన వివరించారు. ఈ సమ్మిట్ ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక వృద్ధి మరింత వేగవంతం కానుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మేడిగడ్డ దగ్గర బాంబ్ పేలిన ఘటన కేసుపై విచారణ జరపాలి?

మాజీ ఈఎన్సీ మురళీధర్ రావు సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, మనం ప్రతినిధి: మేడిగడ్డ బ్యారేజీపై మాజీ ఈఎన్సీ మురళీధర్ రావు సంచలన వ్యాఖ్యల చేశారు. మేడిగడ్డ దగ్గర బాంబ్ పేలిన శబ్దం వచ్చింది దీని మీద ఇనివెస్టిగేషన్ చేయండని కాంగ్రెస్ మంత్రుల సమక్షంలో స్పష్టం చేశారు. అక్టోబర్ 21, 2023న మేడిగడ్డ ఏడవ బ్లాకు దగ్గర బాంబు పేలినట్లు పెద్దగా శబ్దం వచ్చింది. పెద్ద చప్పుడు రావడంతో బాంబు పేలిందని అనుమానించి పోలీసులకు ఫిర్యాదు చేశాం. పోలీసులు కూడా ప్రాథమిక విచారణ చేశారని వెల్లడించారు. మట్టి, ఇసుక కుంగడం వల్ల ప్రమాదం జరిగితే స్తంభాలకు పగుళ్లు రావని నిపుణులు చెబుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రేవంత్ రెడ్డి మేడిగడ్డ బ్యారేజీ రిపేర్లకు ఆసక్తి చూపించడం లేదన్నారు. అసాంఘిక శక్తులు బ్యారేజీని కూల్చడానికి కుట్ర చేసినట్లు అప్పట్లో ఇంజినీర్లు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. రాజకీయ కుట్రతోనే మేడిగడ్డ పిల్లర్లను బాంబుతో పేల్చారని బీఆర్ఎస్ నాయకులు సైతం మొదటి నుంచి ఆరోపణలు చేస్తున్నారు. కాగా, మురళీధర్ రావు వ్యాఖ్యలతో మేడిగడ్డపై బీఆర్ఎస్ నేతల అనుమానాలు బలపడుతున్నాయి. ఇప్పటికైనా విచారణ చేయాలని ఆయన అభ్యర్థించారు.

ఎల్నినో ఎఫెక్ట్

'నెట్ జీరో' బాటలో తెలంగాణ

ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంధన పరిరక్షణ చర్యలు చేపట్టాలంటూ ● ఉత్తర్వులు జారీ

హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ భవనాలు, కార్యాలయాల్లో ఎయిర్ కండిషనర్ల (ఏసీ) ఉష్ణోగ్రతను 25 డిగ్రీల సెల్సియస్ వద్ద ప్రామాణికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. విద్యుత్ వినియోగాన్ని తగ్గించడం, గరిష్ఠ విద్యుత్ డిమాండును నియంత్రించడంతో పాటు ఇంధన పరిరక్షణను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ మేరకు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ జీవో ఎంఎస్ నం. 3 పేరుతో ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి 'నెట్ జీరో' రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు 'తెలంగాణ రైజింగ్ బై 2047' విజన్ డాక్యుమెంటును ప్రభుత్వం అనుసరిస్తోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో అమర్చే కూలింగ్ వ్యవస్థల వల్లే పీక్ అవర్లలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతోందని, ఇక్కడ ఉష్ణోగ్రత నియంత్రణ పాటించడం ద్వారా వెంటనే విద్యుత్ ను ఆదా చేయవచ్చని ప్రభుత్వం పేర్కొంది.

ఈ క్రమంలో బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) గతంలో ఇచ్చిన మార్గదర్శకాలు, జాతీయ-అంతర్జాతీయ విధానాలను పరిగణనలోకి తీసుకుని, ప్రభుత్వ కార్యాలయాల్లో ఏసీల ఉష్ణోగ్రత 25 డిగ్రీల కంటే తక్కువ కాకుండా చూడాలని టీజీ రెడ్కో ఎండీ ముషారఫ్ ఫరూఖీ ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఆ ప్రతిపాదనను పరిశీలించిన ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా దీన్ని తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

ఈ నిబంధనను పాటించడం ద్వారా విద్యుత్ ఆదా కావడమే కాకుండా ఉద్యోగులకు ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రత్యేక అవసరాలు ఉన్న విభాగాలకు మినహాయింపునిస్తూ, మిగిలిన అన్ని ప్రభుత్వ శాఖలు, విభాగాధిపతులు, కలెక్టర్లు ఈ నిబంధనలు ఖచ్చితంగా అమలయ్యేలా చూడాలని ఆదేశించారు.

పెట్రోల్‌పై సుంకం పెంపు,

డీజిల్ పై తగ్గింపు

ఢిల్లీ, అక్టోబర్ 16: దేశీయంగా ఇంధన ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ ఎగుమతి సుంకాన్ని భారీగా పెంచగా.. డీజిల్ ఎగుమతిపై విధిస్తున్న సుంకాన్ని భారీగా తగ్గించింది. ఈ కొత్త సవరించిన పన్నులు అమల్లోకి వచ్చినట్లుగా ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి. లీటర్ పెట్రోల్ పై ఎక్స్పోర్ట్ డ్యూటీని రూ.0.50 పైసల నుంచి ఏకంగా రూ.2.50కి అంటే ఐదు రెట్లు పెంచారు. ఇక లీటరు డీజిల్ పై ఎక్స్ పోర్ట్ డ్యూటీని రూ.16 నుంచి ఏకంగా రూ.8.50కి అంటే సగానికి తగ్గించారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తుల ధరల్లో వస్తున్న హెచ్చుతగ్గులకు అనుగుణంగా ప్రతీ 15 రోజులకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం ఈ విండ్ఫాల్ ట్యాక్సును సమీక్షించి సవరిస్తుంటుంది. అంతర్జాతీయ ధరల సరళికి అనుగుణంగానే ఈ తాజా మార్పులు చేసినట్లుగా తెలుస్తోంది. అయితే, ఆయిల్ రిఫైనరీలు విదేశాలకు ఇంధనాన్ని ఎగుమతి చేయడం ద్వారా అధిక లాభాలు గడించకుండా నియంత్రించేందుకు భారత్ మొదటిసారిగా 2022 జూలైలో ఈ విండ్ ఫాల్ పన్నులను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే.

వరంగల్ సూపర్ స్పెషాలిటీ సిద్ధం..

దసరా నుంచి ఓపీ సేవలు

నవంబరు, డిసెంబరులలో పూర్తి స్థాయిలో వైద్య సేవలు

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 16 : ఎంజీఎం భవనం శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవనంలోకి వైద్య విభాగాలను తరలించి సేవలు అందించనున్నట్లు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ క్రమంలోనే 24 అంతస్తులతో నిర్మించిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో తొలుత ఓపీ సేవలను దసరా రోజు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. నవంబరు నెలాఖరుకు గానీ, డిసెంబరులోగానీ పూర్తి స్థాయిలో వైద్యసేవలు ఇక్కడ ప్రారంభమయ్యేలా ఏర్పాట్లు చేస్తామన్నారు.

గురువారం మంత్రి సీతక్క, పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి కొత్తగా నిర్మించిన ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. ఓపీ సేవలు ప్రారంభిస్తున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. చేయాల్సిన ఏర్పాట్లపై సూచనలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 'గత ప్రభుత్వం జీవోలు ఇచ్చేసి అసంపూర్తిగా నిర్మాణాలు చేపట్టి మొండిగోడల దశలో ఈ భవనాన్ని వదిలేసింది. మేము అధికారంలోకి వచ్చాక ఆర్థిక ఇబ్బందులున్నా ఎక్కడా ఆటంకాలు లేకుండా నిర్మాణాన్ని పూర్తి చేశాం' అని అన్నారు. మంత్రుల వెంట రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు, కుడా చైర్మన్ సుధారాణి, కలెక్టర్లు సత్యశారద, చాహత్ బాజ్ పాయ్ తదితరులున్నారు.

ఎల్ నినో ప్రభావాన్ని ప్రజలకు వివరించండి

కాంగ్రెస్ శ్రేణులకు పీసీసీ చీఫ్ బహిరంగ లేఖ

హైదరాబాద్, అక్టోబర్ 16(మనం బ్యూరో): తెలంగాణ మరోసారి తీవ్రమైన ప్రకృతి సవాలును ఎదుర్కొంటోందనీ, ఎల్నినో ప్రభావం, వర్షపాతంలో తీవ్ర లోటు, జలాశయాల్లో తగ్గుతున్న నీటి నిల్వలు, భూగర్భజలాలపై పెరుగుతున్న ఒత్తిడి, వ్యవసాయానికి నీటి కొరత, పెరుగుతున్న విద్యుత్ డిమాండ్-ఇవన్నీ కలిపి రాబోయే నెలల్లో రాష్ట్రానికి తీవ్రమైన సవాల్‌గా మారే పరిస్థితి కనిపిస్తోందని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. రాష్ట్రంలో ఎల్నినో ప్రభావంతో ఏర్పడుతున్న వర్షాభావ పరిస్థితులపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లి వాస్తవ పరిస్థితిని వివరించాలని పేర్కొన్నారు. ఈమేరకు ఆయన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ బహిరంగ లేఖ రాశారు. ఇది కేవలం వర్షాలు తక్కువ పడిన సమస్య కాదనీ, తాగునీటి సమస్య, వ్యవసాయ సమస్య. విద్యుత్ సమస్య అని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పుడు సాధారణ వర్షాపాతం కంటే చాలా తక్కువ వర్షం పడిందనీ, అందువల్ల కేవలం రాష్ట్ర సగటు చూసి పరిస్థితి సాధారణంగా ఉందని చెప్పడం ప్రమాదకరమనీ, సగటు సంఖ్య కంటే గ్రామీణ తెలంగాణలోని వాస్తవ పరిస్థితిని చూడాలన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో ప్రస్తుతం జలాశయాలలో నీటి నిల్వలు 460 టీఎంసీ లు ఉండాల్సి ఉండగా ఇప్పుడు 209 టీఎంసి లు మాత్రమే ఉన్నాయన్నారు. ఇది తీవ్రమైన కరవుకు నిదర్శనం.. ఈ నీటిని మనం చాలా పొదుపుగా వాడుకోవాలి. ఇది గ్రామీణ తెలంగాణకు చాలా తీవ్రమైన హెచ్చరిక. ఎందుకంటే చెరువులు నిండకపోతే చెరువులు - భూ గర్భజలాలు - బోర్లు - వ్యవసాయం - రైతు ఆదాయం అనే మొత్తం వ్యవస్థపై ప్రభావం పడుతుందని చెప్పారు. ముప్పు వర్షాభావం కేవలం గ్రామాల సమస్య కాదు..హైదరాబాద్ నగరానికి, పట్టణ ప్రాంతాలకు తాగునీరు అందించే ప్రధాన వనరులపై కూడా ఒత్తిడి పెరుగుతుందనీ, నీరు ఉన్నప్పుడే దాని విలువ తెలియదు. నీరు తగ్గిన తర్వాత దాని విలువ తెలుస్తుంది. అందుకే ఇప్పటి నుంచే నీటి పొదుపు ఉద్యమంగా మారాలని ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

రైతులను త్యాగాలు కోరడమేంది?

ముందస్తు హెచ్చరికలున్నా ప్రభుత్వ చర్యలు శూన్యం

తెలంగాణ రక్షణసేన అధ్యక్షురాలు కవిత

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం.. రాబోయే రోజుల్లో మరింత నీటి కొరతను ఎదుర్కోవడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రభుత్వానికి దూరదృష్టి కొరవడిందని ఆమె ఆరోపించారు. ఈ మేరకు బంజారాహిల్స్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో కవిత మీడియాతో మాట్లాడుతూ రేవంత్ సర్కార్‌పై తనదైన శైలీలో మండిపడ్డారు. ఎల్‌నినో ప్రభావంపై నిపుణులు ఏడాది ప్రారంభంలోనే హెచ్చరించినా ప్రభుత్వం పట్టించుకోలేదని, సకాలంలో నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమైందని అన్నారు. పొరుగు రాష్ట్రాలు ఇప్పటికే కరవు మండలాలను ప్రకటించి కేంద్రానికి నివేదికలు సమర్పించాయని, కానీ తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు రైతులను త్యాగాలు చేయాలని కోరడం దారుణమని ఆమె విమర్శించారు. అధికారంలోకి వచ్చి దాదాపు 30 నెలలు గడుస్తున్నా ఇంకా పాత ప్రభుత్వంపై నిందలు వేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. వ్యవసాయ కూలీలకు

ఏటా రూ.12,000 ఇచ్చే పథకాన్ని తక్షణమే అమలు చేయాలని, కరవు పరిస్థితుల దృష్ట్యా వారికి జీవిత బీమా సౌకర్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ఢిల్లీలో రాజ్యాంగ విలువల గురించి మాట్లాడుతూ, రాష్ట్రంలో మాత్రం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఖైరతాబాద్‌లో బలమైన అభ్యర్థిని నిలబెడతామని ఆమె ప్రకటించారు. దసరా రోజున ఒక ఎమ్మెల్సీ అభ్యర్థిని కూడా ప్రకటిస్తామని తెలిపారు.

1,000 టీఎంసీల గోదావరి, కృష్ణా జలాలను వృథాగా వదిలిండ్రు

తెలంగాణలో నీటి ఎద్దడికి కాంగ్రెస్ నిర్లక్ష్యమే కారణం: కేటీఆర్

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న నీటి ఎద్దడికి ప్రకృతి కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో కనిపిస్తున్నది కాలం తెచ్చిన కరవు కాదని, అది కాంగ్రెస్ సర్కారు తెచ్చిన 'చేతకాని కరవు' అని విమర్శించారు. పంపులు ఆన్ చేయకుండా, రిజర్వాయర్లను నింపకుండా నీటిని వృథాగా దిగువకు వదిలేశారని మండిపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. అయితే, ఈ ఏడాది జూన్ 1 నుంచి ఇప్పటివరకు 1,000 టీఎంసీల నీరు వృథా చేశారని, అందులో 750 టీఎంసీలకు పైగా గోదావరి నీటిని, 250 టీఎంసీల కృష్ణా జలాలను సముద్రంలోకి, దిగువ ప్రాంతాలకు వదిలేశారని కేటీఆర్ పేర్కొన్నారు. కన్నెపల్లి, దేవాదుల పంపులను సక్రమంగా నిర్వహించి వినియోగించుకుని ఉంటే గోదావరి పరివాహక ప్రాంతంలోని రిజర్వాయర్లు, చెరువులు నిండేవని అన్నారు. కానీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కృష్ణా జలాలను వినియోగించుకునేందుకు వీలున్న పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల పంపులను ఆన్ చేయకుండా నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ప్రాజెక్టుల ద్వారా నీటిని ఎత్తిపోసి నిల్వ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని ధ్వజమెత్తారు.

ఎల్‌నినో హెచ్చరికలున్నా ముందస్తు చర్యలు శూన్యం..

ఎల్‌నినో ప్రభావం ఉండవచ్చని మార్చి నుంచే వాతావరణ నిపుణులు హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించలేదని కేటీఆర్ ఆరోపించారు. నీటి లభ్యతపై ముందుగానే అంచనాలు వేసి, సాగు, తాగునీటి అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సిందని అన్నారు.

డిండి ప్రాజెక్టు రద్దు చేయ్? చేయకపోతే ఉద్యమమే

పాలమూరు రైతులను కాపాడేందుకు బీజేపీ పోరాడుతది? : డీకే అరుణ

హైదరాబాద్, మనం ప్రతినిధి : డిండి ఎత్తిపోతల పథకాన్ని వెంటనే రద్దు చేయాలని బీజేపీ ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు. పాలమూరు రైతులకు కేటాయించిన నీటిని డిండికి తరలించి, స్థానిక రైతుల ప్రయోజనాలకు నష్టం కలిగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆమె తీవ్రంగా ఆరోపించారు. ఈ ప్రాజెక్టును రద్దు చేయని పక్షంలో జిల్లా వ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని ఆమె హెచ్చరించారు. మహబూబ్ నగర్‌లో పాలమూరు-రంగారెడ్డి పెండింగ్ ప్రాజెక్టులపై బీజేపీ ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో డీకే అరుణ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. జిల్లా ప్రజలకు మేలు చేయని సీఎం కుర్చీ రేవంత్ రెడ్డికి ఎందుకు? అంటూ ఆమె ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. గతంలో పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్... ఆర్డీఎస్ కోసం చేసిందేమీ లేదని డీకే అరుణ దుయ్యబట్టారు. రైతులు, అసంపూర్తిగా ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల విషయంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడిందని ఆరోపించారు. పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ తక్షణమే పూర్తి చేయాలని ఆమె డిమాండ్ చేశారు. పాలమూరు రైతుల నీటి హక్కులను కాపాడేందుకు బీజేపీ ఎల్లప్పుడూ పోరాడుతుందని స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో ఫేక్ డిఫెన్స్ కంపెనీలు

వీటికి కాంగ్రెస్ నేతల కుటుంబాలతో సంబంధాలున్నయ్?

ఈ వ్యవహారంపై రక్షణ మంత్రిత్వ శాఖ దర్యాప్తు జరపాలన్న కేటీఆర్

హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో హైదరాబాద్ ఫేక్ ఏయిరోస్పేస్, డిఫెన్స్ షెల్ కంపెనీలకు అడ్డాగా మారుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తక్షణమే విచారణకు ఆదేశించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతల కుటుంబాలతో సంబంధం ఉన్న.. మూడు కంపెనీల పేర్లను ప్రస్తావించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబానికి చెందిన 'టెసరాక్ట్', మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి చెందిన 'రాఘవ ఏరోస్పేస్', 'ఐంద్రి డిఫెన్స్' సంస్థలు వాటిలో ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఈ షెల్ కంపెనీలు రక్షణ రంగానికి పరికరాలు, సమాచారం సరఫరా చేస్తే దేశ భద్రతకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నకిలీ కంపెనీల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను బైట పెట్టాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌ను కేటీఆర్ డిమాండ్ చేశారు.

వ్యర్థాల అక్రమ డంపింగ్‌పై కఠిన చర్యలు

జీవో 626 ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు

ప్రభుత్వ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్

హైదరాబాద్ ,అక్టోబర్ 16(మనం న్యూస్): హైదరాబాద్ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న నిర్మాణ వ్యర్థాల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర దృష్టి సారించింది. నగరంలో రోజూ రెండు వేల మెట్రిక్ టన్నుల నిర్మాణ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయని, రియల్ ఎస్టేట్ వ్యాపారులతో పాటు కొన్ని ప్రభుత్వ శాఖలు కూడా వీటి పట్ల నిర్లక్ష్యం వహించడం క్షమారాని నేరమని ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ హెచ్చరించారు. వ్యర్థాల సేకరణ, రవాణా, పర్యవేక్షణలో అధికారులదే పూర్తి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం, హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా అర్బన్ డెవలప్‌మెంట్ రీ సస్టైనబిలిటీ సంయుక్త ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ) లో శుక్రవారం కన్‌స్ట్రక్షన్ అండ్ డెమోలిషన్ వేస్ట్ మేనేజిమెంట్ రూల్స్ 2025కు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు 626పై అవగాహన సదస్సు ఘనంగా జరిగింది. ఈ సదస్సుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఎస్కీ డైరెక్టర్ హర్పాల్ సింగ్ గ్రేవల్, రీ సస్టైనబిలిటీ సీఈవో మసూద్ మాలిక్ తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా జయేష్ రంజన్ మాట్లాడుతూ, నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ అక్రమంగా డంపింగ్ చేస్తే సహించేది లేదని, పాల్పడిన వారిపై అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగర పరిశుభ్రతకు, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని స్పెషల్ సీఎస్ పిలుపునిచ్చారు. సదస్సులో హైడ్రా కమీషనర్ రంగనాథ్ మాట్లాడుతూ, ప్రభుత్వ కాంట్రాక్టర్లతో పాటు ప్రైవేట్ రంగంలోని వందలాది మంది కాంట్రాక్టర్ల కోసం దసరా పండుగ తరువాత ఇదే వేదికపై జీవో 626పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. నిర్మాణ వ్యర్థాల పునర్వినియోగంపై విస్తృత ప్రచారం కల్పిస్తామన్నారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ హర్పాల్ సింగ్ గ్రేవల్ మాట్లాడుతూ, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ ద్వారానే నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. ఈ ఏడాది ఎల్నినో ప్రభావంతో వర్షపాతం తగ్గినందున, నీటి సంరక్షణకు మరియు పునర్వినియోగానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రీ సస్టైనబిలిటీ లిమిటెడ్ సీఈవో మేనేజింగ్ డైరెక్టర్ మసూద్ మాలిక్ మాట్లాడుతూ, సర్క్యులర్ ఎకానమీ విధానంలో భాగంగా జీడిమెట్ల, ఫతుల్ గూడా ప్లాంట్లలో నిర్మాణ వ్యర్థాల ద్వారా పేవింగ్ బ్లాక్స్, హ్యూమ్ పైప్స్, ఆర్సీసీ బెంచ్లు, పార్కింగ్ టైల్స్ను తయారు చేస్తున్నామని వెల్లడించారు. ఈ ఉత్పత్తులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, హైడ్రా, హెచ్ఎండీఏ తదితర కీలక శాఖలతా పాటు మున్సిపల్ అడిషనల్ కమిషనర్లు రఘుప్రసాద్, కే వేణుగోపాల్ మరియు పలువురు ఉన్నతాధికారులు పాల్గొని జీవో 626 ఆశయాలు, జరిమానాలపై సమగ్రంగా చర్చించారు.

మెడికవర్‌లో రేవంత్ సన్నిహితులకు వాటాలు: మన్నెక్రిశాంక్

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ సచివాలయం ప్రక్కనే ఉన్న మెడికవర్ ఆసుపత్రి వ్యవహారంపై సీఎంకు బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి కుటుంబానికి అత్యంత సన్నిహితులైన వ్యక్తులకు మెడికవర్ ఆసుపత్రితో పాటు ఇతర అనుబంధ సంస్థల్లో వాటాలు ఉన్నాయని ఆరోపిస్తూ, అందుకు సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయంటూ సోషల్ మీడియాలో ఒక వీడియోను విడుదల చేశారు. సీఎంకు సన్నిహితులంటూ ఆయన ముగ్గురి పేర్లను వెల్లడించారు. డుంపా శిరీషరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, అన్నం శరత్ రెడ్డిలకు మెడికవర్ ఆసుపత్రి, మ్యాక్స్‌బిన్ ఫార్మా, మైండ్ వాల్ట్ సంస్థల్లో ఉన్న షేర్ల వివరాలను సంఖ్యలతో సహా వెల్లడించారు. మెడికవర్ ఆసుపత్రిని రూ.13,200 కోట్లకు విక్రయించారని, ఈ లావాదేవీ ద్వారా నల్లధనాన్ని తెల్లధనంగా మార్చారని క్రిశాంక్ తీవ్ర ఆరోపించారు.

ఎమ్మెల్సీగా గడల శ్రీనివాసరావును గెలిపించండి

గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' ప్రచార రథాన్ని ప్రారంభించిన పవన్ కల్యాణ్

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణలో పోటీ చేయాలనే సంకల్పంలో ఉన్న జనసేన.. ఎట్టకేలకు అన్ని పార్టీలకంటే ముందుగానే ఓ అడుగు ముందుకేసింది. ఇప్పటికే తమ అభ్యర్థిని ప్రకటిం చిన టీ.జనసేన... ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి రూపొం దించిన 'జనసేన గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' ప్రచార రథాన్ని పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేతులమీ దుగా జనసేన రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారంనా డు ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజక వర్గ జనసేన అభ్యర్థిగా బరిలో ఉన్న డా.గడల శ్రీనివాసరావుకు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు.

హైదరాబాద్‌లో 14 బార్లకు 4,251 అప్లికేషన్లు

2 బార్లకు 664 దరఖాస్తులు.. డ్రా తీసిన ఎక్సైజ్ శాఖ

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణలో బార్ల లైసెన్సుల కోసం భారీగా ఎగబడ్డారు. కొత్తగా కేటాయించనున్న బార్ల లైసెన్సుల కోసం నిర్వహించిన లక్కీ డ్రా ప్రక్రియ ఎట్టకేలకు పూర్తయింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలోని 41 బార్లకు ఏకంగా 8770 అప్లికేషన్లు వచ్చాయి. ఇక హైదరాబాద్‌లో అయితే మరింత డిమాండ్ వచ్చింది. నగరంలోని 14 బార్లకు 4,251 అప్లికేషన్లు వచ్చాయి. అందులో మొయినాబాద్‌లోని 2 బార్లకు 664 దరఖాస్తులు రావడం గమనార్హం. ఈ క్రమంలోనే తాజాగా బార్ల లైసెన్సులకు సంబంధించి ఎక్సైజ్ శాఖ డ్రా తీసి విజేతలను ఎంపిక చేసింది. ఇక బోధన్లోని ఒక బారుకు కేవలం 19 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.

కొత్త బార్ల లైసెన్సుల ఫీజుల రూపంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు రూ.87.71 కోట్ల ఆదాయం సమకూరింది. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి పరిధిలో కేవలం 14 బార్ల కోసం భారీ సంఖ్యలో రావడంతో అక్కడ పోటీ తీవ్రంగా కనిపించింది. మరోవైపు..బోధన్‌లో సైతం ఓ బార్‌కు కేవలం 19 దరఖాస్తులే వచ్చాయి. హైదరాబాద్ పరిధిలో నార్సింగిలో ఎక్సైజ్ శాఖ కమిషనర్ సి. హరికిరణ్ సమక్షంలో డ్రా నిర్వహించగా.. ఇతర ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో లైసెన్సీలను ఎంపిక చేశారు. హైదరాబాద్ నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో వ్యాపార అవకాశాలపై మద్యం వ్యాపారులు ఆసక్తి చూపారు. తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలోని 14 బార్లకు 4,251 దరఖాస్తులు రావడం పోటీ తీవ్రతను తెలియజేస్తోంది. ఐటీ కారిడార్లు, రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలు, ఔటర్ రింగ్ రోడ్డు పరిసరాల్లో వ్యాపార అవకాశాలను దృష్టిలో పెట్టుకుని పలువురు లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. నార్సింగిలోని ది అడ్రస్ కన్వెన్షన్

హాల్లో జరిగిన డ్రా ప్రక్రియను ఎక్సైజ్ శాఖ కమిషనర్ సి. హరికిరణ్ పర్యవేక్షించారు. సైబరాబాద్, హైదరాబాద్, మల్కాజ్‌గిరి ఎక్సైజ్ విభాగాల అధికారులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. దరఖాస్తుదారుల సమక్షంలో లాటరీ నిర్వహించి లైసెన్సీల ఎంపిక చేపట్టారు.

తెలంగాణలో ఇతర కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో కొత్తగా కేటాయించనున్న 27 బార్లకు 4,519 దరఖాస్తులు అందాయి. ఈ ప్రాంతాల్లోనూ లైసెన్సుల కోసం వ్యాపారులు పెద్ద సంఖ్యలో పోటీపడ్డారు. ఆయా జిల్లాల్లో జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో లక్కీ డ్రా నిర్వహించి లైసెన్సీలను ఎంపిక చేశారు. మొత్తం 41 బార్లకు వేల సంఖ్యలో దరఖాస్తులు రావడంతో లైసెన్సుల కేటాయింపు ప్రక్రియపై వ్యాపార వర్గాల్లో ఆసక్తి నెలకొంది. లక్కీ డ్రా ద్వారా ఎంపికైన వారికి నిబంధనల ప్రకారం బార్ లైసెన్సులు కేటాయించనున్నారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో బార్ల కోసం పోటీ మరింత ఎక్కువగా కనిపించింది. ఫ్యూచర్ సిటీ పరిసర ప్రాంతాలకు దగ్గరగా ఉన్న మొయినాబాద్‌లో రెండు బార్ల కోసం 664 దరఖాస్తులు రావడం విశేషం. చేవెళ్లలోని ఒక బార్ కోసం 279 దరఖాస్తులు వచ్చాయి. కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ పరిధిలోని అలియాబాద్‌లో ఒక బార్కు 201 దరఖాస్తులు అందాయి. యెల్లంపేట్లో రెండు బార్ల కోసం 225.. మూడుచింతలపల్లిలో రెండు బార్లకు 112 అప్లికేషన్లు వచ్చాయి. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలో రెండు బార్లకు 287 దరఖాస్తులు రాగా.. గడ్డపోతారంలో 112, కోహిర్లో 127 అప్లికేషన్లు వచ్చాయి. ఈ దరఖాస్తులు చూస్తుంటే హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో బార్ వ్యాపారంపై ఉన్న ఆసక్తిని స్పష్టం చేస్తున్నాయి.

ఇక, ఇతర జిల్లాల్లోనూ కొన్ని ప్రాంతాల్లో బార్ల లైసెన్సుల కోసం గట్టి పోటీ నెలకొంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ములుగులోని బార్కు 376 దరఖాస్తులు వచ్చాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో 357, జనగామ జిల్లా స్టేషన్ ఘన్పూర్లో 349, మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో 331, ఖమ్మం జిల్లా కల్లూరులో 325 దరఖాస్తులు నమోదయ్యాయి. నిజామాబాద్ జిల్లా బోధన్లోని బార్కు కేవలం 19 దరఖాస్తులే రావడం గమనార్హం. సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్లోని బార్కు 27 దరఖాస్తులు వచ్చాయి. వికారాబాద్ జిల్లా పరిగిలో 36, మక్తల్లో 38 దరఖాస్తులు నమోదయ్యాయి.

కొత్త బార్ లైసెన్సుల కోసం వచ్చిన దరఖాస్తుల ఫీజుల ద్వారానే రాష్ట్ర ప్రభుత్వానికి రూ.87.71 కోట్ల ఆదాయం వచ్చింది. లైసెన్సుల కోసం దరఖాస్తుదారులు చెల్లించిన ఫీజులు తిరిగి చెల్లించనివి కావడంతో.. లాటరీలో లైసెన్స్ దక్కని వారికి కూడా ఆ మొత్తం తిరిగి అందదు. వేల సంఖ్యలో దరఖాస్తులు రావడం వల్ల ప్రభుత్వ ఆదాయం గణనీయంగా పెరిగింది. లక్కీ డ్రా ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా పూర్తయిందని ఎక్సైజ్ శాఖ కమిషనర్ సి. హరికిరణ్ తెలిపారు. లైసెన్స్ ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించిన దరఖాస్తుదారులు, అధికారులు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన లైసెన్సీలకు నిబంధనల ప్రకారం తదుపరి ప్రక్రియ పూర్తి చేయనున్నారు.

తెలంగాణలో మరోసారి వర్షాలు: ఐఎండీ

హైదరాబాద్, వరంగల్ సహా 9 జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశ

వారం, పదిరోజులుగా తీవ్రమైన ఎండలు

వరుణదేవుడు కరుణిస్తే? ఎండ వేడిమి నుంచి ప్రజలకు ఉపశమనం

హైదరాబాద్, మనం ప్రతినిధి : గత వారం, పది రోజులుగా తీవ్రమైన ఎండలు, భారీ ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ తీపి కబురు అందించింది. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో దక్షిణ భారతదేశంలోని పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. దీని ప్రభావంతో తెలంగాణలోనూ వర్షాలు కురుస్తాయని స్పష్టం చేసింది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, ఖమ్మం, వరంగల్, హనుమకొండ, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఇటు తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రం ఏపీలో కూడా పలు జిల్లాల్లో అక్కడక్కడా చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. నేటి నుంచే వర్షాలు ప్రారంభమవుతాయని వాతావరణ శాఖ తెలపడంతో.. తీవ్రమైన ఉక్కపోత, వడగాడ్పులతో సతమతమవుతున్న ప్రజలకు ఇది పెద్ద ఊరట. రుతుపవనాల రాకతో ఉష్ణోగ్రతలు తగ్గి వాతావరణం చల్లబడనుంది.

గొప్ప దేశద్రోహికి బంటు

జంతర్ మంతర్ సాక్షిగా
'జ్ఞానేశ్వర్' రాజీనామా కాస్తా
ఢిల్లీ పెద్దల 'జ్ఞాన-శూన్య-ఈశ్వర్' డ్రామాగా
బ్యూటిఫుల్ గా మార్చేశారు స్వర్ణ కమలం లా!
జనం కోరిన ఓట్ల నమోదు
'ఫామ్-6' కాస్తా
దొంగచాటు చట్టాల కల్తీ 'ఫార్మ్-మిక్స్' లా
బ్యూటిఫుల్ గా మార్చేశారు స్వర్ణ కమలం లా!
ఓట్ల లెక్కలు చూడాల్సిన
నిఘార్పైన 'ఆర్టిస్ట్' కాస్తా
ప్రజా తీర్పును తొక్కేసే ఓట్ల అర్లిస్ట్ బ్రోకర్ లా
బ్యూటిఫుల్ గా మార్చేశారు స్వర్ణ కమలం లా!
కోట్ల మంది జనం హక్కు అయిన
పారదర్శక 'ఓటర్ లిస్ట్' కాస్తా
దొంగ ఓట్లతో దాన్ని 'ఓవర్ లిస్ట్' గా
మరియు దొంగల 'కాజర్ లిస్ట్' లా
బ్యూటిఫుల్ గా మార్చేశారు స్వర్ణ కమలం లా!
జనం పక్షాన నిలబడాల్సిన
పవిత్రమైన బీజేపీ కాస్తా
సామాన్యుడిని నిలువునా బాది పిండేసే
'దొడ్డ దొరల బాజో-జనతా-పీటో' లా
బ్యూటిఫుల్ గా మార్చేశారు స్వర్ణ కమలం లా!
ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన
పవిత్రమైన 'ఎలక్షన్' కాస్తా
ప్రజలను భ్రమల్లో ముంచేసే
'ఎల్యూషన్' లా
బ్యూటిఫుల్ గా మార్చేశారు స్వర్ణ కమలం లా!
ఓట్ల తీర్పును దాచే పవిత్రమైన
'బ్యాలెట్ బాక్స్' కాస్తా
నోట్ల కట్టలను వేటాడి దాచుకునే
'వాలెట్ బాక్స్'లా
బ్యూటిఫుల్ గా మార్చేశారు స్వర్ణ కమలం లా!
వ్యవస్థను ప్రశ్నిస్తూ కోర్టులు పంపే నిఖ్సాన
'లీగల్ నోటీస్' కాస్తా
ఢిల్లీ పెద్దల అండతో ఆ నోటీసులను
తూంగలో తొక్కుతూ
కేవలం 'ఈగల్ నోటీస్'లా
బ్యూటిఫుల్ గా మార్చేశారు స్వర్ణ కమలం లా!
అన్యాయాన్ని చీల్చి చెండాడుతూ సుప్రీంకోర్టు
ఇచ్చే పవిత్రమైన 'జడ్జ్మెంట్' కాస్తా
కుర్చీని కాపాడుకునేందుకు
చట్టాల సందుల్లో దూరి
ఆ తీర్పులనే దగా చేసే 'ఫడ్జ్మెంట్' లా
బ్యూటిఫుల్ గా మార్చేశారు స్వర్ణ కమలం లా!
చట్టాలను తయారుచేయాల్సిన పవిత్రమైన
'పార్లమెంట్' కాస్తా ప్రజాప్రతినిధులను
కొని అద్దెకు పెట్టుకునే కార్పొరేట్
'పార్ల-మొత్తం-రెంట్' లా
బ్యూటిఫుల్ గా మార్చేశారు స్వర్ణ కమలం లా!
నిష్పక్షపాతంగా నడవాల్సిన
'ఎన్నికల కమిషన్' కాస్తా
ఢిల్లీ పాలకుల కనుసైగలకు తలాడించే
ఒక బానిస 'సబ్-మిషన్' లా
బ్యూటిఫుల్ గా మార్చేశారు స్వర్ణ కమలం లా!
ప్రజల కష్టాలను వినిపించే
స్వతంత్ర 'మైక్రోఫోన్' కాస్తా
దొంగచాటుగా దూరే
గూఢచారి 'పెగాసస్-ఫోన్' లా
బ్యూటిఫుల్ గా మార్చేశారు స్వర్ణ కమలం లా!
తప్పు చేసిన నాయకుడిని బోనులో
నిలబెట్టే 'కోర్టు మెట్లు' కాస్తా రాజకీయ బేరసారాల
పొలిటికల్ 'రిసార్టు మెట్లు' లా
బ్యూటిఫుల్ గా మార్చేశారు స్వర్ణ కమలం లా!
కానీ ఆ దుర్మార్గాన్ని అవినీతిని
అరికట్టేందుకు ఒక నిఖార్పైన
కౌంటర్ లా'సిజెపి' పుట్టుకొస్తే
ఢిల్లీ పెద్దలు భయపడి
వీధివీధినా లారీలు
ఝుళిపిస్తూ దాన్ని కాస్తా
ఛార్జ్-జనతా-పోలీస్' లా
మార్చేస్తున్నారు చాలా గ్రేట్ గా!

- సర్వేశ్వరరావు నీలం
630 4664 725

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు

ఈ పేపర్ కోసం
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి– ఎడిటర్

దారిద్ర్య నిర్మూలనలో పాలకుల వైఫల్యాలు

ప్రేదరిక నిర్మూలన పేరిట ప్రత్యేకంగా ఏటా ఓ రోజును కేటాయించి జరుపుకొంటూనే ఉన్నాం. అదే అక్టోబర్ 17 అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినం. ప్రపంచ వ్యాప్తంగా పేదరికంలో మగ్గుతున్న వారి స్థితిగతులను అర్థం చేసుకుని, పేదరిక నిర్మూలన కోసం కృషి చేసేందుకు ఐక్యరాజ్యసమితి 1990 అక్టోబర్ 17న అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం నిర్వహించాలని అధికారికంగా ప్రకటించింది.

హింసకు అత్యంత హీనరూపం పేదరికం అనేది మహాత్మాగాంధీ మాట. దారిద్ర్యం (Poverty) ఒక సామాజిక, ఆర్థిక సమస్య. ఇది దీర్ఘకాలిక సామాజిక సమస్యగా ఉంది. సమాజంలో ఒక వర్గం కనీస అవసరాలైన ఆహారం, గృహవసతి, దుస్తులు పొందలేని పరిస్థితిని పేదరికం లేదా దారిద్ర్యం అంటారు. పేదరికంతో బాధపడుతున్న వారిని 'పేదలు' అంటారు. పేదలకు ప్రధాన ఆదాయ వనరు ఉపాధి. కాబట్టి, ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. సరైన ఉపాధి అవకాశాలు లేని ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన కష్టమైన పని. పేదరిక నిర్మూలన, సామాజిక పురోగతి కోసం చేపడుతున్న కార్యక్రమాలకు, పెరుగుతున్న ఆర్థిక అసమానతలు అతిపెద్ద సవాలుగా మారు తున్నాయి. ప్రజల చేతుల్లో డబ్బు ఉన్నంత మాత్రాన ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందినట్లు కాదు, వారికి విద్య, వైద్యం, రుణ సదుపాయం, మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలి. అవన్నీ లేవంటే సమగ్ర అభివృద్ధి జరగడం లేదని భావించాలి. ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో 2030 నాటికి పేదరికాన్ని నిర్మూలించాలన్నది ఒకటి. కానీ, ఆ గడువు పూర్తయ్యే నాటికి కూడా ప్రపంచ జనాభాలో ఆరు శాతం మంది అంతర్జాతీయ దారిద్ర్య రేఖకు దిగువనే ఉంటారని 2019 జూలైలో ఆ సంస్థ విడుదల చేసిన నివేదిక పేర్కొంది. ప్రస్తుత అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు 'పేదలకు బాగానే అందు తున్నాయి. కానీ, నిరుపేదలకు అంద డం లేదు'. కొందరి గుప్పిట్లోనే సంపద 'దారిద్యానికి అంతం పలికి సంపదను సమానంగా పంపిణీ చేద్దాం' పేరిట ప్రపంచ బ్యాంకు ఇటీవల విడుదల చేసిన నివేదిక ఆసక్తికర అంశాలను వెల్లడించింది.

101 దేశాల్లో 23.1 శాతం మంది పేదరికంలో ఉన్నట్లు తేలింది. ఇందులో సగం 18 ఏళ్లలోపువారే. అధ్యయనం జరిపిన దేశాల్లో 17.5 శాతం వయోజనులు పేదరికంలో మగ్గుతుండగా, 33.8 శాతం చిన్నారులు ఆ దురవస్థలో కూరుకు పోయి ఉన్నారు. 1990 నుంచి 2015 వరకు ప్రపంచంలో

అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న (రోజుకు1.90 డాలర్లు(దాదాపు రూ.135) లేదా అంత కంటే తక్కువ ఆదాయం) వారి సంఖ్య 190 కోట్ల నుంచి 73.5 కోట్లకు తగ్గింది. అంటే, 1990లో మొత్తం జనాభాలో 36 శాతం మంది పేదరికంలో ఉంటే... 2015 నాటికి అది 10 శాతానికి తగ్గింది. 2015 నాటికి అసమానతల వల్ల వృద్ధిలో వెనకబాటు, దారిద్ర్య నిర్మూలనలో సానుకూలంగా పెరిగేటట్లు చేయడం తొలి లక్ష్యం. వయసు, లింగం, వైకల్యం, జాతి, పుట్టుక, మతం, ఆర్థిక వంటి వైరు ద్యాలతో నిమిత్తం లేకుండా 2030 నాటికి ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ ఆదాయం కనీస అవసరానికి అనుగుణంగా ఉండాలనేది భావన.

2012లో అంతర్జాతీయంగా 90 కోట్ల మంది రోజుకు 1.90 డాలర్ల కంటే తక్కువ కోట్లకు పడి పోయింది. ఈ గణాంకాలు ఎలా ఉన్నా, దుర్భర దారిద్యం ప్రపంచ మానవాళిని దారుణంగా వేధిస్తోంది. 'క్రెడిట్ న్యూస్' నివేదిక ప్రకారం కేవలం ఒక శాతం సంపన్నుల చేతిలో ప్రపంచంలోని సగానికిపైగా సంపద కేంద్రీకృతమై ఉంది. శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన రంగాల్లో మానవ మేధ గగన సీమలను చుంబిస్తున్నా సర్వకాల సర్వావస్థల్లో విస్తరిస్తున్న పేదరికానికి అడ్డుకట్ట వేయడంలో దారుణ వైఫల్యం వెక్కిరిస్తోంది. నేటికీ లక్షల మంది చిన్నారుల బాల్యం దోపిడికి గురవుతోంది. పేదరికంలో మగ్గుతున్న చిన్నారులు తమ హక్కుల్ని, ఆరోగ్యాన్ని, పోషకాల్ని, విద్యావకాశాలను కోల్పోతున్నారు. ఇవాళ అంతర్జాతీయ దారిద్ర్య నిర్మూలన దినోత్సవం జరుపుకొంటున్నాం. ప్రపంచం నుంచి పేదరికాన్ని తరిమి కొట్టడం సహస్రాబ్ది, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో కీలకంగా చెప్పుకొన్నారు. కానీ, ఆ లక్ష్యాలు సాకారమయ్యే అవకాశం కనుచూపు మేరలో కనిపించక పోవడమే బాధాకరం.

అవమానాల నుంచి, వెలివేతల నుంచి బాధా సర్ప దుష్టులనూ విముక్తి కలిగించి, అందరి భాగస్వామ్యంతో పేదరికాన్ని పునాదుల నుంచి పరిమార్చడమే నినాదంగా పేదరిక నిర్మూలన దినోత్సవం జరుపుతున్నారు. సర్వత్రా పెనువేగంతో విస్తరిస్తున్న అసమానతలు ఇప్పుడు ప్రపంచానికి అతిపెద్ద సవాలుగా నిలుస్తున్నాయి. దేశాల మధ్య యుద్ధం కాదు, పేదరికంపై సమరం చేయాలని ఆ మధ్య భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును ఈ నేపథ్యంలోనే అర్థం చేసుకోవాల్సి ఉంది. అందరికీ ఉపాధి కల్పించినట్లయితే పేదరికం, ఆదాయ అసమానతలను తగ్గించవచ్చు. ప్రభుత్వం, నీతి ఆయోగ్ ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించాలి.

భారత దేశంలో వ్యవసాయం 50 శాతం శ్రామికులకు జీవనాధారం కల్పిస్తోంది. ఈ రంగం అనుబంధ వృత్తి, వ్యాపారాలు, ఉద్యోగాలను పెద్ద సంఖ్యలో అందించ గలదు. 2022 కల్లా రైతుల ఆదాయాలను సమయాల్లోనే కాదు, పంటలు విరగ పండిన సంవత్సరాల్లోనూ రైతులకు అరకొర ధరలైనా దక్కడం లేదు. అన్నదాతల ఆదాయాలు పెరగనంత వరకు పేదరికాన్ని నిర్మూలించలేం. ఇక భారతీయ శ్రామికుల్లో 92 శాతం అసంఘటిత రంగాల్లోనే పని చేస్తున్నారు. వారికి వేతనాలు బహు తక్కువ. పింఛన్ల వంటి సామాజిక భద్రత భృతులేవీ లభించవు. పైగా పని పరిస్థితులు దుర్భరం.

సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారిపోతున్న దృష్ట్యా సంఘటిత రంగ కార్మికులు సరికొత్త ఉద్యోగాల్లో మహిళల వాటా సైతం పెరగాలి. ఇతర దేశాల్లో 50 నుంచి శాతం మంది మహిళలు ఉద్యోగాలు చేస్తుంటే, భారత దేశంలో వారి సంఖ్య కేవలం 24 శాతం. స్థూలంగా చూస్తే భారత్, చైనాలు రెండింటిలో అసమానత ఒకేరకంగా ఉన్నట్లు కనిపించినా భారతీయ పేదలు కనీస అవసరాలు కూడా తీరని దుస్థితిలో ఉన్నారు. విద్య, వైద్యం, ఇతర సేవలూ సరిగ్గా అందడం లేదు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా... ఏళ్లయినా రైతులకు ఇప్పటికీ గిట్టుబాటు ధరలను అందించ లేక పోవడం విచారకరం.

అనావృష్టి పీడిత ప్రతి పౌరుడికి కొంత ఆదాయం అందించడానికి సార్వజన కనీస ఆదాయ పథకం పెట్టాలని ప్రపంచ మంతటా ప్రతిపాదనలు వస్తున్నాయి. ఈ పథకాన్ని మొదట వృద్ధుల సంక్షేమం కోసం అమలు చేయవచ్చు. దేశ జనాభాలో ఎనిమిది శాతంగా ఉన్న వృద్ధులకు దీనివల్ల ఎంతో ఊరట కలుగుతుంది. తరవాత మిగతా లబ్ధిదారులకు క్రమంగా ఈ పథకాన్ని వర్తింప జేయవచ్చు.

అనారోగ్యం ఉపాధి కోల్పోవడం, పంట నష్టం వంటి అనూహ్య విపత్తులతో అతలా కుతలమయ్యే పేదలకు కనీసా దాయ పథకం ఎంతో కొంత ఆసరా ఇస్తుంది. అదే సమయంలో పేదలకు సరైన ఉపాధి కల్పించడం ఎంతో ముఖ్యం.

అక్టోబర్ 17...అంతర్జాతీయ దారిద్ర్య నిర్మూలన దినోత్సవం
- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

నవజీవన్‌తో నవభారతం చేసిన గాంధీజీ



ఒక దినపత్రిక ద్వారా దాస్యశృంఖాల నుండి ఒక దేశానికి ఎలా స్వేచ్ఛ ప్రసాదించ వచ్చో, 'నవ జీవన్' పత్రిక ద్వారా మహాత్మాగాంధీ ప్రపంచానికి చాటి చెప్పారు. 'ఒక అణా'తో ఎనిమిది పేజీల వార పత్రిక సెప్టెంబర్ 7వ తేదీన 1919లో గాంధీజీ ప్రారంభించిన నవజీవన్ పత్రిక మొత్తం దేశ ప్రజలలో స్వాతంత్ర్య కాంక్షను రగిల్చింది.. బ్రిటిష్ సామ్రాజ్య వాదాన్ని మట్టి కరిపించింది.. రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరిగిన సంఘటనలు, తదుపరి బ్రిటిష్ వారి ఆంక్షలు గాంధీజీ స్వాతంత్ర్య పోరాటానికి తరచూ ఆటంకాలు కలిగిస్తున్న సమయంలో, తన ఆశయాలైన అహింస, సత్యాగ్రహం, స్వదేశీ, వ్యవసాయ అభివృద్ధి, ఆర్థిక స్వావలంబన, స్వయం సమృద్ధి, చేనేత వంటి అంశాలను ప్రజల చెంతకు చేర్చడానికి, దేశానికి స్వాతంత్ర్యం సాధించడానికి ఒక ఆయుధంగా పత్రికను ప్రారంభించాడు. తన ఆశయాలతో పాటు తన సిద్ధాంతాలను పట్టణ ప్రాంతాల నుంచి గ్రామీణ ప్రాంతాలలో ఉండే సామాన్య ప్రజలకు చేరువ చేయడానికి నవజీవన్, యంగ్ ఇండియా వంటి పత్రికలు ద్వారా చైతన్య పరచడం ప్రారంభించారు. ముఖ్యంగా పేపరులో తాను రాసే విషయాలను చదవడం ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయడమే కాకుండా, పాఠకుల నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించే నూతన పత్రికా విలువలకు పునాది వేశారు. దీని ద్వారా స్వాతంత్ర్య పోరాటం మరింత బలోపేతం అవడానికి, ఎక్కువ మంది అవగాహనతో భాగస్వామ్యం అవడానికి వీలు కలిగింది. ఈ సందర్భంగా బ్రిటిష్ వారు అనేక ఆటంకాలు కలిగించేవారు. నవజీవన్ పత్రిక ప్రచురించడానికి కూడా పబ్లిషర్స్ భయపడేటట్లు బ్రిటిష్ వారు

ఆంక్షలు విధించేవారు.. అయినప్పటికీ నవజీవన్ పత్రిక ప్రజలు అందరికీ సకాలంలో చేరవేయడం ద్వారా దేశం నుంచి బ్రిటిష్ పాలకులను పార ద్రోలడానికి చక్కటి ఆయుధంగా మారింది..

నేడు కూడా పాలకులకు వ్యతిరేకంగా ఏ పత్రికైనా వార్తలు రాసినా, ఆంక్షలు విధించడం చూస్తూనే ఉన్నాం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలి నాళ్ళలో ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా, నిజాన్ని నిర్భయంగా స్వేచ్ఛగా ప్రజలకు చేరువ చేయడానికి 'ప్రెస్'కు ప్రముఖస్థానం కల్పించారు. అయితే నేడు మనదేశంలో పత్రిక స్వేచ్ఛ, మీడియా స్వేచ్ఛ ప్రమాదంలో పడింది.. దాదాపు దేశంలో చాలా పత్రికలు, ఛానెల్స్ ప్రభుత్వ అనుకూలంగా మారిపోవడం బాధాకరమైన విషయం. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలే. దేశంలో చాలా పత్రికలు ఛానెల్స్ ప్రైవేటు కార్పొరేట్ చేతుల్లోకి వెళ్ళిపోవడం జరిగింది. అందుచేతనే ప్రభుత్వ అనుకూల వార్తలు, వ్యాపార ప్రకటనలు, ఎడిటోరియల్ పేజీలో ఆర్టికల్స్ వివిధ అంశాలు అన్నీ ఆయా రాష్ట్రాల, కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా ఉండటం జరుగుతుంది. అక్కడక్కడ దేశంలో కొన్ని పత్రికలు ఛానెల్స్ నిర్భయంగా వాస్తవానికి దగ్గరగా వార్తలు రాసినా, ప్రసారం చేసినా ప్రభుత్వాలు ఆంక్షలు విధిస్తున్న పరిస్థితి ఏర్పడింది. అదే, నాటి పత్రిక చైతన్యానికి, నేటి పత్రికా విలువలకు ఎంత తేడా ఉందో తెలుస్తుంది.

పత్రికలు సమాజ చైతన్యానికి నడుం బిగించాలి.. పాలకులు, పార్టీలు మంచి చేస్తే పొగ డాలి. తప్పులు చేస్తే సరిదిద్దే విధంగా సందేశం ఇవ్వాలి. వాస్తవాలు ప్రజలకు తెలియపరచాలి. పత్రికలు, ఛానెల్స్ అంటే సమాజానికి సేవ చేసే ఆయుదాలు. అవినీతిని చీల్చే అంకుశం. తప్పు చేసే వారిని గాడిలో పెట్టే గైడ్. ఒక సమాజ అభివృద్ధిలో, ఒక దేశ నిర్మాణంలో పత్రికలు ఛానెల్స్ సామాజిక మాధ్యమాలు పాత్ర చాలా కీలకం అని గ్రహించాలి. అంతేగానీ, ప్రభుత్వ విధానాలపై ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతి మార్గంలో నిరసనలను వ్యక్తం చేసేవారిపై, రాతలు రాసే వారిపై ప్రభుత్వాలు ఆంక్షలు విధించరాదు. ఆయా సమస్యలు పరిష్కారానికి పత్రికలు సూచించే పరిష్కారాలను స్వీకరించి తదను గుణంగా ప్రభుత్వాలు పాలకులు కృషి చేయాలి. పత్రికా స్వేచ్ఛకు భంగం కలగకుండా చూడాలి. అదే సమయంలో జర్నలిజం కూడా నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. గాంధీజీ ఏ విలువలతో తన పత్రికలు నడిపించారో, ప్రజలను చైతన్యవంతులను చేసారో, దేశానికి స్వాతంత్ర్యం సాధించారో, బ్రిటిష్ సామ్రాజ్య వాద ఆంక్షలను ఎదిరించారో... నేడు కూడా పత్రికలు నిర్భయంగా స్వేచ్ఛగా ప్రజలకు సేవ చేయాలి. పాలనలో పారదర్శకత పెంచే విధంగా పత్రికలు తమ తమ పాత్ర పోషించాలి.. పాలకులు, ఉద్యోగస్తులు తమ విధి నిర్వహణ సక్రమంగా నిర్వహించే విధంగా పత్రికలు మార్గదర్శకంగా నిలవాలి. ప్రజాస్వామ్య వ్యవస్థ పది కాలాలు పాటు పారదర్శకంగా పనిచేయాలి అంటే పత్రికలే పునాదులు. కాలాలు మారినా, రోజులు దొర్లుతూ ఉన్నా మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల హక్కులను కాపాడటం కోసం, సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించ వలసిన ప్రధాన ఆయుధాలు పత్రికలు ఛానెల్స్ సామాజిక మాధ్యమాలే. అందుకే పత్రిక స్వేచ్ఛ కాపాడేందుకు అందరూ భాగస్వాములు కావాలి. ఆనాటి పాలకులు తప్పు చేస్తే, మమ్మల్ని కూడా వదలవద్దు అని దేశ ప్రధాని నుంచి గ్రామీణ ప్రాంత ప్రజాప్రతినిధి వరకూ పత్రికా విలేఖరులతో నిర్భయంగా చెప్పేవారు.. నేడు ఇటువంటి పాలకులు మచ్చుకైనా కనపడటం లేదు అంటే అతిశయోక్తికాదు. కనీసం సంవత్సరానికి ఒక్క సారైనా పత్రికా విలేఖరులతో సమావేశం నిర్వహించి, మాట్లాడే దేశ ప్రధాని గానీ , మంత్రులు గానీ కనపడటం లేదు. దేశాన్ని వెంటాడుతున్న పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, అవినీతి, బంధుప్రీతి, వారసత్వ రాజకీయాలు, కార్పొటీకరణ, అధిక ధరలు, ద్రవ్యోల్బణం, అనారోగ్యం, వివక్షతలు, మహిళలపై అఘాయిత్యాలు, డ్రగ్స్, సైబర్ క్రైమ్ ఇలా పలు సమస్యలు పరిష్కారం కోసం, పాలకుల్లో పారదర్శకత పెంచే విధంగా, భవిష్యత్తులో వికసిత భారత్ సాధించుటలో పత్రికలు కీలక పాత్ర పోషించాలి.

- ఐ. ప్రసాదరావు
9390509791

ఎల్‌నినో

సముద్రం రగిలితే.. నేల కన్నీరు పెడుతుంది!
సముద్రం వేడెక్కితే
పవనాల నడక మారుతుంది
మేఘాల దారి మళ్లితే
రైతు ఆశలపై కరువు నీడ పడుతుంది!
పసిఫిక్ జలాల గర్భంలో
ఉష్ణోగ్రతల అసాధారణ పెరుగుదల
వాణిజ్య పవనాల బలహీనత
వెరసి వాతావరణంలో
సృష్టించే కల్లోలమే ఎల్‌నినో!
సాధారణంగా రెండు నుంచి ఏడు
సంవత్సరాల వ్యవధిలో
అప్పుడప్పుడు ఆవిర్భవిస్తూ
వాతావరణ గమనంలో మార్పులు తెచ్చే
సహజ పరిణామమే ఎల్‌నినో!
రుతుపవనాలపై అనిశ్చితి
చెరువుల గుండెల్లో నెరెలు
పంట పొలాల్లో నిశ్శబ్దం
రైతు కళ్లలో దిగులు!
బావులు అడుగంటుతాయి
పచ్చదనం పలుచబడుతుంది
పశువులకు మేత కరువవుతుంది
తాగునీటి కోసం గ్రామాల గొంతులు
ఎండిపోతాయి!
అయితే ఎల్‌నినో అంటే
కరువు తప్పనిసరి కాద
ప్రాంతాన్నిబట్టి పరిస్థితులను బట్టి
వర్షాల తీరు మారవచ్చు!
సముద్రపు సెగను ఆపలేకపోవచ్చు
కానీ నేల దాహాన్ని తగ్గించవచ్చు!
ప్రకృతి పరిణామాన్ని మార్చలేకపోవచ్చు
ముందస్తు జాగ్రత్తతో నష్టాన్ని నివారించవచ్చు!
వాన చుక్కను ఒడిసిపట్టి
జలవనరులను సంరక్షించి
రైతుకు భరోసానిచ్చినప్పుడే ఎల్‌నినో సవాలును
మన విజ్ఞానం ఎదుర్కోగలదు!

- డాక్టర్ పగిడిపల్లి సురేందరు
8074846063

ఈశాన్యంలో మళ్లీ తిరుగుబాటు ప్రమాదం!?

భారతదేశ ఈశాన్య ప్రాంతంలో సుదీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోకుండా అపరిష్కృతంగా ఉన్న నాగా రాజకీయ సమస్య నేడు అత్యంత ప్రమాదకరమైన, తీవ్రమైన సందిగ్ధంలో పడిపోయింది. దశాబ్దాల తరబడి కొనసాగిన రక్తపాతానికి, అశాంతికి స్వస్తి పలికి ఈ ప్రాంతంలో శాశ్వత శాంతిని స్థాపించాలనే సదుద్దేశంతో 2015 ఆగస్టు 3న కేంద్ర ప్రభుత్వం, నేషనల్ సోషలిస్ట్ కౌన్సిల్ ఆఫ్ నాగాలిమ్ (ఎన్ఎస్సీఎన్-ఐఎం) మధ్య ఒక చారిత్రాత్మకమైన చట్రపు ఒప్పందం కుదిరింది. అయితే, ఈ ఒప్పందం కుదిరి దశాబ్దం గడిచినా కూడా, అది నేడు సార్వభౌమాధికారం, ప్రత్యేక జెండా, రాజ్యాంగం, పెరుగుతున్న నమ్మకలేమి వంటి అంశాలపై ఏర్పడిన తీవ్రమైన విభేదాలకు బందీ అయిపోయింది. (ఎన్ఎస్సీఎన్-ఐఎం)సంస్థ మళ్లీ తిరుగుబాటును పునరుద్ధరిస్తామని బహిరంగంగా హెచ్చరిస్తున్న నేపథ్యంలో శాంతి కోసం ఒక స్థిరమైన, గౌరవప్రదమైన రాజకీయ పరిష్కారాన్ని కనుగొనే దిశగా కేంద్ర ప్రభుత్వం తక్షణమే బలమైన చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోపే కుదిరిన ఈ ఒప్పందంపై అప్పట్లో ఈశాన్య భారత్‌తోపాటు దేశవ్యాప్తంగా భారీ అంచనాలు వెలువడ్డాయి. ఈ సమస్యను అంతం చేయడం అంత తేలికైన విషయం కాదని, అయినప్పటికీ 'సార్వభౌమాధికారాన్ని పంచుకోవడం' వంటి ఉన్నతమైన రాజ్యాంగ అంశాల ద్వారా దీనిని సాధించగలమని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, అప్పటి ప్రధాన మధ్యవర్తి, ఐబీ డైరెక్టర్ ఆర్.ఎన్. రవి గట్టి హామీ ఇచ్చారు. కానీ ఆచరణలో మాత్రం పరిస్థితులు పూర్తిగా భిన్నంగా మారాయి. 2014 నుండి 2021 వరకు ఆర్.ఎన్.రవి ఎటువంటి పురోగతిని సాధించలేక పోయారు. ఆ తర్వాత ఆయన నాగాలాండ్ గవర్నర్ పదవి నుండి తమిళనాడుకు బదిలీ అయ్యారు. రవి నుండి బాధ్యతలు స్వీకరించిన ఐబీ స్పెషల్ సెక్రటరీ ఏకే మిశ్రాను ఉద్దేశించి, రవి సమర్పించిన ప్రభుత్వ సామర్థ్యాల రికార్డు ఏదీ అందుబాటులో లేదని ప్రజల ముందే వెల్లడించడం కేంద్ర ప్రభుత్వ విధానాలలోని తీవ్రమైన డొల్లతనాన్ని, సమన్వయ లోపాన్ని బయట పెట్టింది. 2024 నవంబర్‌లో మిశ్రా పదవీ విరమణ పొందారు. మధ్యవర్తి స్థాయి నుండి కేవలం ఒక ప్రతినిధి స్థాయికి మిశ్రా కుదించబడ్డారు. శాంతి చర్చల్లో అంతరాయం కలగకుండా చూసేందుకు 2022 నుండి 2025 మధ్య ముయివా రహస్య సమావేశాలు జరిపిన ప్పటికీ, మిశ్రాను ఈశాన్య రాష్ట్రాలకు సలహాదారుగా మార్చి దారి మళ్లించడం పరిస్థితిని మరింత దిగజార్చింది. ఈ పరిణామాలతో తీవ్ర నిరాశకు గురైన ముయివా నాగా చరిత్రలోనే మొదటిసారిగా మూడో పక్షం జోక్యాన్ని కోరాల్సిన దుస్థితి తలెత్తింది.

నాగా ఉద్యమ చరిత్రను ఒకసారి పరిశీలిస్తే, 1955లో నాగాలు తిరుగుబాటును ప్రకటించిన నాటి నుండి అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నాగా ప్రజల హృదయాలను గెలవాలని సూచించారు తప్ప కేవలం బలప్రయోగాన్ని మాత్రమే నమ్ముకోలేదు. కాలక్రమేణా మారుతూ వచ్చిన కేంద్ర ప్రభుత్వాల విధానాలు సమస్యను మరింత సంక్లిష్టం చేశాయి. 2002లో వాజ్‌పేయి ప్రభుత్వ హయాంలో నాగా సార్వభౌమాధికారాన్ని గుర్తించిన అమ్‌స్టర్‌డామ్ సంయుక్త ప్రకటనను ముయివా ఇప్పటికీ గుర్తు చేస్తూనే ఉంటారు. కానీ 2017లో ఏడు నాగా గ్రూప్‌లతో రవి కుదుర్చుకున్న ఒప్పందం 'ఫ్రేమ్‌వర్క్ ఒప్పం దాన్ని పూర్తిగా నీరుగార్చే వ్యూహమని, ఇది తమను మానసికంగా మరియు రాజకీయంగా విభజించడానికి కేంద్ర ప్రభుత్వం ఆడిన నాటకమని(ఎన్ఎస్సీఎన్-ఐఎం) తీవ్రంగా వ్యతిరేకించింది. ఆర్.ఎన్. రవి కాలం నాటి నుండి ఇప్పటి వరకు నాగా ప్రజల రాజకీయ, పరిపాలనాపరమైన స్వయంప్రతిపత్తిని పరిష్కరించడంలో కేంద్రం విఫలమైంది. రవి నాగా డిమాండ్లను తొందర పాటుతో అధిగమించడానికి ప్రయత్నించి, రాజ్యాంగ పరమైన ఉమ్మడి సార్వభౌమాధికార సమస్యను పరిష్కరించడంలో విఫలమై తీవ్రమైన నమ్మక లేమిని సృష్టించారు.

జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేసిన అనుభవాల నేపథ్యంలో, నాగాలాండ్‌కు రాజ్యాంగపరంగా రక్షణగా ఉన్న ఆర్టికల్ 371ఎ నిబంధనలకు కూడా ఎక్కడ ముప్పు వస్తుందోననే తీవ్రమైన ఆందోళన, భయం నాగా ప్రజల్లో నెలకొంది. ప్రత్యేక జెండా, రాజ్యాంగం లేనిదే నాగా సాంస్కృతిక అస్తిత్వం, స్వయంప్రతిపత్తి పరిపూర్ణం కాదని ముయివా బలంగా నమ్ముతున్నారు. కేంద్రం బల ప్రయోగ విధానాలతో తమ ప్రాథమిక డిమాండ్లను అణచివేయాలని చూస్తే లొంగిపోయే ప్రసక్తే లేదని ఆయన తెగేసి చెప్పారు. సరిగ్గా ఇదే నేపథ్యంలో, ఆగస్టు 14, 2026 నాగా స్వాతంత్ర్య దినోత్సవం రోజున దిమాపూర్ సమీపంలోని మౌంట్ హెర్మోన్ వద్ద నాగా ఆర్మీకి చెందిన సుమారు 2,500 మంది సాయుధ క్యాడర్లు భారీ పెరేడ్ నిర్వహించడం ద్వారా తమ సైనిక శక్తిని, పట్టును ప్రదర్శించారు. మరోవైపు, మణిపూర్‌లో ప్రస్తుతం ఉన్న అస్థిరతను ఆసరాగా చేసుకుని మయన్మార్‌లోని సాగైంగ్ ప్రాంతంలో ఉన్న తమ శిబిరాలపై దాడి చేయడానికి కేంద్రం కుకీ మరియు పీపుల్స్ డిఫెన్స్ ఫోర్స్‌లను ఉపయోగిస్తోందని (ఎన్ఎస్సీ-ఎన్ఐఎం)తీవ్ర ఆరోపణలు చేస్తోంది. నాగాలాండ్‌ల

అర్బన్ హౌసింగ్ కాలనీలో అన్నిమౌలిక సదుపాయాలు కల్పిస్తాం

సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల, అక్టోబర్ 16 (మనం ప్రతినిధి): జగిత్యాల అర్బన్ హౌసింగ్ కాలనీలో రూ.2.77 కోట్ల నిధులతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. అర్బన్ హౌసింగ్ కాలనీలో నివసిస్తున్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించాలనే ఉద్దేశంతో రూ.2.77 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడం ద్వారా కాలనీలో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడటంతో పాటు ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రభుత్వం అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించేందుకు కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. అర్బన్ హౌసింగ్ కాలనీలో నివసిస్తున్న ప్రజల్లో ఇప్పటివరకు గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ప్రయోజనం పొందని వారు సంబంధిత అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకొని పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, విద్యుత్ శాఖ అధికారులు, హౌసింగ్ అధికారులు,మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, తహసీల్దార్, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌కు కబడ్డీ పండుగ

- దసరా కానుకగా అకాడమీ
- మంత్రి పొన్నం కృషికి ఫలితం
- 40 మంది పల్లె ప్రతిభావంతులకు బంగారు భవిష్యత్తు
- బాలబాలికలకు సమాన అవకాశం
- అంతర్జాతీయ స్థాయి శిక్షణకు బాట

చిగురుమామిడి, అక్టోబర్ 16 (మనం న్యూస్): హుస్నాబాద్ చరిత్రలో మరో సువర్ణ అధ్యాయం. నియోజకవర్గ క్రీడా ముఖచిత్రాన్ని మార్చే కీలక నిర్ణయం వెలువడింది. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ గారి అకుంఠిత కృషి, పట్టుదల ఫలించింది. హుస్నాబాద్ లో నూతన కబడ్డీ అకాడమీ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా జీవో జారీ చేసింది. దసరా పండుగ ముందు నియోజకవర్గ ప్రజలకు ఇది నిజమైన పండుగ కానుక. గ్రామీణ యువతలోని అపార క్రీడా ప్రతిభను వెలికితీసి, వారిని జాతీయ, అంతర్జాతీయ ఛాంపియన్లుగా తీర్చిదిద్దాలన్న మంత్రి గారి సంకల్పానికి ఈ జీవో నిదర్శనం.

ప్రభుత్వ జీవో సారాంశం...

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ కేంద్రంగా అత్యాధునిక కబడ్డీ అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ అకాడమీలో మొత్తం 40 మంది యువ క్రీడాకారులకు వసతితో కూడిన శిక్షణ లభిస్తుంది. అందులో 20 మంది బాలురు, 20 మంది బాలికలు. ఆడపిల్లలకు సమాన అవకాశం కల్పించడం ద్వారా మహిళా క్రీడాభివృద్ధికి పెద్దపీట. బాలురు, బాలికలకు వేరువేరుగా జాతీయ స్థాయి కోచ్ లు, వార్డెన్లు నియామకం. మైదాన నిర్వహణ, భద్రత, పారిశుద్ధ్యం కోసం మొత్తం 8 మంది సిబ్బందికి ప్రభుత్వం అనుమతి. ఈ నియామకాలన్నీ ఔట్ సోర్సింగ్ విధానంలో జరుగుతాయి.

మంత్రి పొన్నం స్పందిస్తూ...

'హుస్నాబాద్ పల్లెల్లో కబడ్డీ అంటే ఒక ఉద్యమం. ఇక్కడి మట్టిలోనే ఎంతో మంది జాతీయ క్రీడాకారులు ఉన్నారు. వారి ప్రతిభకు సరైన వేదిక కల్పించాలన్నదే నా చిరకాల కోరిక. ఈ అకాడమీతో మన బిడ్డలు అంతర్జాతీయ పతకాలు సాధించి, హుస్నాబాద్ ఖ్యాతిని ప్రపంచానికి చాటుతారని నమ్ముతున్నాను. ఇది కేవలం ఆరంభం మాత్రమే' అని తెలిపారు. ఇప్పటికే హుస్నాబాద్ నియోజకవర్గంలోని అనేక పల్లెలు కబడ్డీలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తూ తెలుగు ఖ్యాతిని చాటుతున్నాయి. అయితే సరైన వేదిక, శిక్షణ లేక ఎంతో మంది మట్టిలోనే మాణిక్యాలుగా మిగిలిపోతున్నారు. ఈ అకాడమీతో ఆ లోటు తీరనుంది. భవిష్యత్తులో ఈ గడ్డ నుంచి ఎంతో మంది అర్జున అవార్డు గ్రహీతలు, అంతర్జాతీయ క్రీడాకారులు తయారవడం ఖాయమని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

జిల్లాలో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

- వక్ఫ్ బోర్డు చైర్మన్ ను కోరిన జిల్లా డిసిసి మైనార్టీ చైర్మన్ నయీం

జగిత్యాల, అక్టోబర్ 16 (మనం న్యూస్): జగిత్యాల జిల్లాలోని వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కాంగ్రెస్ మైనారిటీ చైర్మన్ ఎం.ఏ. నయీమ్, తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీని కోరారు. శుక్రవారం హైదరాబాద్ లోని వక్ఫ్ బోర్డు కార్యాలయంలో చైర్మన్ ను కలిసిన నయీమ్, జిల్లాలో వక్ఫ్ భూముల స్థితిగతులను వివరించారు. ఆస్తులు అక్రమ ఆక్రమణలకు గురికాకుండా పర్యవేక్షణ పెంచాలని, ఆక్రమణలకు గురైన వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నూతనంగా జిల్లా డిసిసి మైనార్టీ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన నయీమ్ ను వక్ఫ్ బోర్డు చైర్మన్ శాలువాతో సన్మానించి అభినందించారు.

జిల్లాలో మైనారిటీలను సంఘటితం చేస్తూ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని చైర్మన్ హామీ ఇచ్చినట్లు నయీమ్ తెలిపారు.

క్రీడాకారిణికి ఆర్థిక ప్రోత్సాహకం

మంథని,అక్టోబర్16(మనం న్యూస్): పాలిమెల మండలానికి చెందిన క్రీడాకారిణి కావేరి జ్యోతి నవంబర్ 2026లో జరగనున్న 2వ సౌత్ ఏషియన్ పారా త్రోబాల్ ఛాంపియన్షిప్కు ఎంపికైన సందర్భంగా,ఆమెను ప్రోత్సహించేందుకు ఎంఆర్ గ్రూప్స్ తరపున డా.ఉదయ్ కిరణ్,కృష్ణ కౌశిక్ కలిసి 10,016(పదివేల పదహారు రూపాయలు)ఆర్థిక ప్రోత్సాహకంగా అందజేశారు.ఈ సందర్భంగా డా:కౌటం ఉదయ్ కిరణ్, కృష్ణ కౌశిక్ మాట్లాడుతూ కావేరి జ్యోతి క్రీడారంగంలో మరిన్ని విజయాలు సాధించి,అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఆమె క్రీడా ప్రయాణంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకుని,భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని అభిలషించారు.

గురుకుల పాఠశాలలో వసతులపై ఎమ్మెల్యే సమీక్ష

జగిత్యాల, అక్టోబర్ 16 (మనం న్యూస్): జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగిత్యాల నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల పరిధిలోని గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అందుతున్న వసతులు, హాస్టళ్లలో నెలకొన్న సమస్యలపై జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజక వర్గంలోని గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, హాస్టళ్లలో ఉన్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యే సమయానికి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన వసతులను కల్పించేందుకు అధికారులు, సిబ్బంది చొరవ చూపాలని ఎమ్మెల్యే సూచించారు. విద్యార్థులకు మంజూరైన పుస్తకాలు,యూనిఫామ్ తో పాటు ఇతర అవసరమైన సామాగ్రి విషయాలను కూడా అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ సూచించారు. ఈ సమావేశంలో బీసీ, ఎస్సీ వెల్ఫేర్ అధికారి జయరాజ్, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి కె.వై. ప్రసాద్, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి నరేశ్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల ప్రధానోపా ధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, హాస్టల్ వార్డెన్లు,గురుకుల పాఠశాలలు, కళాశాలల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో విద్యుత్ దీపాల పనితీరును పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

మంథని, అక్టోబర్16(మనం న్యూస్): మంథని మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో వీధి విద్యుత్ దీపాలు సక్రమంగా వెలుగుతున్నాయా లేదా అని మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఎన్.మనోహర్, పాలకవర్గ సభ్యులతో కలిసి గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో వీధి విద్యుత్ దీపాల పనితీరును పరిశీలించి,ప్రజలకు రాత్రి వేళలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.పనిచేయని విద్యుత్ దీపాలను గుర్తించి,అవసరమైన మరమ్మతులు చేపట్టి ,పట్టణంలోని అన్ని వార్డుల్లో వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు,పట్టణంలో రాత్రి వేళల్లో భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమములో పాలక వర్గ సభ్యులు ఎల్లేంకి వంశీధర్,నాయకులు జంభోజు సమ్మయ్య,మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

- బీఆర్ఎస్ నాయకుడు కుడుముల లక్ష్మీనారాయణ

మంగపేట, అక్టోబర్ 16, మనం ప్రతినిధి: రైతులకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని, పంట నష్టపోయిన వారికి పరిహారం అందించాలని బీఆర్ఎస్ మంగపేట మండల మాజీ అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను, మండల అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని అన్నారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించడంతోపాటు కాలిపోయిన మోటార్లు, ట్రాన్స్ఫార్మర్లను వెంటనే మరమ్మతు చేయాలని కోరారు. రెండో పంట సాగుపై ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించాలని పేర్కొన్నారు. ఏటూరునాగారం-మంగపేట ప్రధాన రహదారిపై ప్రయాణం ఇబ్బందికరంగా మారిందని, కనీసం ఒక లేయర్ బీటీ రోడ్డు నిర్మాణమైనా వెంటనే చేపట్టాలని కోరారు. మంగపేట బస్టాండ్ పనులు నత్తనడకన సాగుతున్నాయని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. పంట నష్టాలపై సమగ్ర సర్వే నిర్వహించి అర్హులైన రైతులకు పరిహారం అందించాలని అన్నారు. ములుగు జిల్లా మంత్రి సీతక్క రైతుల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని లక్ష్మీనారాయణ కోరారు. వ్యవసాయ విద్యుత్ సరఫరా, పంట నష్టపరిహారం, రహదారి నిర్మాణం, బస్టాండ్ పనుల పూర్తిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రైతులు, ప్రజల తరపున బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గుండేటి రాజుయాదవ్, యడ్లపల్లి నర్సింహారావు, కర్రి శ్యాంబాబు, కోరం సంతోష్, కాటూరి సుగుణ, రావుల రమణ, చల్లగురుగుల తిరుపతి, గుండారపు రమేష్, అమిలి చంద్రం, పంజాల సత్యం, కెక్కం జగదీష్, కర్రి రామ్మోహన్, బీసా సాంబయ్య, గుడివాడ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

2027 గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- కలెక్టర్ బి. సత్యప్రసాద్

జగిత్యాల, అక్టోబర్ 16 (మనం ప్రతినిధి): రానున్న 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని, వెల్గటూర్ మండలం కోటిలింగాల గ్రామంలో చేపడుతున్న గోదావరి పుష్కరాల అభివృద్ధి మరియు ఆలయ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా కోటిలింగాల ప్రాంతంలో పుష్కరాల సందర్భంగా భక్తులకు అవసరమైన సౌకర్యాలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ఆలయ నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. పుష్కరాల నిర్వహణకు అవసరమైన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని, ఆలయ నిర్మాణ పనులను కూడా సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని సంబంధిత అధికారులకు సూచించారు. పుష్కరాలకు ముందుగానే అన్ని పనులు పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, టెంపుల్ ఈ.ఈ. రాజేష్, మండల తహసీల్దార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు అభయమిచ్చిన జయదుర్గా మాత

- విద్యానగర్ లో వైభవంగా సామూహిక సరస్వతీ పూజలు
- చిన్నారుల అక్షరాభ్యాసం

జగిత్యాల, అక్టోబర్ 16 (మనం న్యూస్): జగిత్యాల పట్టణం విద్యానగర్ లో కొలువైన జయ దుర్గా మాత ఆలయం శుక్రవారం భక్తి శ్రద్ధలతో పులకించింది. జయ దుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో అమ్మవారు చదువుల తల్లి సరస్వతీ దేవి అలంకరణలో దేదీప్యమానంగా దర్శనమిచ్చి, భక్తులకు అభయ ప్రదాయినిగా నిలిచారు. తెల్లని వస్త్రధారణలో, చేతిలో వీణ, పుస్తకం ధరించి, హంసవాహినిగా దర్శనమిచ్చిన అమ్మవారిని చూసి భక్తులు తన్మయత్వం చెందారు. విద్యకు అధిష్టాత్రి అయిన సరస్వతీ రూపంలో అమ్మవారిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావించారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం:

ఈ పవిత్ర సందర్భంగా ఆలయ ప్రాంగణంలో చిన్నారులకు సామూహికంగా అక్షరాభ్యాసం చేయించారు. ఓం శ్రీ సరస్వత్యై నమః నామస్మరణతో చిన్నారుల చేత పలకపై ఓం నమః శివాయ అని రాయించి, వారి విద్యా జీవితం విజయవంతం కావాలని అర్చకులు ఆశీర్వదించారు.

మాజీ మంత్రి జీవన్ రెడ్డి సేవ:

ఈ మహోత్సవానికి హైకోర్టు అడ్వకేట్ అజయ్ రెడ్డి అన్నప్రసాద దాతగా వ్యవహరించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. అనంతరం నిరాడంబరంగా భక్తుల మధ్య ఉండి, స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించి తన భక్తి భావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ హరిచరన్ రావు, జున్ను రాజేందర్, సేవా సమితి నిర్వాహకులు ముసిపట్ల లక్ష్మీనారాయణ, దాసరి దామోదర్, నలువాల శ్రీకాంత్, దాసరి శేఖర్, అలిశెట్టి కిషన్, బిట్టు, గాదే కార్తీక్, సింగారావు, నడిపి గంగారాం, ఫణి భూషణ్, ప్రసన్న, శ్రీరామ్, భగీరథ, నలువాల భగీరత్, అలిశెట్టి సాయి భూషణ్, సాయి, హరీష్, రామ్ చం దర్, ద్యావనపల్లి శంకర్, మాధురి, ఆయాన్స్, ఆద్వి, తదితర యువజన సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ములుగు జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా అయ్యోరి యణయ్య

మంగపేట, అక్టోబర్ 16, మనం ప్రతినిధి: ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా మంగపేట మండలం దొమేడ గ్రామానికి చెందిన అయ్యోరి యణయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క సూచనల మేరకు శుక్రవారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆయన నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా పైడాకుల అశోక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గిరిజన కుటుంబాలకు గడపగడపకు చేరవేయాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని యణయ్యకు సూచించారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, గిరిజన ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని ఆకాంక్షించారు. నూతనంగా ఎన్నికైన అయ్యోరి యణయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్గౌడ్, ఆత్మ చైర్మన్ చిటమట రఘు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్, మంగపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, ఏటూరునాగారం మండల అధ్యక్షుడు విజయ్కుమార్తో పాటు జిల్లా, నియోజకవర్గ, బ్లాక్, మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పిఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షులుగా సుంకరి బిక్షం గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మధుసూదన్ రెడ్డి

నల్గొండ, అక్టోబర్ 16 (మనం ప్రతినిధి): నల్గొండలో జరుగుతున్న ఆరవ రాష్ట్ర మండలి సమావేశం రెండవ రోజున కూడా సుమారు 5 వేల మంది పిఆర్టీయూ ప్రతినిధులు హాజరయ్యారు. నిన్న ఏకగ్రీవంగా రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన సుంకరి బిక్షం గౌడ్ ని, అదేవిధంగా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మధుసూదన్ రెడ్డిని ఈ రోజు మండలిలో ఎన్నికల అధికారులుగా విచ్చేసిన పేరి వెంకట్ రెడ్డి, గుండు లక్ష్మణ్, మనోహర్ రావు ప్రమాణ స్వీకారం చేయించారు.

శాసన మండలి సభ్యులు శ్రీపాల్ రెడ్డి ప్రసంగం

అనంతరం శాసన మండలి సభ్యులు శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ, దేశంలోనే 72,457 అంతర్జాల సభ్యత్వంతో అతిపెద్ద సంఘమైన పిఆర్టీయూ సంఘ నూతన రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నుకోబడిన బిక్షం గౌడ్, మధుసూదన్ రెడ్డిలకు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే గురుతరమైన బాధ్యత వీరిపై ఉన్నదని తెలియజేశారు. ఈ సందర్భంగా పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లో పిఆర్టీయూ అధికారిక అభ్యర్థిగా ఎంతో ఉద్యమ చరిత్ర ఉన్న సామాన్యుడు, ఈ రోజే రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన సుంకరి బిక్షం గౌడ్ ని ప్రకటించారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం మద్దతు

రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పేరి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల ఆరోగ్య కార్డుల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నదని, వేతన సవరణ సాధన కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉన్నదని తెలియజేస్తూ రాబోయే పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలలో సుంకరి బిక్షం గౌడ్ కి రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం తరపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

నూతన అధ్యక్షుడు బిక్షం గౌడ్ ప్రసంగం

రాష్ట్ర సంఘ అధ్యక్షునిగా ఎన్నుకోబడిన బిక్షం గౌడ్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగ, పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం చట్టసభల్లో తన గొంతును వినిపించడానికి మీ ముందుకు శాసన మండలి అభ్యర్థిగా వస్తున్నానని తెలియజేశారు. గత ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో తాత్సారం చేసి మూల్యం చెల్లించుకుందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా సమస్యల పరిష్కారంలో మొండిగా వ్యవహరిస్తున్నదని తెలియజేశారు. 'కనీసం ఒకటవ తారీఖున జీతాలు ఇవ్వకుండా, గత పాలన ఉన్నంత వరకు అంటే 10 ఏండ్లలో ఒక్కటి కూడా పదోన్నతి ఇవ్వకుండా దాటవేసిన ఆ పార్టీ అభ్యర్థికి ఓటేస్తే మనం దానికి మద్దతు ఇచ్చినట్టే అవుతుంది. ఈ ప్రభుత్వం వచ్చాక కనీసం ఒక్క కోరిక కూడా నెరవేర్చకుండా మొండిగా వ్యవహరిస్తున్న ఈ ప్రభుత్వ అభ్యర్థికి ఓటేస్తే మాకు ఏమీ ఇవ్వకున్నా పర్వాలేదు అన్నట్టు మద్దతు ప్రకటించినట్టు అవుతుంది. కావున 30 సంవత్సరాలుగా సమస్యల పరిష్కారంలో అనుభవమున్న, కొట్లాడే నన్ను గెలిపించాలని పిలుపునిచ్చారు.' ఈ కార్యక్రమంలో మాజీ శాసన మండలి సభ్యులు మోహన్ రెడ్డి, పిఆర్టీయూ సంఘ అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి, జగన్మోహన్ గుప్తా, కోమటిరెడ్డి నరసింహారెడ్డి, తనిఖీ సంఘ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, నల్గొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారాయణరెడ్డి, జానారెడ్డి, గీత, వాణి, విజయలక్ష్మి, కళావతి, శ్రీవిద్య, జానకి, సత్యవతి, 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు మరియు ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

10 లక్షల వ్యయంతో మహిళా భవన నిర్మాణానికి శంకుస్థాపన

ములుగు, అక్టోబర్ 16(మనంన్యూస్): సిద్ధిపేట జిల్లా, ములుగు మండలం గంగాధర్పల్లి గ్రామంలో ఈరోజు మహిళా భవన నిర్మాణానికి భూమిపూజ చేసి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మహిళా భవన నిర్మాణం కోసం రూ.10 లక్షల నిధులు మంజూరు కావడంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామ మహిళలకు, మహిళా సంఘాలకు సమావేశాలు నిర్వహించుకోవడానికి, వివిధ కార్యక్రమాలు చేపట్టడానికి ఈ భవనం ఎంతగానో ఉపయోగపడనుంది. గ్రామ అభివృద్ధిలో భాగంగా మహిళా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ఈ భవన నిర్మాణాన్ని చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధితో పాటు మహిళల సంక్షేమం, సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ మహిళలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుదర్శన్, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ మహిళలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా తమ లక్ష్యం

- విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు
- డివిజనల్ ఇంజనీర్ స్వామి

వర్ధల్, అక్టోబర్ 16(మనం న్యూస్): రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాన్స్ కో డివిజనల్ ఇంజనీర్ స్వామి పేర్కొన్నారు. శుక్రవారం వర్ధల్ శివారులోని బుచ్చిరోని కుంట ట్రాన్స్ ఫార్మర్, సమీప వ్యవసాయ పొలాలను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకోగా, నియంత్రిక (ఫ్రాన్స్ ఫార్మర్) 100 కేవీఏ డిటిఆర్ ఓవర్ లోడ్లో ఉన్నట్లు గుర్తించారు. అయితే రైతులకు, వ్యవసాయ పొలాలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన అదనంగా 25 కేవీఏ డిటిఆర్ నియంత్రికను ఏర్పాటు చేశారు. నాణ్యమైన విద్యుత్, మెరుగైన విద్యుత్ సరఫరా తమ లక్ష్యమని డిఈ స్వామి స్పష్టం చేశారు. రైతుల విద్యుత్ అవసరాలను గుర్తించి, సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఏడిఈ శ్రీనివాస్, ఏఈ వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ధర్మవరంలో ఉద్రిక్తతలకు వైసీపీ నేతలే కారణం

మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, అక్టోబరు 16 మనం న్యూస్: ధర్మవరం మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా చోటుచేసుకున్న ఉద్రిక్తతలకు వైసీపీ నేతల రెచ్చగొట్టే ధోరణే కారణమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. నామినేషన్ పత్రాలు చించివేశారన్న ఆరోపణల్లో వాస్తవం లేదని, వైసీపీ అభ్యర్థులను అడ్డుకోవాలన్న ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు.నామినేషన్ల ప్రక్రియలో ధర్మవరం పట్టణానికి సంబంధం లేని వ్యక్తులు వచ్చి వివాదాలు సృష్టించడంపై మంత్రి అభ్యంతరం వ్యక్తం చేశారు. కొందరిపై క్రిమినల్ కేసులు, బైండోవర్ చర్యలు ఉన్నట్లు సమాచారం ఉందని పేర్కొంటూ, ఘటనపై వాస్తవాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందన్నారు.

గాయాలయ్యాయని చెబుతూ ప్రభుత్వ ఆసుపత్రిలోని వీల్చైర్లను పోలీస్టేషన్కు తీసుకెళ్లడంపై మంత్రి విమర్శించారు. ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన సదుపాయాలను రాజకీయ ప్రచారానికి వినియోగించడం సరికాదన్నారు. గాయాల తీవ్రతపై వైద్య పరీక్షలు, సంబంధిత ఆధారాల ద్వారానే వాస్తవాలు నిర్ధారణ కావాలని పేర్కొన్నారు.గతంలో ప్రజలు వైసీపీని తిరస్కరించడానికి ఇలాంటి రాజకీయ ధోరణులే కారణమని విమర్శించిన సత్యకుమార్ యాదవ్, ఎన్నికల ప్రక్రియను వివాదాస్పదం చేయకుండా అన్ని పార్టీలు సంయమనం పాటించాలని కోరారు. ధర్మవరం మున్సిపాలిటీ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

లైఫ్ క్యూర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

గజ్వేల్ అక్టోబర్ 16 మనం న్యూస్: గజ్వేల్ పట్టణంలోని లైఫ్ క్యూర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. రకరకాల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించిన అనంతరం బతుకమ్మ చుట్టూరా కోలాటాలు చప్పట్లతో ఆనందంగా బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా లైఫ్ క్యూర్ హాస్పిటల్ యజమాని డాక్టర్ చైతన్య ఆనంద్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లైఫ్ క్యూర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని సిబ్బందితోపాటు చుట్టుపక్కల వారు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. మహిళలకు ఎంతో ఇష్టమైన ఈ పండుగను నిర్వహించుకోవడం ఎంతో సంతోషకరమైన ఆనందాన్ని వ్యక్తం చేశారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను తయారు చేసి మహిళలు ఉదయం నుండి ఈ బతుకమ్మలను తయారు చేస్తారని సాయంత్రం ఒక చోట చేరి బతుకమ్మ పాటలతో అందంగా ఆనందంగా కార్యక్రమం నిర్వహిస్తారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది అనూష, సంగీత, రమ్య, పల్లవి,సౌమ్య,రాజకాల, సుజాత, హంస తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానానికి ఆదిదేవత.. జగన్మాత శ్రీ విద్యాసరస్వతి

సర్వ శక్తి సామర్థ్యాలను ప్రసాదించనున్న శ్రీ విద్యాధరి

క్షేత్రంలో... వైభవంగా మూలా నక్షత్ర వైభవం

పీఠాధిపతులు శ్రీ విద్యాశంకర నృసింహ భారతి

వర్ధల్ అక్టోబర్ 16(మనం న్యూస్): జ్ఞానానికి ఆదిదేవతగా జగన్మాత శ్రీ విద్యా సరస్వతి మాత ప్రసిద్ధికెక్కినట్లు పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా శంకర నృసింహ భారతి స్వామీజీ పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా వర్ధల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో మూల నక్షత్ర మహోత్సవం సందర్భంగా స్వామీజీ భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించే శ్రీ విద్యాధరి క్షేత్రం భక్తులు, ఆరాధకులకు ఆకర్షణగా విలసిల్లుతోందని స్పష్టం చేశారు. జ్ఞాన సముపార్జనకు చదువుల తల్లి సంపూర్ణ ఆశీస్సులు పొందాలని, దీంతో విద్య, నైపుణ్యత, సృజనాత్మకత తదితర లక్ష్యసాధనకు మార్గం సుగమం చేసుకోవాలని ఆకాంక్షించారు. శక్తి స్వరూపంగా ప్రసిద్ధికెక్కిన శ్రీ విద్యాధరి క్షేత్రం సర్వశక్తి సామర్థ్యాలను ప్రసాదిస్తుందని, ఈ క్రమంలో అమ్మవారిని భక్తిశ్రద్ధలతో సేవించాలని వివరించారు. కాగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. మూల నక్షత్ర మహోత్సవం పురస్కరించుకొని క్షేత్రంలో లక్ష పుష్పార్చన, పుస్తక రూపిని సరస్వతీ పూజ, చండీ హోమము తదితర అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమాల్లో శ్రీ గురు మదనానంద పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామీజీ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించగా, రెండు వేలకు పైగా అక్షర స్వీకారాలు జరిగినట్లు ఆలయ కమిటీ పేర్కొంది. విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలతో పాటు మహాప్రసాదం అందజేయగా, అమ్మవారి నామస్మరణతో క్షేత్ర సముదాయం మార్మోగింది.

తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలి

ఎల్నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజల భాగస్వామ్యం కీలకం

రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్

సంగారెడ్డి, అక్టోబర్ 16 మనం న్యూస్ ప్రతినిధిః ఎల్నినో ప్రభావంతో వర్షపాతం లోటు, భూగర్భ జలాల తగ్గుదల నేపథ్యంలో భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర యువజనాభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి వాణి ప్రసాద్ అధికారులను ఆదేశించారు. తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, నీటి వృధాను అరికట్టడంతో పాటు అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియో

గించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.ఎల్నినో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ శాఖల సమన్వయంతో పాటు ప్రజలు, రైతుల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. శుక్రవారం గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలో అదనపు కలెక్టర్ టి.ఎల్. సంగీతతో కలిసి వాణి ప్రసాద్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. గ్రామంలో సాగవుతున్న పత్తి, కంది, టమాట పంటలను పరిశీలించి, పత్తి సాగు చేస్తున్న రైతు బాల్రెడ్డితో మాట్లాడి పంటల పరిస్థితి, నీటి లభ్యత, సాగు వివరాలను తెలుసుకున్నారు. ఎల్నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని రైతులకు సూచించారు. ప్రతి రైతు పొలంలో ఫామ్ పాండ్స్ నిర్మించుకునేలా ప్రోత్సహించాలని అధికారులకు తెలిపారు. వీబీ-జీ రామ్జీ పథకం కింద పనిదినాలను సద్వినియోగం చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని, అవసరమైన చోట పంట విరామం పాటించేలా రైతులను ప్రోత్సహించాలని స్థానిక ప్రజాప్రతినిధులకు సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, రానున్న రోజుల్లో ఎదురయ్యే నీటి సమస్యలపై ప్రజలకు వాస్తవిక పరిస్థితులను వివరించాలని తెలిపారు. అనంతరం గుమ్మడిదల తహసీల్దార్ కార్యాలయంలో సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు చెందిన సంబంధిత అధికారులతో వాణి ప్రసాద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుత పంటల పరిస్థితి, వర్షపాతం, తాగునీటి వనరులు, విద్యుత్ సరఫరా, పశుగ్రాసం లభ్యత, భవిష్యత్తులో తలెత్తే సమస్యలను ఎదుర్కొనేందుకు రూపొందించాల్సిన ముందస్తు కార్యాచరణ ప్రణాళికపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతం పొలాల్లో ఉన్న పంటలు చేతికొచ్చే వరకు వాటిని కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రాబోయే యాసంగి సీజన్లో నీటి లభ్యత, భూగర్భ జలాల పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని రైతులు ఆరుతడి పంటలు ఎంపిక చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. నీటి లభ్యతను అంచనా వేయకుండా వరి సాగు చేసి రైతులు నష్టపోకుండా చూడాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాలవారీగా పంటల పరిస్థితిని పరిశీలించి, పంటల రక్షణకు రైతులకు తగిన సూచనలు అందించాలన్నారు. జలాశయాల్లో నీటి నిల్వలు, భూగర్భ జలాల స్థాయి, బోర్లలో నీటి లభ్యత, విద్యుత్ సరఫరా పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ రైతులకు మార్గనిర్దేశం చేయాలని తెలిపారు. గ్రామాలవారీగా తాగునీటి అవసరాలు, నీటి సమస్యలు తలెత్తే ప్రాంతాలను ముందుగానే గుర్తించి పరిష్కార చర్యలు చేపట్టాలని వాణి ప్రసాద్ సూచించారు. వ్యవసాయ, నీటిపారుదల, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. నీటి సరఫరాలో వృథాను అరికట్టి, నీటిని పొదుపుగా వినియోగించుకునేలా వాటర్ రిసోర్సెస్ కమిటీలకు అవగాహన కల్పించాలని, గ్రామస్థాయిలో నీటి సంరక్షణకు సంబంధించిన తీర్మానాలు చేయించాలని తెలిపారు. రాబోయే 10-15 రోజులు పంటల రక్షణకు కీలకమని పేర్కొంటూ, అవసరమైన ప్రాంతాల్లో పంటలకు తగిన విద్యుత్ సరఫరా అందేలా చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రతి వారం సంయుక్త సమీక్ష సమావేశం నిర్వహించాలని తెలిపారు. ఎల్నినో పరిస్థితుల నేపథ్యంలో పశుగ్రాసానికి కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులకు సూచించారు. రైతులు తమ అవసరాలకు అనుగుణంగా పశుగ్రాసాన్ని నిల్వ చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. పశుగ్రాసం వృథా కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల అదనపు కలెక్టర్లు సంగీత, లక్ష్మి కిరణ్, అదనపు ఎస్పి చైతన్య రెడ్డి వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులు, సంగారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి, గుమ్మడిదల తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

కాలిపోతున్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు, వ్యవసాయ పంపుసెట్లు

తీవ్రమవుతున్న విద్యుత్ కొతలు, లో వోల్టేజ్ సమస్య

ఎండిపోతున్న పంటలు, రైతు కంట కన్నీరు

సిద్దిపేట, అక్టోబర్ 19 (మనం ప్రతినిధి): గతంలో యాసంగి సీజన్ చివరలో విద్యుత్ కొరత, లో వోల్టేజ్ ఇబ్బంది, పంటలు ఎండిపోయే సమస్యలు ఉండేవి. ఈసారి వర్షాకాలంలోనే రైతులను ఈ సమస్యలు వెంటాడుతున్నాయి. వానకాలం లో సాగైనా అనేక వేల ఎకరాలకు సాగునీటి కొరత ఏర్పడి పంటలు ఎండిపోతున్నాయి. చేతికంద వచ్చిన పంటలు ఎండిపోవడంతో రైతు కంట కన్నీరు కమ్ముకుంటుంది. ఉమ్మడి జిల్లాలో విద్యుత్ కోతలు, లో వోల్టేజ్ సమస్య తీవ్రం కావడంతో విద్యుత్ పంపుసెట్లు, ట్రాన్స్ఫార్మర్లు కూడా కాలిపోతున్నాయి. అక్టోబర్ నెల ప్రారంభం నుండి ఉమ్మడి జిల్లాల్లో విద్యుత్ సమస్య తీవ్రమైంది. రోజుకు 6 గంటలు విద్యుత్ సరఫరా జరుగుతున్నట్లు రైతులు చెప్తున్నారు. ఉదయం 7:30 కు వ్యవసాయానికి త్రీఫేస్ కరెంటు సరఫరా ప్రారంభం కాగా సాయంత్రం 4 గంటలకు ముగుస్తుంది. రోజుకు 8 గంటల 30 నిమిషాల సరఫరా సమయంలో అనేకసార్లు సరఫరా కట్ కావడంతో సుమారు రెండు గంటలకు పైగా సమయం వృదా పోగా 6 గంటలకే పరిమితం అవుతుంది. వరి నాట్ల సమయంలో 14 గంటలు సరఫరా చేసి ఇప్పుడు 6 గంటలకే పరిమి తం చేస్తే పంటల సాగుపై తీవ్ర సాగునీటి సమస్య ఏర్పడుతున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కీలక దశలో వరి...

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో వరి పొట్ట, గింజలు పాలు పోసుకునే దశలో ఉంది. ఈ సమయంలో వరికి సాగునీరు సమృద్ధిగా ఉండాలి. ఎండిపోతే దిగుబడులు తగ్గడంతో పాటు గింజలు తాలు పోయి నూకలుగా మారుతాయి. ఈసారి సన్న రకాలు ఎక్కువ విస్తీర్ణంలో సాగు కావడం వల్ల బహిరంగ మార్కెట్లో మంచి ధర పలుకుతుండడంతో సన్న రకా ల పైరు నీటి కొరత తో ఎండిపోతే రైతులకు తీవ్ర నష్టం ఏర్పడే ప్రమాదం ఉంది. మరో 20 రోజులు విద్యుత్ రోజుకు 12 గంటలకు మించి సరఫరా ఇస్తే ఉమ్మడి జిల్లాలో వరి పంట గట్టెక్కే అవకాశం ఉంది.

కాలిపోతున్న ట్రాన్స్ఫార్మర్లు...

గ్రామాలలో లో వోల్టేజ్ విద్యుత్ కోతల కారణంగా ట్రాన్స్ఫార్మర్లతోపాటు వ్యవసాయ పంప్ సెట్లు అనేకం కాలిపోతున్నాయి. పగటి సమయం విద్యుత్ సరఫరా జరగడం వల్ల ఎక్కువ విద్యుత్తులోడు ఏర్పడి ట్రాన్స్ఫార్మర్లు కాలిపోతున్నట్లు చెప్తున్నారు. వర్ధల్ మండలం మైలారం గ్రామానికి చెందిన దళిత రైతులు తమకున్న ట్రాన్స్ఫార్మర్ పదేపదే ట్రిప్ కావడంతో ట్రిప్ కాకుండా బిగుతుగా తాడుతో కట్టారు. తమకు ఈ పొలమే తిండికి ఆధారమని వాన కాలమే పంటలు ఎండిపోతే తమకు పెట్టుబడి నష్టంతో పాటు తిండి కొడత ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయానికి రాత్రి సమయంలో విద్యుత్ సరఫరా చేయాలి

రాత్రి సమయంలో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయాలని తద్వారా మిగతా విద్యుత్ వాడకానికి పగలు సమయంలో సౌకర్యవంతంగా ఉండగా, వ్యవసాయానికి నీరుపారకం రాత్రి సమయంలో అనుకూలంగా ఉంటుందని రైతుల చెప్తున్నారు. రాత్రి 10 నుండి తెల్లవారుజాము వరకు అనేక రకాల విద్యుత్ వాడకం తగ్గుతుందని వ్యవసాయానికి వోల్టేజ్ సమస్య లేకుండా విద్యుత్ సరఫరా అవుతుందని చెప్తున్నారు. ట్రాన్స్ఫార్మర్లు, వ్యవసాయ పంప్ సెట్లు కాలిపోవడం వల్ల అదనపు ఖర్చు పెట్టుబడి తమ పై పెరుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పొట్టకొచ్చిన వరి పంట ఎండిపోతుందిః కనకయ్య, రైతు, మైలారం

కరెంటు బాగా ఇబ్బంది పెడుతుంది. రోజుకు 6 గంటలు సరిగా వస్తలేదు. వరి పంట పొట్టకొచ్చింది. కరెంటు లేక నీళ్లు సరిపోత లేవు. ట్రాన్స్ఫార్మర్ లో వోల్టేజ్ సమస్యతో గడ్కీ ట్రిప్ అవుతుంది. బోరులో నీళ్లు ఉన్నా పొలం పారుతలేదు. రోజుకు 12 గంటలు ఇస్తే పంటలు గడ్డకు పడ్తయి.

తెలంగాణలో రోజుకు 21 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి..

తల గాయాలపై అప్రమత్తత అవసరం

హైదరాబాద్, అక్టోబర్ 17(మనంన్యూస్): రోడ్డు ప్రమాదాల్లో తలకు తగిలే గాయాలు ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితుడు సాధారణంగానే కనిపించినప్పటికీ, మెదడులో అంతర్గత రక్తస్రావం లేదా వాపు ఉండే అవకాశం ఉందని, అందువల్ల తల గాయాలను నిర్లక్ష్యం చేయకూడదని హెచ్చరిస్తున్నారు. 2026 జనవరి 1 నుంచి జూలై 27 వరకు తెలంగాణలో 16,179 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయి. ఈ ప్రమాదాల్లో 4,452 మంది ప్రాణాలు కోల్పోగా, 16,043 మంది గాయపడ్డారు. ఈ గణాంకాల ప్రకారం, ఆ కాలంలో రాష్ట్రంలో రోజుకు సగటున 21 మంది రోడ్డు ప్రమాదాల కారణంగా మృత్యువాత పడ్డారు. రోడ్డు ప్రమాదాల తీవ్రతను, బాధితులకు సకాలంలో వైద్యసేవలు అందించాల్సిన అవసరాన్ని ఈ వివరాలు తెలియజేస్తున్నాయి. తలకు గాయమైనప్పుడు బయట కనిపించే గాయాన్ని బట్టి ప్రమాద తీవ్రతను అంచనా వేయడం సరికాదు. తీవ్రమైన తలనొప్పి, పదేపదే వాంతులు, మగత, స్పృహ కోల్పోవడం, చేతులు లేదా కాళ్లలో బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి. కొన్ని సందర్భాల్లో గాయం జరిగిన వెంటనే లక్షణాలు స్పష్టంగా కనిపించకపోయినా, ఆ తర్వాత పరిస్థితి విషమించే అవకాశం ఉంటుంది. తీవ్రమైన మెదడు గాయాలను గుర్తించేందుకు వైద్య పరీక్షలు, అవసరాన్ని బట్టి సీటీ స్కాన్ వంటి పరీక్షలు కీలకంగా ఉంటాయి. మెదడులో రక్తస్రావం లేదా వాపును సకాలంలో గుర్తించి తగిన చికిత్స అందించడం ద్వారా ప్రాణాపాయాన్ని తగ్గించవచ్చు. ప్రతి తల గాయానికీ శస్త్రచికిత్స అవసరం ఉండదు. అయితే, తీవ్రమైన గాయాల విషయంలో చికిత్సలో ఆలస్యం ప్రాణాలకే ముప్పు కలిగించవచ్చు. ప్రమాద స్థలంలో బాధితుడిని అనవసరంగా కదిలించకుండా అత్యవసర వైద్యసేవలకు సమాచారం అందించాలి. ముఖ్యంగా మెడ లేదా వెన్నెముకకు గాయం అయి ఉండే అవకాశం ఉన్నప్పుడు మరింత జాగ్రత్త అవసరం. హెల్మెట్ ధరించడం, కారులో సీట్బెల్ట్ ఉపయోగించడం, అతివేగానికి దూరంగా ఉండటం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం వంటి చర్యలు ప్రమాదాల తీవ్రతను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవడంతోపాటు, ప్రమాదం జరిగినప్పుడు తక్షణమే సరైన వైద్యసహాయం అందేలా చూడాలి. తల గాయాల విషయంలో అప్రమత్తత, సకాలంలో చికిత్స ఒక ప్రాణాన్ని కాపాడటమే కాకుండా బాధితుడి కుటుంబ భవిష్యత్తును కూడా రక్షించగలవు.

బతుకమ్మ వేడుకలకు ముస్తాబవుతున్న సంగారెడ్డి కింది బజార్ చెరువు కట్ట

- ఏర్పాట్లను పరిశీలించిన జగ్గారెడ్డి,తోపా
- సదాశివపేట మండలం రేజింతల్లో బతుకమ్మ ఘాట్ను ప్రారంభించిన నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి, అక్టోబర్ 16 మనంప్రతినిధి : సంగారెడ్డి పట్టణంలోని మహబూబ్ సాగర్ చెరువు కట్టపై బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్ పరిశీలించారు. కట్ట పొడవునా చేపడుతున్న విద్యుద్దీపాలంకరణ, కట్ట అంచుల్లో బారికేడ్ల ఏర్పాటు పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. బతుకమ్మ ఘాట్లను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈసారి బతుకమ్మల నిమజ్జనం కోసం రెండు ఘాట్లను సిద్ధం చేస్తున్నామని, మెట్లకు రంగులు వేస్తున్నామని నిర్వాహకులు వివరించారు. వినాయక నిమజ్జనానికి సంబంధించిన అవశేషాలను పూర్తిగా తొలగించినట్లు మున్సిపల్ సిబ్బంది తెలిపారు. వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా 32 అడుగుల భారీ బతుకమ్మను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. దీని తయారీకి 16 టన్నుల స్టీల్, అలంకరణకు ఎనిమిది టన్నుల పూలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఐదు డీజే పాయింట్లు, ఘాట్ల వద్ద ఐదు లైటింగ్ టవర్లతో సహా మొత్తం 18 లైటింగ్ టవర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అలాగే 32 అడుగుల స్క్రీన్, లేజర్ లైటింగ్తో పాటు చెరువు కట్ట చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, నాయకులు బొంగుల రవి కూన సంతోష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కౌన్సిలర్ శ్రీకాంత్ గౌడ్, మహేష్ ముదిరాజ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

రేజింతల్లో బతుకమ్మ ఘాట్ ప్రారంభం...

సదాశివపేట మండలం రేజింతల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన బతుకమ్మ ఘాట్ను గురువారం నిర్మలా జగ్గారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిద్ధన్న, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్ గడీల ఆశిరెడ్డి, నందికంది సర్పంచ్ విజయ్ భాస్కర్ రెడ్డి, ఇశ్రీతబాద్ సర్పంచ్ అనితా శ్రీనివాస్, గ్రామస్థులు పాల్గొన్నారు.

కరువు కోరల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి
ఉపాధి హామీ పనులు ప్రారంభించాలి
సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్

కొత్తగూడెం టౌన్ అక్టోబర్ 16, (మనం న్యూస్): ఎల్నినో ప్రభావంతో జిల్లాలో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, పంటలు ఎండిపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులపై జిల్లా కలెక్టర్ అఖిలపక్ష సమావేశం నిర్వహించి, కరువు నివారణకు ప్రభుత్వం తీసుకోనున్న చర్యలను ప్రజలకు వివరించాలని కోరారు. వ్యవసాయం దెబ్బతినడంతో గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికులకు పనులు దొరకడం కష్టంగా మారిందని, జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. కరువు పరిస్థితులకు తోడు అక్రమ ఇసుక తవ్వకాల వల్ల భూగర్భ జలాలు మరింత అడుగంటిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే అప్రకటిత విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయని, రానున్న రోజుల్లో విద్యుత్ సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపారు. వ్యవసాయ బోర్ల కింద సాగు కూడా కష్టతరంగా మారిందని, ఎల్నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైతులకు ప్రత్యామ్నాయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలను కరువు పరిస్థితుల నుంచి రక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇసుక రవాణా కారణంగా దెబ్బతిన్న భద్రాచలం, పినపాక నియోజకవర్గాల రహదారులకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ సమావేశానికి సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య అధ్యక్షత వహించగా, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ.జె. రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె. బ్రహ్మాచారి, అన్నవరపు సత్యనారాయణ, కారం పుల్లయ్య, లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్తో పాటు దొడ్డా రవికుమార్, నబి, పిట్టల అర్జున్, గడ్డం స్వామి, గద్దల శ్రీను, నిమ్మల వెంకన్న, ముదిగొండ రాంబాబు, వీర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల మరమ్మతులకు నిధులివ్వండి

నూతన భవనాలు, మరమ్మతులకు రూ.10.12 కోట్లు అవసరం
ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయానికి త్వరగా రెగ్యులర్ వీసీని నియమించాలి
విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణాకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి



ఖమ్మం, అక్టోబరు 16(మనం బ్యూరో): ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడం, విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలు కల్పించడమే లక్ష్యంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చర్యలు చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణాతో మంత్రి సమావేశమయ్యారు. ఖమ్మం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో నూతన భవనాల నిర్మాణం, మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.10.12 కోట్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే కొత్తగూడెంలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయానికి రెగ్యులర్ ఉపకులపతిని (వీసీ) త్వరితగతిన నియమించడంతో పాటు, విశ్వవిద్యాలయంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బడులకు భరోసా..
విద్యార్థులకు మెరుగైన వసతులు...

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరతను అధిగమించి, విద్యార్థులకు మెరుగైన అభ్యాస వాతావరణం కల్పించాల్సిన అవసరాన్ని మంత్రి వివరించారు. ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం మండలాల పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో అభివృద్ధి పనుల కోసం రూ.10.12 కోట్లు కేటాయించాలని కోరారు. నూతన భవనాల నిర్మాణం, మరమ్మతులు, అవసరమైన విద్యా సదుపాయాల కల్పనతో పాటు డిజిటల్, ఇతర బోధనా పరికరాలను సమకూర్చడం ద్వారా ప్రభుత్వ బడులను మరింత బలోపేతం చేయవచ్చని పేర్కొన్నారు. ఈ పాఠశాలల్లో అధికశాతం బలహీనవర్గాలు, వెనుకబడిన తరగతులు, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తే విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెరుగుతుందని, ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా సర్కారీ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. అందుబాటులో ఉన్న నిధుల వనరుల ద్వారా ప్రతిపాదిత మొత్తాన్ని మంజూరు చేసి, పనులను ప్రాధాన్యంగా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

16 పాఠశాలలు.. 2,988 మంది విద్యార్థులకు ప్రయోజనం...

ఖమ్మం అర్బన్ పరిధిలోని ఎనిమిది, రఘునాథపాలెం మండలంలోని మరో ఎనిమిది పాఠశాలలు కలిపి మొత్తం 16 బడులను అభివృద్ధి ప్రతిపాదనల్లో చేర్చారు. వీటిలో 2,988 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల మెరుగుదల, విద్యా పరికరాల ఏర్పాటు తదితర పనులకు అంచనాలు రూపొందించారు.

ఖమ్మం అర్బన్ పరిధిలో..

ఎన్ఎస్పీ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాండురంగాపురం జడ్పీ ఉన్నత పాఠశాల, రాజేంద్ర నగర్ ఉన్నత పాఠశాల, జి.ఖమ్మం ఉన్నత పాఠశాల, బాలాజీనగర్ జడ్పీ ఉన్నత పాఠశాల, కుచవల్లి ప్రాథమిక పాఠశాల, బాలాపేట (వైఎస్సార్ కాలనీ) ఎంపీపీఎస్, రాజకవీధి ప్రాథమిక పాఠశాల ఉన్నాయి.

రఘునాథపాలెం మండలంలో..

వి.వెంకటాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల, ఏర్లపూడి, వి.వెంకటాయపాలెం ఎంపీపీఎస్, పువ్వాడనగర్ ఎంపీపీఎస్, పాపటపల్లి, మంచుకొండ, కోయచలక, చిమ్మపూడి పాఠశాలలు ఉన్నాయి. ఈ ప్రతిపాదనలకు నిధులు మంజూరైతే ఆయా పాఠశాలల్లో వసతుల మెరుగుదలకు మార్గం సుగమం కానుంది. విద్యార్థులకు మెరుగైన తరగతి గదులు, అవసరమైన సదుపాయాలు అందుబాటులోకి రావడంతో ప్రభుత్వ విద్యాసంస్థలపై నమ్మకం మరింత పెరిగే అవకాశం ఉంది.

వర్సిటీకి రెగ్యులర్ వీసీని నియమించాలి...

కొత్తగూడెంలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయ అభివృద్ధి, సజావైన నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. విశ్వవిద్యాలయానికి రెగ్యులర్ ఉపకులపతిని త్వరగా నియమించాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణాకు విజ్ఞప్తి చేశారు. విశ్వవిద్యాలయ పరిపాలన మరింత సమర్థవంతంగా సాగడంతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు పూర్తిస్థాయి నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. ఎర్త్ సైన్సెస్ రంగంలో విద్య, పరిశోధనలకు ప్రాధాన్యం కల్పించడంతో పాటు, విశ్వవిద్యాలయాన్ని ఉన్నత ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

కన్నీరు మిగిల్చిన తనయుడి మరణం

తండ్రికి ఇష్టమైన బట్టలు కొనిచ్చిన.. క్షణాల్లోనే కానరాని లోకాలకు



వైరా, అక్టోబర్ 16(మనం న్యూస్): అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకు ప్రయోజకుడై తమకు అండగా నిలుస్తాడని ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆ తల్లిదండ్రులకు తీరని శోకం మిగిలింది. రెక్కల కష్టంతో పెంచిన బిడ్డ భవిష్యత్తుపై ఎన్నో కలలు కన్న ఆ కుటుంబంలో ఒక్కసారిగా విషాదం అలుముకుంది. తండ్రికి ఇష్టమైన బట్టలు కొనిచ్చి ఇంట్లోకి వెళ్లిన కొద్దిసేపటికే ఆ కుమారుడు విగతజీవిగా మారడం కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంలో ముంచింది.

ఖమ్మం జిల్లా వైరా మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు గండగలపాడుకు చెందిన సీపీఎం కౌన్సిలర్ కిన్నెర కృష్ణ కుమారుడు రాఘవ (19) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. హైదరాబాద్లోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న రాఘవ రెండు రోజుల క్రితమే స్వగ్రామమైన గండగలపాడుకు వచ్చాడు. శుక్రవారం ఉదయం తన తండ్రికి ఇష్టమైన బట్టలు కొనిచ్చి ఇంట్లోకి వెళ్లిన కొద్దిసేపటికే ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే వైరాలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని, అప్పటికే రాఘవ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కళ్లముందే తిరుగుతూ కబుర్లు చెప్పిన కొడుకు ఇక లేడనే నిజాన్ని ఆ తల్లిదండ్రులు తట్టుకోలేకపోతున్నారు. కుమారుడి మరణవార్తతో తండ్రి కిన్నెర కృష్ణ, తల్లి విజయల రోదనలు మిన్నంటాయి. ఉన్నత చదువులు చదువుతూ జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటాడని ఆశించిన కుమారుడు 19 ఏళ్లకే తనువు చాలించడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది. బిడ్డతో కలిసి చూడాలనుకున్న భవిష్యత్తు కలలన్నీ ఒక్కసారిగా చెదిరిపోవడంతో ఆ తల్లిదండ్రుల ఆవేదన పలువురిని కలచివేసింది. ఈ విషాద ఘటనతో గండగలపాడులో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న స్థానికులు, సీపీఎం నాయకులు, కార్యకర్తలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు కృష్ణ నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. దుఃఖంలో ఉన్న కుటుంబ సబ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వైద్యారోగ్య శాఖ సీనియర్ జూనియర్ అసిస్టెంట్లు

- **విధులు సక్రమంగా నిర్వర్తించాలి**
- **డిఎం అండ్హెచ్ఓ డాక్టర్ తుకారాం రాథోడ్**

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 16 (మనంప్రతినిధి): ఆరోగ్య శాఖ - భద్రాద్రి కొత్తగూడెం జిల్లా - అన్నిపిహెచ్ సి, యుపి హెచ్ సి మరియు యుఎఫ్ డబ్ల్యూ సిలలో పనిచేస్తున్న సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు తమ విధుల్లో అనుసరించాల్సిన పద్ధతులు సక్రమంగా పాటించాలని జిల్లా వైద్య శాఖ అధికారి తుకారం రాథోడ్ అన్నారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో నెలవారీ సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పిహెచ్ సి, యుపి హెచ్ సి మరియు యుఎఫ్ డబ్ల్యూ సిలలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు మరియు జూనియర్ అసిస్టెంట్లందరూ తప్పనిసరిగా పాటించాల్సిన విధుల గురించి సూచనలు అందించారు.

సమాచార హక్కు చట్టం,కింద స్వీకరించబడిన అన్ని దరఖాస్తులను, చట్టపరంగా నిర్ణీత కాలపరిమితిలోపు (సాధారణంగా 30 రోజులలోపు) పరిష్కరించాలని, సంబంధిత సిబ్బంది సరైన రికార్డులను నిర్వహించాలి మరియు నిర్ణీత సమయంలో సమాధానాలు అందేలా చూడాలని, ఈ చట్ట నిబంధనలను పాటించడంలో జాప్యం జరిగినా లేదా ఉల్లంఘనలు చోటుచేసుకున్నా, దానిని తీవ్రంగా పరిగణించి, సంబంధిత నిబంధనలు మరియు నియమాల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని డి ఎం అండ్ హెచ్ ఓ హెచ్చరించారు. సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికి విడివిడిగా వ్యక్తిగత ఫైళ్లను నిర్వహించాలి. ఉద్యోగికి సంబంధించిన సర్వీసు వివరాలు, నియామక ఉత్తర్వులు, బదిలీ ఉత్తర్వులు, సెలవుల రికార్డులు, సర్వీసు సంబంధిత ఉత్తర్వులు మరియు ఇతర అవసరమైన పత్రాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ, భద్రపరచాలని తెలిపారు. పాతవి, కాలం చెల్లినవి లేదా పనికిరాని స్థితిలో ఉన్న పరికరాలను తొలగించాల్సి వచ్చినప్పుడు, అటువంటి పరికరాల వివరాలను సంబంధిత కమిటీ ముందు ఉంచాలి. జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి ఆమోదం పొందిన తర్వాత మరియు నిర్దేశించిన వేలం/టెండర్ విధానాన్ని అనుసరించి మాత్రమే పారవేయడం చేపట్టాలి. అన్ని సంబంధిత రికార్డులు, ఆమోదాలు, కార్యకలాపాలు మరియు వేలం పత్రాలను సంబంధిత ఫైల్లో భద్రపరచాలి.

సందర్శకుల రిజిస్టర్ నిర్వహణ:

ప్రతి సంస్థ ఒక సందర్శకుల రిజిస్టర్ను నిర్వహించాలి. సందర్శకులందరి వివరాలు, వారి పేర్లు, హోదాలు, సందర్శన ఉద్దేశ్యం, తేదీ మరియు సమయంతో సహా నమోదు చేయాలి. వర్తించే చోట ప్రతి సందర్శకుడి సంతకం తీసుకోవాలి మరియు రిజిస్టర్ను తేదీల వారీగా సరిగ్గా నిర్వహించాలి.

సెలవు దినాల డ్యూటీ రోస్టర్ నిర్వహణ....

అన్ని పిహెచ్సిలు, యుపిహెచ్సిలు, యుఎఫ్డబ్ల్యూసిలు, బిడికె మరియు ఎఎంఎం సంస్థలలో సెలవులు మరియు ఇతర నోటిఫైడ్ రోజుల కోసం సరైన డ్యూటీ రోస్టర్ను నిర్వహించాలని, ఈ రోస్టర్లో డ్యూటీకి కేటాయించిన సిబ్బంది పేర్లు మరియు హోదాలు స్పష్టంగా సూచించాలి మరియు తనిఖీ అధికారుల ధృవీకరణ కోసం అందుబాటులో ఉంచాలని ఆయన ఆదేశించారు.

బయోమెట్రిక్ హాజరు...

అన్ని సంస్థలు వర్తించే విధంగా బయోమెట్రిక్ హాజరు మరియు మీ ప్రమాణాలు హాజరు అవసరాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, మరియు పాటించేలా చూడాలని, సిబ్బంది అందరి హాజరును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలి మరియు 100 శాతం పాటించేలా చూడాలని, ఏవైనా వ్యత్యాసాలు లేదా అవకతవకలు ఉంటే అవసరమైన చర్య కోసం వాటిని సంబంధిత అధికారి దృష్టికి తీసుకొని రావాలని డిఎంఅండ్ హెచ్ ఓ తెలిపారు. సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు వైద్యాధికారులు మరియు ఇతర సంబంధిత పర్యవేక్షక సిబ్బంది అందరూ ఆదేశాలను తప్పకుండా అమలు చేయాలని దీన్ని సమర్థ అధికారులు పర్యవేక్షిస్తారని మరియు ఏవైనా లోపాలు జరిగితే తీవ్రంగా పరిగణించబడతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పీహెచ్సీల హెచ్ఈవోలు సీనియర్ అసిస్టెంట్ మరియు జూనియర్ అసిస్టెంట్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

జూలూరుపాడు 400 కేవీ విద్యుత్ ఉపకేంద్ర సందర్శన

- **టిజి ఎన్పీడీసీఎల్ ' సీఎండీ' కర్నాటి వరుణ్ రెడ్డి**
- **పెరగనున్న విద్యుత్ డిమాండ్కు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచన**

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 16 (మనంప్రతినిధి): రానున్న రోజుల్లో విద్యుత్ వినియోగం పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన ముందస్తు చర్యలపై టిజి ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి శుక్రవారం కొత్తగూడెం జిల్లాలోని జూలూరుపాడు 400 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్ సరఫరా వ్యవస్థ పనితీరు, విద్యుత్ డిమాండ్కు అనుగుణంగా సరఫరా సామర్థ్యం, రాబోయే సీజన్లో పెరగనున్న లోడ్ను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని, విద్యుత్ వ్యవస్థలోని కీలక పరికరాలు, ట్రాన్స్ఫార్మర్లు, ఇతర సాంకేతిక వ్యవస్థల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాకు సంబంధించి సమస్యలు తలెత్తే అవకాశాలను ముందుగానే గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో విద్యుత్ సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించేందుకు అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సీఎండీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగుడెం ఎస్ఈ జి .మహేందర్ , డి.ఈ కొత్తగూడెం తదితరులు పాల్గొన్నారు .

ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స రంగంలో విప్లవాత్మక మార్పులు

- **యశోదా హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కిరణ్ కె రెడ్డి బాదం**
- **రోడ్డు ప్రమాదంలో క్షిదిరమైన కాళ్లను రక్షించి ప్రాణాలు కాపాడిన వైద్య బృందం**

ఖమ్మం, అక్టోబర్ 16(మనం న్యూస్): యశోదా హాస్పిటల్స్ సోమాజిగూడలో క్లిష్టమైన పాలీట్రామా చికిత్సలో రోబోటిక్ ఖచ్చితత్వం మరియు అధునాతన లింబ్ సాల్వేజ్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. రోడ్డు ప్రమాదాలు భారతదేశంలో తీవ్రమైన గాయాలకు ప్రధాన కారణాలలో ఒకటిగా కొనసాగుతున్నాయి. ఇవి తరచుగా పాలీట్రామా అనే పరిస్థితికి దారితీస్తాయి అంటే ఒకే సమయంలో రోగికి అనేక ప్రాణాపాయ గాయాలు కలగడం. వీటిలో తీవ్రమైన ఓపెన్ ఫ్రాక్చర్లు మరియు నలిగిపోయిన అవయవాలు అత్యంత సవాలు కలిగించేవి, తరచుగా అవయవాన్ని తొలగించే పరిస్థితికి దారి తీస్తాయి. ట్రామా కేర్ను పునర్నిర్వచించేందుకు యశోదా హాస్పిటల్స్, సోమాజిగూడ తమ అధునాతన లింబ్ సాల్వేజ్ మరియు రీకన్స్ట్రక్షన్ కార్యక్రమాన్ని ప్రదర్శించింది. ఈ ప్రోగ్రామ్ అధిక ఖచ్చితత్వం గల రోబోటిక్ టెక్నాలజీని క్లిష్టమైన పునర్నిర్మాణ పద్ధతులతో సమన్వయం చేసి, గతంలో రక్షించలేనివిగా భావించిన అవయవాలను కూడా కాపాడుతుంది.

సరిహద్దులను దాటుతూ: రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ ఎండోస్కోపిక్ స్ప్రీన్ సర్జరీ

ట్రామా చికిత్సతో పాటు, యశోదా హాస్పిటల్స్ ఎలక్టివ్ ఆర్థోపెడిక్ ప్రక్రియల్లో కొత్త ప్రమాణాలను స్థాపిస్తోంది. డాక్టర్ కిరణ్ కె రెడ్డి బాదం నాయకత్వంలో, ఈ ఆసుపత్రి రోబోటిక్ సహాయంతో జాయింట్ రీప్లేస్మెంట్లో ముందంజలో ఉంది. ఈ సాంకేతికత మోకాలి మరియు నడుం శస్త్రచికిత్సల్లో సూక్ష్మ స్థాయి ఖచ్చితత్వాన్ని అందించి, ఇంప్లాంట్ సరైన అమరిక, తక్కువ ఎముక నష్టం, మరియు శస్త్రచికిత్స అనంతరం నొప్పి గణనీయంగా తగ్గడానికి సహాయపడుతుంది. అదనంగా, ఈ ఆసుపత్రి అధునాతన ఎండోస్కోపిక్ స్ప్రీన్ సర్జరీలో కూడా ముందంజలో ఉంది. ఈ కీహోల్ విధానం ద్వారా చిన్న చీలికలతోనే డిస్క్ హెర్నియేషన్, స్ప్రీనల్ స్టెనోసిస్ చికిత్స చేయవచ్చు. ఇది వెన్నెముక స్థిరత్వాన్ని కాపాడుతూ, రోగులు కొన్ని గంటల్లోనే నడవడానికి సహాయపడుతుంది. ఈ మినిమల్లీ ఇన్వేసివ్ విధానం వృద్ధులు లేదా ఇతర అనారోగ్య సమస్యలు ఉన్న రోగులకు కూడా సురక్షితంగా చికిత్స పొందే అవకాశాన్ని ఇస్తుంది.

ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స రంగంలో విప్లవాత్మక మార్పులు

ఈ సందర్భంగా ఖమ్మంలోని యశోద క్లినిక్లో యశోదా హాస్పిటల్స్, సోమాజిగూడలో సీనియర్ కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కిరణ్ కె రెడ్డి బాదం మాట్లాడుతూ ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స రంగం ఖచ్చితమైన సాంకేతికతతో విప్లవాత్మక మార్పులను చూసిందన్నారు. రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న అవయవం, జాయింట్ సమస్యలు, లేదా తీవ్రమైన వెన్నెముక సమస్యలు ఏవైనా కావొచ్చు. తమ దృష్టి 'అల్ట్రా-మినిమల్లీ ఇన్వేసివ్' చికిత్సపైనే ఉంటుందన్నారు. రోబోటిక్ మరియు ఎండోస్కోపిక్ పద్ధతులు తమకు అత్యంత ఖచ్చితత్వాన్ని ఇస్తాయి, ఇది రోగులకు వేగవంతమైన కోలుకోవడం, మెరుగైన దీర్ఘకాలిక ఫలితాలను అందిస్తుందన్నారు. శస్త్రచికిత్స వల్ల కలిగే నష్టాన్ని తగ్గిస్తూ చలనాన్ని పునరుద్ధరించడం తమ లక్ష్యమన్నారు.

భూ రీ సర్వే నెల రోజుల్లో పూర్తి చేయాలి

- **జీఓ నం. 76 కింద దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన పక్కాగా చేపట్టాలి**
- **భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ అంకిత్**
- **మామిడిగుండాలలో సర్వే పనులు పరిశీలించిన కలెక్టర్**

ఇల్లందు, అక్టోబర్ 16(మనం న్యూస్): జిల్లాలో భూ రీ సర్వే పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా, కచ్చితత్వంతో విధులు నిర్వహించాలని సూచించారు. శుక్రవారం ఇల్లందు ప్రాంతంలో పర్యటించిన కలెక్టర్ ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాలు, మామిడి గుండాలలో భూ రీ సర్వే పనులు, జీఓ నం. 76 కింద సింగరేణి భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తులకు సంబంధించి చేపట్టిన క్షేత్రస్థాయి సర్వేను పరిశీలించారు. సర్వే పురోగతి, భూముల విస్తీర్ణం, గతంలో జారీ చేసిన పట్టాలు, భూ రికార్డులు, సరిహద్దుల నిర్ధారణకు సంబంధించిన వివరాలను సర్వే సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామ పరిధిలోని భూములకు సంబంధించి పాత రికార్డులు, మ్యాప్లను పరిశీలించి, గతంలో పట్టాలు జారీ చేసిన భూముల సరిహద్దులను స్పష్టంగా నిర్ధారించాలని సూచించారు. అటవీ, రెవెన్యూ భూముల హద్దుల విషయంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి రికార్డుల్లో నమోదు చేయాలని తెలిపారు. బోటి గుంపులో మొత్తం 4,733 ఎకరాల భూమి ఉన్నట్లు, గ్రామ పరిధిలోని 130వ సర్వే నంబరులో సుమారు 4,200 ఎకరాల విస్తీర్ణం ఉన్నట్లు సర్వే సిబ్బంది కలెక్టర్కు వివరించారు. భూ సరిహద్దుల నిర్ధారణలో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా రికార్డుల ఆధారంగా సర్వే నిర్వహించి, నెల రోజుల్లోగా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటన సందర్భంగా ఎంపీడీవో, ఏపీఎం అందుబాటులో లేకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ పర్యటనకు సంబంధించిన విధుల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేస్తూ, సంబంధిత అధికారులకు మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో జీఓ నం. 76 కింద సింగరేణి భూముల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వారి స్థలాల పరిశీలనకు సంబంధించి నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి సర్వేను కూడా కలెక్టర్ పరిశీలించారు. సర్వే నిర్వహణ తీరును, స్థలాల వాస్తవ పరిస్థితులను, దరఖాస్తుదారుల వివరాల నమోదు ప్రక్రియను సమీక్షించారు. దరఖాస్తుల్లో పేర్కొన్న వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత రికార్డులతో సరిపోల్చుకోవాలని అధికారులకు సూచించారు. స్థలాల విస్తీర్ణం, సరిహద్దులు, వినియోగం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవ వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా ప్రతి దరఖాస్తును పారదర్శకంగా పరిశీలించాలని, సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలను సంబంధిత రికార్డులతో ధ్రువీకరించి, తదుపరి ప్రక్రియను నిబంధనల మేరకు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

ఇల్లందులోని సింగరేణి హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. నూతన ఓటరు నమోదు కోసం ఫారం-6 ద్వారా స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి, నమోదు ప్రక్రియ పురోగతిని బూత్ స్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. 18 ఏళ్ల నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని, ప్రత్యేక శిబిరాల సమయంలో బూత్ స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సంప్రదింపు నంబర్లు ప్రజలకు అందుబాటులో ఉంచాలని, నమోదు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కాశీరాం, జిపిఓ లక్ష్మీకాంత్, మామిడి గుండాల సర్పంచ్ ఎట్టి రమణ

పస్రా రామాలయం వద్ద కనకదుర్గమ్మ సన్నిధిలో అన్నదానం

- భక్తులకు అన్నప్రసాదం వడ్డించిన మంత్రి సీతక్క, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్

గోవిందరావుపేట, అక్టోబర్ 16,మనం ప్రతినిధిః గోవిందరావుపేట మండలం పస్రా గ్రామంలోని రామాలయం వద్ద కనకదుర్గమ్మ మండపంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. పాడిపంటలతో గ్రామాలు సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబం ఆనందంగా జీవించాలని అమ్మవారిని ప్రార్థించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులకు అన్నప్రసాదం అందించారు. అన్నదానం గొప్ప సేవాకార్యమని, ఇలాంటి కార్యక్రమాలు ఆధ్యాత్మికతతో పాటు సేవాభావాన్ని, సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయని పలువురు పేర్కొన్నారు. కనకదుర్గమ్మ ఆశీస్సులతో ములుగు జిల్లాతో పాటు రాష్ట్ర ప్రజలందరికీ మేలు జరగాలని మంత్రి సీతక్క, పైడాకుల అశోక్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, జిల్లా కార్మిక విభాగం అధ్యక్షుడు కొంపెల్లి శ్రీనివాస్రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీజేపీకి నుండి కాంగ్రెస్‌లో చేరిన చెంగల సాంబరాజు

తాడ్వాయి, అక్టోబర్ 16, మనం ప్రతినిధి: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తాడ్వాయి మండలానికి చెందిన బీజేపీ నాయకుడు చెంగల సాంబరాజు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం తాడ్వాయి మండల కేంద్రంలో రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క సమక్షంలో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్లో చేరుతున్నారని పేర్కొన్నారు. పార్టీలో చేరిన నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్లో చేరిన చెంగల సాంబరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజల పట్ల చూపుతున్న అంకితభావం తనను ఆకర్షించాయని తెలిపారు. అందుకే బీజేపీని వీడి కాంగ్రెస్లో చేరినట్లు పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయడంతోపాటు ప్రజలకు సేవ చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, మండల అధ్యక్షుడు మంకిడి నరసింహస్వామి, సహకార సంఘం చైర్మన్ బొల్లు దేవేందర్ ముదిరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జాలపు అనంతరెడ్డి, జిల్లా కార్యదర్శి ఇర్ప సునీల్ దొర, మాజీ సహకార సంఘం చైర్మన్ పులి సంపత్ గౌడ్, మేడారం సర్పంచి పీరీల భారతి-వెంకన్న, యూత్ ఉపాధ్యక్షుడు సిద్ధబోయిన వెంకటేష్, ఉపసర్పంచి ఆలకుంట వనిత-కృష్ణ, జంగా వెంకటేష్, ఊరట్టం ఉపసర్పంచి కాక రంజిత్, గండికోట నారాయణ, చర్ప నేతాజీ, సింగిల్ విండో డైరెక్టర్ ఎనగందుల బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో గౌడ్ హాస్టల్‌కు కొత్త భవనం

గౌడ్ హాస్టల్ నూతన భవనం ప్రారంభం

ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, పలువురు నేతలు

పటాన్చెరు, అక్టోబర్ 16 (మనం న్యూస్): పటాన్చెరు మండలం నందిగామ గ్రామంలో నూతనంగా నిర్మించిన గౌడ్ హాస్టల్ భవనాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన భవనాన్ని ప్రారంభించారు. భవన ప్రారంభోత్సవం అనంతరం నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథులతో పాటు పలువురు నాయకులు ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను గౌడ్ హాస్టల్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, టీఎస్ టీసీఎఫ్సీ చైర్మన్ మోతుకూరి చంద్రశేఖర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ పటాన్చెరు నియోజకవర్గ ఇన్చార్జి కాట శ్రీనివాస్ గౌడ్, శేరిలింగంపల్లి ఇన్చార్జి జగదీశ్వర్ గౌడ్, టీ. వీరేందర్ గౌడ్, పల్లె రవి, పటాన్చెరు మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం, నందిగామ సర్పంచ్ విక్రమ్ గౌడ్, గౌడ్ హాస్టల్ అధ్యక్షుడు చక్రవర్తి గౌడ్, హాస్టల్ భవన స్థలదాత దొంతి లక్ష్మీనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యేలు, బీసీ సంఘాల నాయకులు, గౌడ సంఘాల ప్రతినిధులు, గౌడ్ హాస్టల్ కమిటీ సభ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో క్రీడలు కీలకం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- అట్టహాసంగా ముగిసిన స్కూల్ గేమ్స్
- ఫెడరేషన్ అండర్ 17 బాలబాలికల రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలు

పటాన్ చెరు, అక్టోబర్ 16 (మనం న్యూస్) : ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని.. ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గత రెండు రోజులుగా పటాన్ చెరు పట్టణంలోని మైత్రి మైదానం వేదికగా జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి అండర్ 17 బాల బాలికల కుస్తీ పోటీలు శుక్రవారం సాయంత్రం ఘనంగా ముగిసాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఉత్సాహభరిత వాతావరణంలో సాగిన ఈ పోటీలు క్రీడాభిమానుల్లో ఆనందోత్సాహాలను నింపాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతోపాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని, విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ, ఓటముల నుంచి పాఠాలు నేర్చుకున్నప్పుడే జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడం సాధ్యమవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వర్ నాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మైత్రి క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఎట్టయ్య, పృథ్వీరాజ్, రాజ్ కుమార్, రాము, షకీల్, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బెస్ట్ క్యాడెట్‌కు అవార్డు ప్రధానం

వరంగల్, అక్టోబర్ 16(మనంన్యూస్)ః స్థానిక లాల్ బహదూర్ కళాశాల ఎన్సిసి 10వ తెలంగాణ బెటాలియన్ ఆర్మీ వింగ్ వరంగల్ నుండి బెస్ట్ క్యాడెట్ అవార్డు అన్యువల్ కమాండ్ ట్రైనింగ్ క్యాంప్ ఎనిమిది కామండింగ్ అధికారి కర్నాల్ ఎస్ఎస్ రామదురై చేతుల నుండి ఎండి యాసరాఫత్ పొందినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ డి హెచ్ రావు తెలిపారు. ఎన్సిసి పదవ తెలంగాణ బెటాలియన్ లో ఉత్తమ ప్రతిభా కనబరిచి అధికారులచే ప్రశంసలందుకున్నాడని క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, కమాండ్, మల్టీ స్కిల్స్, డ్రోన్ శిక్షణలో ప్రతిభ యువ ఆపద మిత్రులు నైపుణ్యవంతమైన స్కిల్స్ ప్రదర్శించినందుకు ఈ అవకాశం అధికారులు ఉత్తమ క్యాడెట్ గా ప్రకటించారని ప్రిన్సిపాల్ తెలిపారు ఈ కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ ఎం సదానందం, సుబేదారి మేజర్ రాజేష్ రామ్నాథ్, జె సి ఓ మగ్గం మరియు సీనియర్ కాడెట్స్ అభినందించారు.

కుక్క దాడిలో నాలుగేళ్ల చిన్నారికి తీవ్ర గాయాలు

ముప్పనపల్లిలో ఘటన.. ముఖం, చెంపపై తీవ్ర గాయాలు.. గ్రామంలో ఆందోళన

ముప్పనపల్లి, అక్టోబరు 16 (మనం న్యూస్): కుక్క దాడిలో నాలుగేళ్ల చిన్నారి తీవ్రంగా గాయపడిన ఘటన కన్నాయిగూడెం మండలం ముప్పనపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. భూపాలపల్లి జిల్లా ఘనపురం మండలం ధర్మారావుపేటకు చెందిన కోడెపాక ప్రణవి (4) తన తల్లిదండ్రులతో కలిసి ముప్పనపల్లిలోని అమ్మమ్మ ఇంటికి వచ్చింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ఇంటి ఆవరణలో చిన్నారి ఆడుకుంటుండగా అక్కడికి వచ్చిన కుక్క ఒక్కసారిగా ఆమెపై దాడి చేసింది. దీంతో చిన్నారి ముఖం, చెంప ప్రాంతంలో తీవ్ర గాయాలయ్యాయి. కుక్క దాడితో చిన్నారి కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు వెంటనే అక్కడికి చేరుకుని కుక్కను తరిమేశారు. అనంతరం గాయపడిన ప్రణవిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చిన్నారి ముఖంపై తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఘటనతో ముప్పనల్లి గ్రామంలో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

కుక్కల బెడదను అరికట్టాలి

గ్రామంలోని వీధుల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కల వల్ల చిన్నారులు, వృద్ధులు బయటకు రావాలంటే భయపడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో సంచరిస్తున్న వీధి కుక్కలను నియంత్రించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్ ముసుగులో జర్నలిస్టులపై దాడులా..?

- ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తే ప్రజాస్వామ్యానికే ప్రమాదం
- జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ఎస్ఐ శ్రీకాంత్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలి.. బాధితులకు న్యాయం చేయాలి
- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవాధ్యక్షురాలు విమలక్క డిమాండ్

కరీంనగర్ అక్టోబర్ 16(మనం బ్యూరో): ప్రజల పక్షాన నిలబడి, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపైనే పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారనే ఆరోపణలు రావడం అత్యంత ఆందోళనకరమని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవాధ్యక్షురాలు, తెలంగాణ ఉద్యమకారిణి విమలక్క తీవ్రంగా ఖండించారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే భక్షకులుగా మారితే సామాన్యులకు దిక్కెవరు? ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే ఇదేనా? రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉన్నట్టా లేనట్టా? అని ఆమె ప్రశ్నించారు.రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో పోలీసుల చేతిలో చిత్రహింసలకు గురైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జర్నలిస్టులు పొత్తూరి శేఖర్, రాతిపల్లి సంపత్లను విమలక్క శుక్రవారం కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో పరామర్శించారు. ఆసుపత్రిలోని క్రిటికల్ కేర్ విభాగంలో చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులు, కుటుంబ సభ్యుల ద్వారా తెలుసుకున్నారు.బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడం జర్నలిస్టుల బాధ్యత అని, ఆ బాధ్యతను నిర్వర్తించే వారిని భయభ్రాంతులకు గురిచేయడం రాజ్యాంగం కల్పించిన భావప్రకటనా స్వేచ్ఛకు విరుద్ధమని అన్నారు. ప్రజల సమస్యలను ప్రశ్నించినందుకు జర్నలిస్టులపై దాడులు జరిగితే ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదమని హెచ్చరించారు.జర్నలిస్టులపై దాడులు.. కేసులు.. బెదిరింపులు కొనసాగితే మీడియా స్వేచ్ఛకు అర్థమేంటి? రాజన్న సిరిసిల్ల జిల్లాలో పాత్రికేయులు స్వేచ్ఛగా విధులు నిర్వహించలేని పరిస్థితులు నెలకొంటున్నాయన్న ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని కోరారు. చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసులు చట్టానికి అతీతులేమీ కాదని, విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులు జరిగినట్లు ఆరోపణలు వచ్చినప్పుడు నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రశ్నించే గొంతుకలను లాఠీలతో, బెదిరింపులతో, అక్రమ కేసులతో అణచివేయాలనుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధమని విమలక్క స్పష్టం చేశారు. జర్నలిస్టులపై దాడులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను కాపాడే ప్రయత్నం చేయకుండా, బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. జర్నలిస్టులపై దాడి ఘటనపై ఉన్నతస్థాయి, నిష్పక్షపాత విచారణ జరిపించాలి.ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐ శ్రీకాంత్ను తక్షణమే సస్పెండ్ చేయాలి.బాధ్యులుగా తేలిన పోలీసు సిబ్బందిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి.బాధిత జర్నలిస్టులు పొత్తూరి శేఖర్, రాతిపల్లి సంపత్లకు మెరుగైన వైద్య చికిత్స అందించాలి.జర్నలిస్టులు నిర్భయంగా విధులు నిర్వహించేలా ప్రభుత్వం రక్షణ కల్పించాలి.పాత్రికేయులపై వేధింపులు, బెదిరింపులు, దాడులు పునరావృతం కాకుండా స్పష్టమైన చర్యలు చేపట్టాలి.జర్నలిస్టులపై దాడి అంటే కేవలం ఇద్దరు వ్యక్తులపై జరిగిన దాడి మాత్రమే కాదు.. ప్రజల గొంతుకపై జరిగిన దాడి. మీడియా స్వేచ్ఛను కాపాడటం ప్రభుత్వ బాధ్యత. బాధితులకు న్యాయం జరిగే వరకు ఈ ఘటనను తేలికగా తీసుకోవద్దని విమలక్క ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ పరామర్శ కార్యక్రమంలో నవ తెలంగాణ యువజన సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, జర్నలిస్టు బిజిగిరి నవీన్ కుమార్, డీఎల్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మార్వాడి సుదర్శన్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర నాయకులు పోతుల రమేష్, రాకేష్, శ్రీలత, వెంకటేష్, వెంకి తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

తెలుగువర్సిటీ సాహితీ పురస్కారాలకు ఎంపిక

హైదరాబాద్, అక్టోబర్ 16(మనంన్యూస్)ః తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రి యల్లో ఉత్తమ గ్రంథాలకు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం 2025 సంవత్సరానికి 'సాహితీ పురస్కారాలు' ప్రకటించింది. పద్యకవితా ప్రక్రియలో దోరవేటి(దోస్తానా), వచన కవితా ప్రక్రియలో బాణాల శ్రీనివా సరావు(రాత్రి సింఫని), బాలసాహిత్యంలో పుల్లా రామాంజనేయులు(స్వర్ణ గిరి కథలు), కథానికా ప్రక్రియలో డా.సూర్యా ధనంజయ్ (ఝుళి), నవలా ప్రక్రియలో చింతకింది శ్రీనివాసరావు(మున్నీటి గీతలు), సాహిత్య విమర్శలో ఏల్చూరి మురళీధరరావు(వాంగ్మయ చరిత్రలో కొన్ని వ్యాస ఘట్టాలు), నాటక ప్రక్రియలో కేకేఎల్ స్వామి(కొత్త పరిమళం), అనువాదంలో కోడి హళ్లి మురళీమోహన్ (పోరాట పథం), వచన రచన విభాగంలో డా.వి.వి. వెంకటరమణ(వావిళ్ల సాహితీ వికాసం), రచయిత్రి ఉత్తమ గ్రంథం విభా గంలో ధూళిపాళ అరుణ (జ్ఞాపకాల సంతకం) గ్రంథాలు సాహితీ పురస్కా రానికి ఎంపికయ్యాయని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు తెలిపారు. త్వరలో హైదరాబాద్ వర్సిటీలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారాలు ప్రదానం చేస్తామని, పురస్కారం కింద ఒక్కొక్కరికి రూ. 20,116 నగదు అందజేసి సత్కరిస్తామన్నారు.

యాసంగిలో వరి సాగు చేయవద్దు

- మీడియా సమావేశంలో కలెక్టర్

ఖమ్మం, అక్టోబర్ 16(మనం బ్యూరో)ః ఎల్నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు యాసంగి సీజన్లో వరి సాగు చేయకుండా, చిరు ధాన్యాలు, పప్పుధాన్యాలు, తదితర ఆరుతడి పంటల సాగు చేయాలని కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని తాగునీరు, పశువుల అవసరాలకు వినియోగించాల్సి ఉన్నందున యాసంగిలో ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువుల నుంచి సాగునీటి విడుదల ఉండదని స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సిపి సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి శ్రీనివాస రెడ్డి లతో కలిసి ఎల్నినో ప్రభావం, ఎస్ఐఆర్ 2026, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం నేపథ్యంలో ముందస్తుగానే రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించామని తెలిపారు. జిల్లాలో 17 మండలాల్లో సాధారణం కంటే 20 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, కరువు ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించినట్లు చెప్పారు. ప్రాథమిక అంచనాల ప్రకారం 17 మండలాల్లో కరువు పరిస్థితులు ఉండవచ్చని గుర్తించామని, వీటిలో 10 మండలాల్లో తీవ్ర కరువు, ఏడు మండలాల్లో సాధారణ కరువు పరిస్థితులు ఉన్నట్లు వివరించారు. గత వర్షాకాలంలో భూగర్భ జలమట్టం సుమారు 2.5 మీటర్ల లోతులో ఉండగా, ప్రస్తుతం 3.56 మీటర్ల లోతుకు పడిపోయిందని తెలిపారు. కామేపల్లి, ఎర్రుపాలెం, సత్తుపల్లి, ఏన్కూరు మండలాల్లో భూగర్భ జలాలు 5 నుంచి 10 మీటర్ల లోతుకు పడిపోయాయని పేర్కొన్నారు. రాబోయే వర్షాకాలం వరకు తగిన వర్షాలు కురిసే అవకాశాలు పరిమితంగా ఉన్నందున రైతులు యాసంగిలో వరి సాగుకు దూరంగా ఉండాలని సూచించారు. చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేయాలని తెలిపారు. కరువు పరిస్థితుల్లో గ్రామీణ కుటుంబాలకు ఉపాధి కల్పించేందుకు ఉపాధి హామీ పథకం కింద అవసరమైన పనులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు. నల్గొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో ఇప్పటివరకు 30,727 మంది

పట్టభద్రులు ఓటరు నమోదుకు దరఖాస్తులు సమర్పించారని కలెక్టర్ తెలిపారు. గత 2024 ఎన్నికల్లో మొత్తం 83,879 మంది ఓటర్లు నమోదయ్యారని, ఈసారి కనీసం రెండు లక్షల మంది పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు తప్పని సరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ రైతులకు వీలైనంత సహకారం అందించడమే ప్రభుత్వ ఉద్దేశ్యమని తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల నుంచి విడుదల చేసే నీరు అవసరమైన రైతులకు చేరేలా ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. యాసంగి పంటలకు సాగునీటి విడుదల ఉండదని, అధిక నీరు అవసరమయ్యే పంటలను సాగు చేయవద్దని రైతులకు సూచించారు. నీటి పంపిణీ సమయంలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా పోలీస్ శాఖ తరపున జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందిస్తామని, అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన వివిధ ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ సమాధానాలు ఇచ్చారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

హంసలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

ములుగు, అక్టోబర్ 16(మనంన్యూస్)ః ములుగు మండలం క్షీరసాగర్లోని హంస హోమియోపతిక్ మెడికల్ కాలేజ్, హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా, సంప్రదాయబద్ధంగా జరిగాయి. నవరాత్రుల సందర్భంగా ప్రకృతిని, జగన్మాత శక్తి స్వరూపాన్ని, నవదుర్గలను ఆరాధిస్తూ తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే పూల పండుగను విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది కలిసి ఘనంగా నిర్వహించారు.

ఈ వేడుకల్లో కళాశాల విద్యార్థినీ విద్యార్థులు రకరకాల సహజసిద్ధమైన పూలతో ఆకర్షణీయమైన బతుకమ్మలను పేర్చారు. సాధారణంగా మహిళలు జరుపుకునే ఈ వేడుకలో కళాశాల విద్యార్థులు (యువకులు) కూడా ఎంతో ఉత్సాహంగా పాలుపంచుకుని, బతుకమ్మల చుట్టూ చప్పట్లు కొడుతూ, సాంప్రదాయ జానపద పాటలు పాడుతూ సందడి చేశారు. కళాశాల డైరెక్టర్లు డాక్టర్ ఉమేష్, డాక్టర్ పద్మజ, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ బాబు కట్టి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ.. ప్రకృతిని ఆరాధించే విశిష్టమైన బతుకమ్మ పండుగ ఐక్యతకు, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. విద్యార్థులు తమ వైద్య విద్యతో పాటు సంస్కృతీ సంప్రదాయాలను గౌరవిస్తూ ఇలాంటి ఉత్సవాలలో చురుగ్గా పాల్గొనడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం బతుకమ్మల నిమజ్జనం, ప్రసాద వితరణతో సంబరాలు ఘనంగా ముగిశాయి.

గీతంలో ఘనంగా దండియా ఉత్సవం

- శుభారంభ్ పేరిట గర్బా, దండియా నృత్యాలు, సంగీతం, సాంస్కృతిక సందడి

పటాన్ చెరు, అక్టోబర్ 16 (మనం న్యూస్) : హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, నవరాత్రి స్ఫూర్తిని పురస్కరించుకుని, 'శుభారంభ్ 2026' పేరిట ఉత్సాహభరితమైన దండియా ఉత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి వేలాది మంది విద్యార్థులు రంగురంగుల సాంప్రదాయ వస్త్రధారణలో హాజరయ్యారు. కళాకృతి విద్యార్థి క్లబ్ ఆధ్వర్యంలో, స్త్రీ శక్తి పర్యావరణ సామరస్యం, ప్రాంతీయ గుర్తింపునకు ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలతో ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సంగీతం, నృత్యం, సాంస్కృతిక ఉత్సాహంతో నిండిన గర్బా, దండియా నృత్యాలతో ఈ వేడుకలు ఉత్సాహభరితమైన సాయంత్రంగా కొనసాగాయి. ఈ కార్యక్రమం, గీతం ప్రాంగణ సంస్కృతిని, గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తూ, విభిన్న విద్యా విభాగాలకు చెందిన విద్యార్థుల మధ్య ఐక్యతను, స్నేహభావాన్ని పెంపొందించింది. శుభారంభ్, విద్యార్థులకు ఉమ్మడి సాంస్కృతిక అనుభవాల ద్వారా ఒకరితో మరొకరు మమేకమవడానికి, మధురమైన జ్ఞాపకాలను సృష్టించుకోవడానికి, కలిసికట్టుగా ఉండే ఆనందాన్ని పంచుకోవడానికి ఒక అవకాశాన్ని కల్పించింది.

ఇరాన్‌పై దాడికి...

మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్!

వాషింగ్టన్, అక్టోబర్ 16 : అమెరికా అమ్ములపొదిలో శక్తిమంతమైన సంప్రదాయ ఆయుధం మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్ (ఎంవోఏబీ) మరోసారి తెరపైకి వచ్చింది. ఇరాన్ సైనిక, ఇంధన మౌలిక వసతులపై దాడికి సంబంధించి అగ్రరాజ్యం రూపొందించుకుంటున్న అత్యవసర ప్రణాళికల్లో ఈ బాంబు ప్రయోగం కూడా ఉందని కథనాలు వెలువడుతున్నాయి. దీంతో ఆ అస్త్రం వల్ల ఇరాన్‌కు ఎంత నష్టం కలుగుతుందన్నది చర్చనీయాంశమైంది. పశ్చిమాసియా యుద్ధంలో వ్యూహాత్మక లక్ష్యాలను నెరవేర్చుకునేందుకు అమెరికాకు ఎంవోఏబీ సరైన ఆయుధమవుతుందా అని నిపుణులు సందేహాలు వ్యక్తంచేస్తున్నారు.

ఏమిటీ బాంబు?

ఈ ఆయుధం పేరు జీబీయూ-43/బి మాసివ్ ఆర్డినెన్స్ ఎయిర్ బ్లాస్ట్ (ఎంవోఏబీ). దీని సామర్థ్యం దృష్ట్యా సరదాగా దీన్ని మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్ అని కూడా పిలుస్తారు. దీని బరువు 9.8 టన్నులు. దీన్ని ఆకాశం నుంచి విమానం ద్వారా ప్రయోగిస్తారు. 2003లో ఇరాన్‌పై యుద్ధానికి ముందు అమెరికా వైమానిక దళ పరిశోధన ల్యాబ్ దీన్ని అభివృద్ధి చేసింది. అమెరికా అమ్ములపొదిలో ఇది అతిపెద్ద అణ్వస్త్రేతర థర్మోబారిక్ తరహా ఆయుధం.

ఎంవోఏబీను ప్రధానంగా గాల్లో పేలే (ఎయిర్ బ్లాస్ట్) ఆయుధంగా డిజైన్ చేశారు. సాధారణ బాంబులు నేలను తాకి, భారీ బిలాన్ని ఏర్పరుస్తుంటాయి. ఎంవోఏబీ తీరు భిన్నం. ఇది 'ప్రాక్సిమిటీ ఫ్యూజ్' సాయంతో ఇది నేలకు 1.8 మీటర్ల ఎత్తులో పేలిపోతుంది. ఫలితంగా అందులోని 18,700 పౌండ్ల పేలుడు పదార్థం.. కొన్ని మైక్రోసెకన్ల వ్యవధిలోనే భారీగా రసాయన శక్తిని విడుదల చేస్తుంది. ఈ క్రమంలో ఏర్పడే విస్ఫోట తరంగం నేలకు సమాంతరంగా గాల్లో దూసుకెళుతుంది. సంపీడనానికి లోనైన గాలితో కూడిన ఈ భీకర ప్రకంపన తన ప్రయాణ మార్గంలో భవనాలు, వాహనాలు, నేలపై ఉన్న బంకర్లు, రాడార్ కేంద్రాలను ధ్వంసం చేస్తుంది. 1.6 కిలోమీటర్ల వ్యాసంలోని ప్రదేశంలో దీని ప్రభావం ఉంటుంది.

ప్రభావిత ప్రాంతంలో వేగంగా దహనక్రియ జరగడం వల్ల భారీ పరిమాణంలో ఆక్సిజన్ ఖర్చవుతుంది. దీంతో స్థానికంగా శూన్యం ఏర్పడుతుంది. సమీపంలోని గాలి తిరిగి ఆ ప్రదేశానికి దూసుకొచ్చే క్రమంలో బీభత్సం చోటుచేసుకుంటుంది. నేల కిందున్న సొరంగ మార్గాల ప్రవేశాలు కుప్పకూలుతాయి. లోపలున్న సైనికుల ఊపిరితిత్తులు దెబ్బతింటాయి. పేలుడు వల్ల ఉత్పత్తన్నమయ్యే తీవ్ర వెలుగు, పెను ప్రకంపన, గాల్లోకి ఎగిసే పుట్టగొడుగులాంటి భారీ మేఘం వంటివి ప్రత్యర్థుల గుండెల్లో గుబులు పుట్టించడం ఖాయం.

ఎంవోఏబీని తొలిసారిగా 2017 ఏప్రిల్ 13న అఫ్గానిస్థాన్‌లోని ఐసిస్ ఉగ్రమూకకు సంబంధించిన సొరంగం, గుహ కాంప్లెక్స్‌లపై అమెరికా వైమానిక దళం ప్రయోగించింది. దీనివల్ల గుహ ప్రవేశమార్గాలు కూలిపోవడం, ఉగ్రమూక వద్ద ఉన్న పేలుడు పదార్థాలు విస్ఫోటం చెందడం వంటి పరిణామాల కారణంగా పెను విధ్వంసం జరిగింది. పెద్ద సంఖ్యలో ఐసిస్ తీవ్రవాదులు హతమయ్యారు. నాటి దాడి ఎంవోఏబీ రూపకల్పన ఉద్దేశాన్ని చాటింది. ఉపరితలంపై విస్తరించి ఉన్న నెట్వర్క్ను, తక్కువ లోతు కలిగిన గుహ ప్రాంగణాలు, భారీగా రక్షణ కలిగిన ప్రదేశాలను ధ్వంసం చేయడానికి ఈ బాంబు చక్కగా సరిపోలుతుందని వెల్లడైంది.

ఇరాన్‌లో నేల ఉపరితలం నుంచి చాలా లోతులో ఉన్న ఫోర్డో, నతాంజ్ వంటి అణు కేంద్రాలను ధ్వంసం చేయడం ఎంవోఏబీకి దాదాపు అసాధ్యమని నిపుణులు చెబుతున్నారు. పైగా ఈ బాంబు పలుచటి అల్యూమినియం తొడుగుతో తయారైంది. గాల్లో విస్ఫోటక శక్తిని పెంచేలా ఇది రూపొందింది. నేరుగా రాయి లేదా కాంక్రీటును తాకితే అది గరిష్ఠ విస్ఫోటం చెందడానికి ముందే విచ్ఛిన్నమవుతుంది. శిలలోకి అది ఎక్కువ లోతుగా చొచ్చుకెళ్లలేదు. ఇరాన్‌లోని ఫోర్డో అణు ఇంధన శుద్ధి కర్మాగారం 200-300 అడుగుల గ్రానైట్, రీఇన్ఫోర్స్డ్ కాంక్రీటు కింద ఉంది. కొండకు ఎగువన గాల్లో విస్ఫోటం వల్ల రాతి పొరల కిందున్న సెంట్రిఫ్యూజ్ హాల్స్ చెక్కుచెదరవు. చమురు శుద్ధి కర్మాగారాలు, ఎగుమతి టెర్మినళ్లు, విద్యుత్ గ్రిడ్లు, ఇంధన నిల్వ కేంద్రాల ధ్వంసానికి ఎంవోఏబీ ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. పైగా ఈ బాంబును నెమ్మదిగా కదిలే, స్టెల్త్ లక్షణం లేని రవాణా విమానం (ఎంసీ-130) ద్వారా జారవిడవాలి. ఎస్-300 వంటి గగనతల రక్షణ వ్యవస్థలు కలిగిన ఇరాన్ గగనతలంలోకి ఇలాంటి విమానం వెళ్లడం ప్రమాదకరం.

ఎంవోఏబీకి బదులు జీబీయూ-57ఏ/బీ మాసివ్ ఆర్డినెన్స్ పెనట్రేటర్ (ఎంవోపీ) అనే బాంబుతో అమెరికాకు ప్రయోజనం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. 13 టన్నుల బరువున్న ఈ బాంబును మందపాటి, దృఢ ఉక్కు కేసింగ్‌తో తయారుచేశారు. ఇది నేలలోకి లోతుగా చొచ్చుకెళ్లి విస్ఫోటం చెందగలదు. 60 అడుగులు మందం కలిగిన రీఇన్ఫోర్స్డ్ కాంక్రీటునూ చీల్చుకెళ్లగలదు. పైగా పటిష్ఠ గగనతల రక్షణ వ్యవస్థలున్న ప్రదేశంలోకి సులువుగా వెళ్లగల బి-2బి స్టెల్త్ బాంబర్ ద్వారా దీన్ని జారవిడవవచ్చు.

ఇది జీపీఎస్/ ఇనర్షియల్ నేవిగేషన్ వ్యవస్థ. గాల్లో ఈ బాంబు ప్రయాణ మార్గాన్ని స్థిరీకరించేందుకు గ్రిడ్ ఫిన్స్‌కు ఏర్పాటు చేశారు. ఆకాశం నుంచి జారవిడిచే బాంబులను సాధారణంగా యుద్ధవిమానాలు, స్టెల్త్ బాంబర్లలోని అంతర్గత బాంబ్ బేలలో తరలిస్తుంటారు. అయితే ఎంవోఏబీ పొడవు, పరిమాణం ఎక్కువగా ఉండటం వల్ల దాన్ని సంప్రదాయ యుద్ధవిమానాల్లో అమర్చడం కష్టం. ఎంసీ-130 రవాణా విమానం ద్వారా లక్ష్యం వద్దకు తరలించాలి. డ్రాగ్ పారాచూట్ ద్వారా దీన్ని విమానం నుంచి గాల్లోకి జారవిడుస్తారు.

ఎంవోఏబీలో పేలుడు పదార్థం: 18,700 పౌండ్ల హెచ్-6 (ఆర్డీఎక్స్, టీఎన్టీ, అల్యూమినియం పొడితో కూడిన శక్తిమంతమైన పేలుడు పదార్థ మిశ్రమం). పొడవు: 9.1 మీటర్లు, వ్యాసం: 1.03 మీటర్లు ఉంటుంది.

ఆ తుపాకీ పని చేసి ఉంటే!

భారీ మారణ హోమం

జామ్ కావడంతో హిందూ ఆలయంలో తప్పిన ముప్పు..

న్యూయార్క్ , అక్టోబర్ 16 : అమెరికా ఇల్లినోయిలోని అరోరాలో ఉన్న హిందూ దేవాలయంలో పెను ముప్పు తప్పింది. హిందూ మతంపై ద్వేషంతో కాల్పులు జరిపి పలువురిని హతమార్చాలని భావించిన అమెరికా టీనేజర్ తుపాకీ చివరి నిమిషంలో పని చేయకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దీంతో అతడు ఇంటికి తిరిగివెళ్లాడు. మళ్లీ ఆలయానికి తిరిగివచ్చేలోగా అతడి సహచర ఉద్యోగి ఇచ్చిన సమాచారంతో పోలీసులు అరెస్టు చేశారు. ప్యాలటైన్ అనే గ్రామానికి చెందిన అలెగ్జాండ్రోస్ పాపొరకీస్ అనే 19 ఏళ్ల టీనేజర్ టాకోబెల్ అవుట్‌లెట్‌లో క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 11వ తేదీన అతడు తుపాకీ తీసుకుని అరోరాలోని హిందూ ఆలయానికి వెళ్లాడు. కాల్పులు జరిపేందుకు తుపాకీని ఓపెన్ చేశాడు. అయితే అది జామ్ కావడంతో పేలలేదు. ఏ ఆలయమనే వివరాలను పోలీసులు వెల్లడించలేదు.

మౌంట్ ప్రాస్పెక్ట్ పోలీసుల విభాగం నుంచి ఆదివారం ప్యాలటైన్ పోలీసులకు నిఘా సమాచారం వచ్చింది. భారీగా కాల్పులు జరిగే అవకాశముందనేది ఆ సమాచారం. దీంతో అప్రమత్తమైన పోలీసులు పాపొరకీస్‌ను అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి ఏఆర్ తుపాకీ, 300 గుండ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇవి 10 మ్యాగజీన్లను రీలోడ్ చేయడానికి సరిపోతాయి. వీటితోపాటు శరీర రక్షణ కవచం, పెట్రోల్ క్యాన్లు, నాజీలు ఉపయోగించిన హాకెన్ క్రూజ్‌లాంటివి దొరికాయి. శ్వేత జాత్యహంకార భావనలతోపాటు దక్షిణాసియా, ముఖ్యంగా భారతీయులపై అతడు ద్వేషం పెంచుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

యెమెన్ ప్రభుత్వ భవనంపై హూతీల క్షిపణి దాడులు

- మదీనాపై దాడి యత్నం తిప్పికొట్టాం
- సౌదీ అరేబియా కూటమి వెల్లడి
- ఈ దాడికి తాము పాల్పడలేదన్న హూతీలు

సనా/దుబాయి, అక్టోబర్ 16 : యెమెన్‌లో హూతీ తిరుగుబాటుదారులు మరోసారి విరుచుకుపడ్డారు. పోర్టు నగరమైన ఏడెన్‌లో ఉన్న ప్రెసిడెన్షియల్ ప్యాలెస్ లక్ష్యంగా క్షిపణి దాడులు జరిపారు. ఈ ఘటనలో ఇద్దరు భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోగా, మరికొందరు గాయపడినట్లు సమాచారం. అయితే, ప్రధాన మంత్రి సహా కొందరు మంత్రులు అక్కడే ఉన్న సమయంలో ఈ దాడులు జరిగాయి. ఇందులో పలువురు కీలక నేతలు తప్పించుకున్నట్లు తెలుస్తోంది.

సౌదీ సైనిక కార్యకలాపాల ప్రధాన కార్యాలయాన్ని, ఆయుధ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని దాడి చేసినట్లు హూతీలు ప్రకటించారు. ప్రెసిడెన్షియల్ ప్యాలెస్ సమీపంలో ఐదుసార్లు భారీ పేలుడు శబ్దాలు వినిపించడంతోపాటు దట్టమైన పొగ అలముకున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.

మదీనాపై దాడి యత్నం తిప్పికొట్టాం: సౌదీ

పవిత్ర మదీనా నగరంపై క్షిపణి దాడికి జరిగిన ప్రయత్నాన్ని తిప్పి కొట్టామని సౌదీ అరేబియా నేతృత్వంలోని కూటమి గురువారం వెల్లడించింది.

అయితే ఈ దాడికి బాధ్యులెవరన్నది కూటమి పేర్కొనలేదు. మదీనా రాష్ట్రంపై ప్రయోగించిన క్షిపణిని ధ్వంసం చేశామని సౌదీ స్పష్టం చేసింది. ఈ దాడికి తాము పాల్పడలేదని యెమెన్ తిరుగుబాటుదారులైన హూతీలు తెలిపారు. పవిత్ర మక్కా, మదీనా నగరాలపై, వాటి విమానాశ్రయాలపై దాడి చేయబోమని హూతీలు ఇప్పటికే ప్రకటించారు. మరోవైపు యెమెన్ రాజధాని అడెన్ నగరంలో ఆరు చోట్ల గురువారం భీకర పేలుళ్లు సంభవించాయి. ఈ పేలుళ్లలో కనీసం ఇద్దరు మరణించారని అధికారులు తెలిపారు. ఈ పేలుళ్లకు తమదే బాధ్యత అని హూతీలు ప్రకటించారు.

ఎలిమెంటరీ స్కూల్లో కాల్పులు..

- ముగ్గురు విద్యార్థులు.. ఒక టీచర్ మృతి
- నిందితుడిని కాల్చేసిన స్థానికుడు

వాషింగ్టన్/ఒరెగన్, అక్టోబర్ 16 : అగ్రరాజ్యం అమెరికాలో చిన్నపిల్లలే లక్ష్యంగా కాల్పులు చోటు చేసుకొన్నాయి. ఓరెగన్ రాష్ట్రంలోని ఓ ఎలిమెంటరీ స్కూల్లో చిన్నారులపై దుండగుడు కాల్పులకు తెగబడ్డాడు. దీంతో అటుగా వెళ్తున్న ఓ స్థానిక వ్యక్తి ఈ ఘాతుకాన్ని గుర్తించి ధైర్యంగా నిందితుడిపై ఎదురుకాల్పులు జరిపారు. అప్పటికే దుండగుడు జరిపిన కాల్పుల్లో ముగ్గురు చిన్నారులు, ఓ టీచర్ ప్రాణాలు కోల్పోయారు. మరో వైపు స్థానికుడి ఎదురు కాల్పుల్లో నిందితుడు కూడా మరణించాడు.

బెండ్ ప్రాంతంలోని ఈ ఎలిమెంటరీ స్కూల్లోకి గురువారం మధ్యాహ్నం (అమెరికా కాలమానం ప్రకారం) సమయంలో దుండగుడు తుపాకీతో చొరబడ్డాడు. గేటు నుంచే కాల్పులు జరుపుతూ లోపలికి ప్రవేశించాడు. ఆ సమయంలో రోడ్డుపై వెళ్తున్న ఓ వ్యక్తి నిందితుడిని చూశారు. జరగబోయే ప్రమాదాన్ని ఊహించి.. వెంటనే తన వద్ద ఉన్న లైసెన్స్డ్ తుపాకీతో కాల్చారు. సమాచారమందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. అప్పటికే దుండగుడు మృతిచెందినట్లు పోలీసులు వెల్లడించారు.

ఘటన సమయంలో స్కూల్లో 400 మందికి పైగా చిన్నారులు ఉన్నారు. స్థానిక వ్యక్తి ధైర్యంగా దుండగుడిపై కాల్పులు జరపకపోయి ఉంటే.. భారీ మారణహోమమే జరిగి ఉండేదని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. నిందితుడిని 16 ఏళ్ల టీనేజర్‌గా గుర్తించారు. కాల్పులు వెనుక ఉద్దేశమేంటీ? స్కూల్‌తో నిందితుడికి సంబంధం ఉందా? లేదా? అన్న విషయాలు తెలియరాలేదు.

కాగా...ఇటీవల ఇల్లినోయిలోని ఓ హిందూ ఆలయంపై దాడికి కుట్ర జరిగిన సంగతి తెలిసిందే. భారతీయులను లక్ష్యంగా చేసుకుని ఓ 19ఏళ్ల యువకుడు కాల్పులు జరిపేందుకు కుట్ర పన్నాడు. అయితే, రైఫిల్ జామ్ అవడంతో పెను ముప్పు తప్పింది. ఈ కుట్ర వెలుగులోకి వచ్చిన మరుసటి రోజే.. తాజాగా స్కూల్లో కాల్పులు చోటుచేసుకోవడం గమనార్హం.

ఆ రెండు పార్టీలకే రూ.260 కోట్లు

డీఎంకే, అన్నా డీఎంకే.. రెండింటికీ ఆ లాటరీ సంస్థ డొనేషన్స్

చెన్నై, అక్టోబర్ 16 : తమిళనాడులో రాజకీయ పార్టీల విరాళాలకు సంబంధించి కీలక విషయం వెలుగులోకి వచ్చింది. కలకత్తా కేంద్రంగా నడిచే ఓ లాటరీ సంస్థ.. రాష్ట్రంలో ప్రధాన పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంకేలకు రూ.260 కోట్లు విరాళంగా ఇచ్చింది. ఈ ఏడాది (2025-26)లోనే రెండు పార్టీలకు ఈ మొత్తాన్ని ఇచ్చిన విషయం ఎన్నికల సంఘానికి అందజేసిన వివరాల ద్వారా వెల్లడైంది. అంతకుముందు ఏడాదిలో అన్ని రాజకీయ పార్టీలకు ఇచ్చిన విరాళాల కన్నా ఈ రెండు పార్టీలకే సదరు లాటరీ సంస్థ రెట్టింపు మొత్తాన్ని ఇవ్వడం గమనార్హం.



దేశంలో లాటరీ కింగ్ గా పేరుగాంచిన శాంటియాగో మార్టిన్ నేతృత్వంలో నడిచే టైగర్ అసోసియేట్స్ అనే లాటరీ సంస్థ.. డీఎంకే, అన్నాడీఎంకేలకు కొన్నేళ్లుగా భారీగా విరాళాలు ఇస్తోంది. 2024-25లో ఈ రెండు పార్టీలకు కలిపి రూ.110 కోట్లు ఇచ్చింది. ఈ ఏడాది రెట్టింపు చేసిన ఈ కంపెనీ.. అన్నాడీఎంకేకు రూ.135 కోట్లు, డీఎంకేకు రూ.125 కోట్లు ఇచ్చింది. ఈసారి అన్నాడీఎంకేకు వచ్చిన మొత్తం విరాళాల్లో ఈ సంస్థ నుంచే 81శాతం రాగా.. డీఎంకేకు వచ్చిన విరాళాల్లో 65శాతం దీని నుంచే ఉన్నట్లు వెల్లడైంది.

దివ్యా మిత్తల్ పార్టీ.. జన్ నీతి భారత్

శాంటియాగో మార్టిన్కు తమిళనాడులో ప్రధాన రాజకీయ పార్టీలతో సత్సంబంధాలున్నాయి. ఆయన కుటుంబంలోని ముగ్గురు సభ్యులు మూడు వేర్వేరు పార్టీల్లో ఉన్నారు. ఆయన సతీమణి లీమారోస్ అన్నాడీఎంకేలో ఉండగా, అల్లుడు అధవ్ అర్జున టీవీకే ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగుతున్నారు. మార్టిన్ కుమారుడు జోస్ చార్లెస్ పుదుచ్చేరిలో గత ఎన్నికల సమయంలో ఓ రాజకీయ పార్టీని స్థాపించి, ఆ పార్టీ తరపున గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టిన విషయం తెలి

రాహుల్ తాటాకు చప్పుళ్లకు మోడీ ప్రభుత్వం భయపడదు

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 16 : రాజ్యాంగం ఇచ్చిన ప్రజాస్వామ్య హక్కులను ప్రతిపక్ష పార్టీలు దుర్వినియోగం చేస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. దేశంలో అరాచకం సృష్టించేందుకు, కేంద్రాన్ని దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. పది నెలల్లో మోడీ ప్రభుత్వం కూలిపోతుందని దుష్ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన తీర్పును అవమానించేలా రాహుల్ వ్యవహరిస్తున్నారన్నారు.

'2029 వరకు ప్రధానిగా మోడీ ఉండాలని ప్రజలు తీర్పునిచ్చారు. బంగ్లాదేశ్, శ్రీలంకలో చేసినట్లు ప్రభుత్వాన్ని కూల్చుతామని దిండుడుకల్లం ఆశలు పెట్టుకున్నారు. ప్రపంచమంతా ఆర్థిక సంక్షోభంలో ఉంటే.. భారత్ మాత్రం అభివృద్ధి చెందుతోంది. రాహుల్ గాంధీ తాటాకు చప్పుళ్లకు మోడీ ప్రభుత్వం భయపడదు'' అని చెప్పారు.

ప్రధాని సత్కారంలో భాగస్వామ్యం కావడం గర్వకారణం

- సెపక్ తక్రా ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ జనరల్ పెరిక సురేశ్

హైదరాబాద్, అక్టోబర్ 16, (మనం బ్యూరో) : భారత క్రీడాకారుల విజయాలను గౌరవిస్తూ నిర్వహించిన కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం గర్వకారణమని ఇండియన్ సెపక్తక్రా ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ జనరల్ పెరిక సురేశ్ పేర్కొన్నారు. దేశంలో సెపక్తక్రా క్రీడ అభివృద్ధికి కృషి చేయడం, క్రీడాకారులను ప్రోత్సహించడం,

అంతర్జాతీయ స్థాయిలో భారత్ క్రీడా ప్రతిష్ఠను మరింత పెంచేందుకు కృషి చేయడం తన లక్ష్యమని తెలిపారు.ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన 85 మంది భారత క్రీడాకారులను ప్రధాని నరేంద్ర మోదీ గురువారం న్యూఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ స్టేడియంలో ఘనంగా సత్కరించారని తెలిపారు. ఈ చారిత్రాత్మక సన్మాన కార్యక్రమంలో ఆసియా సెపక్తక్రా సమాఖ్య చీఫ్ ప్రోటోకాల్ ఆఫీసర్, ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ జనరల్ గా తనకు అవకాశం రావడం పట్ల ఆయన హర్షం ప్రకటించారు. సెపక్ తక్రా విజయాలు దేశానికి గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించేలా క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని పెరిక సురేశ్ పేర్కొన్నారు.

మరోసారి భద్రతా బలగాల 'బంధనం'లో ఢిల్లీ

సీజేపీ లెహ్రా దో తిరంగా ర్యాలీని అడ్డుకునేటందుకే!

ఢిల్లీ, అక్టోబర్ 16 : దేశ రాజధాని ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ లో ఉన్న సెంట్రల్ పార్క్ లో సీజేపీ శుక్రవారం 'లెహ్రా దో తిరంగా' పేరుతో ర్యాలీని నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో రాజధాని నగరంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. 6 వేలమంది ఢిల్లీ పోలీసులతో పాటు 220 కంపెనీల కేంద్ర సాయుధ బలగాలను మోహరించారు. సీసీటీవీ కెమెరాల సంఖ్యను పెంచారు.

కన్నాట్ ప్లేస్ సహా రాజీవ్ చౌక్, సెంట్రల్ పార్క్, జంతర్ మంతర్, పాలికా బజార్లతోపాటు సమీపంలోని మెట్రో స్టేషన్లు, సున్నిత ప్రాంతాల్లో భద్రతను పెంచారు. శుక్ర, శనివారాల్లో సెంట్రల్ పార్క్ లోకి ప్రజలకు అనుమతి లేదని న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ ప్రకటించింది. ఈ తిరంగా ర్యాలీని పరిమిత సంఖ్యలో, వేరే ప్రదేశంలో నిర్వహించుకోవడానికి అనుమతిస్తామని ఢిల్లీ పోలీసులు ప్రకటించారు.

జైలుకైనా వెళ్తాం..

'మేం సెంట్రల్ పార్క్ వద్ద శాంతియుతంగా తిరంగాను ఎగురవేస్తాం. దానిని కూడా నేరంగా పరిగణిస్తే.. అప్పుడు మీరే ద్రోహులు. జాతీయ పతాకాన్ని ఎగురవేసినందుకు జైలుకు వెళ్లాల్సి వస్తే.. అందుకు మేం సిద్ధమే' అని మీడియాతో అన్నారు.

సెంట్రల్ పార్క్ మూసివేస్తూ ఎన్డీఎంసీ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దానిపై అత్యవసర విచారణకు న్యాయస్థానం నిరాకరించింది. 'ప్రతి ఒక్కరూ వివేకంతో ప్రవర్తిస్తారని ఆశిస్తున్నాం. ఈ నిరసనల కారణంగా పండగ సీజన్లో పలు కుటుంబాలు ఎదుర్కొనే కష్టాలు, ఇబ్బందులు మాకు తెలుసు' అని పేర్కొంది. నిరసనలు తెలిపే హక్కు, జీవనోపాధి, శాంతిభద్రతలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని వ్యాఖ్యానించింది. నగరంలో నిషేధాజ్ఞలు విధించడం వల్లే వ్యాపారాలు దెబ్బతింటాయని, శాంతియుత నిరసనల వల్ల కాదని మరోవైపు దీప్కే అన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- 15వ సారి 100కు పైగా మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేత
- సుదూర ప్రాంతాలు ఇతర రాష్ట్రాలకు వెళ్లిన మొబైళ్లను సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించిన సైబర్ వారియర్స్
- అత్యాశకు పోయి ఆన్లైన్ పెట్టుబడులు పెట్టవద్దు
- డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి
- ప్రజల రక్షణలో పోలీస్ శాఖ అనుక్షణం కృషి జిల్లా ఎస్పీ నరసింహ

సూర్యాపేట, అక్టోబర్ 16 (మనం ప్రతినిధి): ప్రజలు వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్న, దొంగతనానికి గురైన మొబైల్ ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో రికవరీ చేసి బాధితులకు తిరిగి అందజేయడంలో సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ విశేష కృషి చేస్తోందని జిల్లా ఎస్పీ కె. నరసింహ తెలిపారు. ఇందులో భాగంగా సి ఈ ఐ ఆర్. పోర్టల్ ద్వారా రికవరీ చేసిన 20 లక్షలకు పైగా విలువైన 105 మొబైల్ ఫోన్లను శుక్రవారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధితులకు అందజేశారు. ఈ విధంగా 100కు పైగా మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేయడం ఇది 15వ సారి అని స్పష్టం చేశారు.మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైంది ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రస్తుత సాంకేతిక యుగంలో మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరి జీవితంలో కీలక భాగమైందని అన్నారు. కమ్యూనికేషన్తో పాటు విలువైన సమాచారం భద్రపరచుకోవడానికి, బ్యాంకింగ్ ఇతర ఆర్థిక లావాదేవీలు నిర్వహించడానికి మొబైల్ ఫోన్లను విస్తృతంగా వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్లలో వ్యక్తిగత సమాచారం, కుటుంబ సభ్యుల ఫొటోలు, జ్ఞాపకాలు, ముఖ్యమైన పత్రాలు భద్రపరచుకుంటున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలకు ప్రేమతో బహుమతిగా ఇచ్చిన ఫోన్లు కూడా ఉంటాయని పేర్కొన్నారు. ఇలాంటి మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నప్పుడు దాని విలువతో పాటు అందులో ఉన్న విలువైన సమాచారం, జ్ఞాపకాలు కోల్పోయిన బాధ బాధితులకు ఉంటుందని అన్నారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదులపై జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వాటిని గుర్తించి రికవరీ చేస్తున్నదని ఎస్పీ తెలిపారు. పోగొట్టుకున్న కొన్ని మొబైల్ ఫోన్లు సుదూర ప్రాంతాలకు, ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయినప్పటికీ, సైబర్ వారియర్స్ నిరంతర కృషి, సాంకేతిక విశ్లేషణ ద్వారా వాటిని గుర్తించి తిరిగి స్వాధీనం చేసుకున్నారని వివరించారు. రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను అసలు యజమానులకు అందజేయడం ద్వారా బాధితులకు సంతోషం కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తోందని, ప్రజల రక్షణ కోసం పోలీసులు క్షణక్షణం అప్రమత్తంగా ఉంటారని తెలియజేశారు.

సమాజంలో మార్పుకి ప్రతి ఒకరి భాగస్వామ్యం

ప్రజలు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని, ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, చుట్టుపక్కల వారికి సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, మహిళలు మరియు బాలల రక్షణ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. నేరాలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించాలని, నేర ప్రవృత్తి కలిగిన వారిలో మార్పు తీసుకురావడానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని అన్నారు. సమాజంలో మంచి వైపు నిలుస్తూ, బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించినప్పుడే ప్రశాంతమైన, సురక్షితమైన సమాజాన్ని నిర్మించగలమని తెలిపారు. ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, సైబర్ నేరాల నివారణ, మొబైల్ ఫోన్ల రికవరీ, రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళలు మరియు బాలల రక్షణతో పాటు డ్రగ్స్ నిర్మూలనకు సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

అత్యాశకు పోయి సైబర్ మోసాల బారిన పడొద్దు

ప్రస్తుత కాలంలో సైబర్ నేరగాళ్లు వివిధ రకాల మోసాలకు పాల్పడుతున్నారని ఎస్పీ హెచ్చరించారు. తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయనే ఆశతో గుర్తుతెలియని వ్యక్తులు సూచించే ఆన్లైన్ పెట్టుబడి పథకాలను నమ్మి డబ్బులు పెట్టవద్దని సూచించారు. అలాగే గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయవద్దని, అనుమానాస్పద ఏ పి కే.ఫైల్స్ను డౌన్లోడ్ చేసుకోవద్దని, బ్యాంకు ఖాతా వివరాలు, ఓ టి పి లు, పిన్ నెంబర్లు ఇతరులకు తెలియ జేయవద్దని అన్నారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్లైన్కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయా లని సూచించారు. ప్రజలు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ నేరాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు.

రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత...

రోడ్డు ప్రమాదాల వల్ల ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఒక కుటుంబంలో సంపాదించే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఎస్పీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ రహదారులపై ప్రయాణించేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేవారు సీట్బెల్ట్ పెట్టుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని తెలిపారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్కు దూరంగా ఉండాలని, వాహనం నడిపేటప్పుడు మొబైల్ ఫోన్ ఉపయోగించవద్దని సూచించారు. మన అజాగ్రత్త మన ప్రాణాలకే కాకుండా మనపై ఆధారపడిన కుటుంబ సభ్యుల జీవితాలపై కూడా ప్రభావం చూపుతుందని ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు.

మహిళలు బాలలను పట్ల నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

మహిళలు బాలికల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎస్పీ తెలిపారు. మహిళలు, బాలికలపై వేధింపులు, లైంగిక దాడులు, అత్యాచారాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ మహిళలను, బాలలను గౌరవించాలని, వారి భద్రతకు బాధ్యత వహించాలని సూచించారు. మహిళలు, బాలికలపై వేధింపులు లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరిగినప్పుడు బాధితులు భయపడకుండా పోలీసులను సంప్రదించాలని తెలిపారు.

యువత డ్రగ్స్కు దూరంగా ఉండాలి

ప్రస్తుత సమాజంలో యువత మాదకద్రవ్యాలకు అలవాటుపడి తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని ఎస్పీ పేర్కొన్నారు. యువత డ్రగ్స్కు పూర్తిగా దూరంగా ఉండాలని, విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి వంటి సానుకూల కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా మాదకద్రవ్యాల విక్రయాలు, వినియోగం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు ఇందులో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

దసరా ఎగ్జిబిషన్ ప్రారంభం.. సందడే సందడి!

- వంట పాత్రలు కొనుగోలు చేసి బోణీ చేసిన ఎమ్మెల్యే సతీమణి జ్యోతి ప్రసన్న
- కుటుంబ సమేతంగా వచ్చి వినోదాలను ఆస్వాదించండి
- ఎమ్మెల్యే బాలు నాయక్

దేవరకొండ, అక్టోబర్16(మనం న్యూస్)ః దసరా పండుగను పురస్కరించుకుని దేవరకొండ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దసరా ఎగ్జిబిషన్ను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్, ఆయన సతీమణి జ్యోతి ప్రసన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్లో ఏర్పాటు చేసిన వివిధ రకాల దుకాణాలు, వస్తువుల స్టాళ్లు, చిన్నారులు, పెద్దలకు వినోదాన్ని అందించే ఆటలను వారు పరిశీలించారు. పండుగ వాతావరణంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించడంతో పాటు చిరు వ్యాపారులకు ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని వారు పేర్కొన్నారు.

వంట పాత్రలు కొనుగోలు చేసి బోణీ చేసిన జ్యోతి ప్రసన్న

ఎగ్జిబిషన్ ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే సతీమణి జ్యోతి ప్రసన్న వంట పాత్రల స్టాల్ను సందర్శించి పలు రకాల వంట పాత్రలను కొనుగోలు చేశారు. తొలి కొనుగోలు చేయడం ద్వారా వ్యాపారులకు బోణీ చేశారు. పండుగ సందర్భంగా ఎగ్జిబిషన్లో దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్న చిరు వ్యాపారులను ప్రోత్సహించేలా ఆమె కొనుగోళ్లు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పండుగలు, ఉత్సవాల సమయంలో స్థానిక వ్యాపారులకు ప్రజల నుంచి ఆదరణ లభించడం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు.

చిన్నారులకు వినోదం.. కుటుంబాలకు ఆహ్లాదం

దసరా పండుగ సందర్భంగా ప్రజలకు వినోదాన్ని అందించేందుకు ఎగ్జిబిషన్లో వివిధ రకాల స్టాళ్లు, ఆటవస్తువులు, చిన్నారులు ఆడుకునే ఆటలు ఏర్పాటు చేశారు. కుటుంబ సభ్యులందరూ కలిసి సందర్శించి సరదాగా సమయం గడిపేందుకు అనువుగా ఎగ్జిబిషన్ను తీర్చిదిద్దారు. పండుగ సెలవుల్లో పిల్లలకు ఆనందాన్ని అందించడంతో పాటు పెద్దలకు కూడా ఆహ్లాదకరమైన అనుభూతిని కలిగించేలా వివిధ వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేయడం విశేషం.

కుటుంబ సమేతంగా వచ్చి ఆనందించండి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, దసరా పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. పండుగ రోజుల్లో ప్రజలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు ఎగ్జిబిషన్లు ఎంతగానో ఉపయోగపడతాయని, ముఖ్యంగా చిన్నారులకు వివిధ ఆటలు, వినోద కార్యక్రమాలు మంచి అనుభూతిని అందిస్తాయని పేర్కొన్నారు. దసరా సెలవులను పురస్కరించుకుని దేవరకొండ పట్టణ ప్రజలు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఎగ్జిబిషన్ను సందర్శించాలని, అక్కడ ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను తిలకిస్తూ వినోద కార్యక్రమాలను ఆస్వాదించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఇలాంటి కార్యక్రమాలతో పండుగ వాతావరణం మరింత ఉత్సాహభరితంగా మారుతుందని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మహమ్మద్ రయీస్, పట్టణ కౌన్సిలర్లు, దొండేటి మల్లారెడ్డి, కిన్నెర హరికృష్ణ, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత హెల్ప్ డెస్క్ ప్రారంభించిన ఎమ్మెల్యే

- శ్రీ సరస్వతి దేవి అలంకరణలో శ్రీ విజయ దుర్గాదేవి
- శ్రీ సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన విద్యార్థిని విద్యార్థులు

నేరేడుచర్ల అక్టోబర్ 16 మనం న్యూస్: శ్రీదేవి నవరాత్రి దసరా వేడుకలలో భాగంగా మూడవ రోజు శ్రీ విజయ దుర్గాదేవి శ్రీ సరస్వతి దేవి అలంకరణలో మంగళవారం దర్శనమిచ్చారు. నేరేడుచర్ల పట్టణంలోగల శ్రీ విజయదుర్గ దేవి ఆలయం,శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర ఆలయంలో ఆరవ రోజు శ్రీ దేవీ నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శ్రీ సరస్వతి దేవి అమ్మవారి జన్మ నక్షత్రం మూలా నక్షత్రం సందర్భంగా విద్యావ్యాప్తికై జ్ఞాపక శక్తి కై ఉద్యోగ ప్రాప్తికై విద్యార్థిని విద్యార్థుల చేత శ్రీ సరస్వతి దేవి అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి.ఆలయ అర్చకులు మొలుగు శ్రీనివాసాచార్యులు,ఉగ్రదండి శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు కుంకుమ పూజ నిర్వహించారు.నేరేడుచర్ల పట్టణంతో పాటు మండలంలోని పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని అమ్మవా రిని దర్శించుకున్నారు..దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా,అమ్మవారి దర్శనంతో భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణాన్ని కనులారా తిలకించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ కమిటీ చైర్మన్ కొనతం ఆదిరెడ్డి, కొనతం చిన్న వెంకటరెడ్డి, ఆకారపు వెంకటేశ్వర్లు, నాగండ్ల శ్రీధర్, కొనతం మంజులారెడ్డి, కొనతం కృష్ణారెడ్డి బాలెన సైదులు పార్వతి, సంకల మద్ది సత్యనారాయణ రెడ్డి, బెల్లంకొండ శేఖర్, కొనతం రామిరెడ్డి, కొనతం శ్రీనివాస్ రెడ్డి దంపతులు, వేమిరెడ్డి శంకర్ రెడ్డి,కొనతం లచ్చిరెడ్డి నేనే ఉండు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాదం పంపిన నిర్వహించారు.

ఉచిత హెల్ప్ డెస్క్ ప్రారంభించిన ఎమ్మెల్యే

తిరుమలగిరి, అక్టోబర్ 16 (మనం న్యూస్): తిరుమలగిరి మండల కేంద్రంలో నలగొండ, ఖమ్మం,వరంగల్, పట్టభద్రుల ఎం ఎల్ సి ఉచిత ఓటర్ నమోదు సహాయ కేంద్రాన్ని ఎమ్మెల్యే మందుల సామిల్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా మొదట పట్టభద్రుల ఓట్లు నమోదు చేయించి వారి ఓట్లు కాంగ్రెస్ అభ్యర్థి రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి వేసే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని చెప్పారు. అందరి సమిష్టి కృషి వల్ల అభ్యర్థి విజయం సాధిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా క్యాం కార్యాలయంలో తొండ గ్రామానికి చెందిన 100 మంది వివిధ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం తొండ గ్రామంలో నిర్మాణం అవుతున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం లో విద్యార్థులు చదువుకునే విధంగా పనులు పూర్తి చేసి పాఠశాల గదులను అందించాలని ఆదేశించారు. 200 కోట్ల రూపాయలతో నిర్మాణం అవుతున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ వలన ఏ ప్రాంతంలోని పేద ప్రజలు విద్యార్థులు కార్పొరేట్ స్థాయిలో విద్యను అభ్యసిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రైతు కమిషన్ మెంబర్ చెవిటి వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకరి జనార్దన్, వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మిలాల్, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు వై. నరేష్, నరసింహారెడ్డి, బత్తుల శ్రీను, కందుకూరి లక్ష్మయ్య, వెంకట్ రెడ్డి, జేరిపోతుల శోభారాణి, తిరుమని యాదగిరి, అబ్బాస్, వంశీ, వివిధ గ్రామాల సర్పంచులు,ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్వోత్తమ్‌కి భారీ మెజార్టీ ఇవ్వాలి

- అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలి
- ఎమ్మెల్యే మందుల సామేల్

తుంగతుర్తి, అక్టోబర్ 16 (మనం న్యూస్): నల్లగొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి రామ్రెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ పిలుపునిచ్చారు. శుక్రవారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కోసం ఏర్పాటు చేసిన హెల్ప్లైన్ను తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్ తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు.

ఓటరు నమోదుపై పట్టభద్రులకు అవగాహన కల్పించడంతో పాటు, అర్హులైన వారు ఎవరూ నమోదు ప్రక్రియకు దూరం కాకుండా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చొరవ తీసుకోవాలని అన్నారు.తెలంగాణ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పట్టభద్రులకు వివరించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వం విద్యార్థులు, యువత, ఉద్యోగులు, రైతులు, మహిళలు, పేదల సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు.పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో బలంగా వినిపించే అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డిని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి మండలం, గ్రామంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించి అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించాలని నాయకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రేగటి రవి గౌడ్, తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, గ్రంధాలయ చైర్మన్ గంగరాజు యాదవ్,నాయకులు మారగాని వెంకటయ్య, తిరుమల ప్రగడ కిషన్ రావు, పోలెపాక రామచంద్రు, దాసరి శ్రీను కొండ రాజు, పెద్ద బోయిన అజయ్, పొన్నాల సృజన్ కుమార్, దాయం ఝాన్సీ రాజిరెడ్డి,వివిధ గ్రామాల సర్పంచులు,యువజన నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులు తదితరులు పాల్గొన్నారు.

డిండి రైతులకు అదనపు ట్రాన్స్ఫార్మర్లు

- సీఎండీ హామీ.. ఎమ్మెల్యే బాలు నాయక్ ప్రత్యేక చొరవ
- పెండింగ్ డీటీఆర్ల విడుదలకు విజ్ఞప్తి.. పంటల రక్షణకు తాత్కాలిక ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటు

దేవరకొండ, అక్టోబర్ 16(మనం న్యూస్): డిండి రిజర్వాయర్లో నీటి నిల్వలు తగ్గడంతో పంటలను కాపాడుకునేందుకు బోరుబావులపై ఆధారపడుతున్న రైతులకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని ఖీఎఖ్కి ృఇజె సీఎండీకి విజ్ఞప్తి చేయగా, అవసరమైన ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని సీఎండీ హామీ ఇచ్చారు. ఇప్పటికే డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీలు) చెల్లించి దరఖాస్తు చేసుకున్న రైతులకు పెండింగ్లో ఉన్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్లను (డీటీఆర్లు) వెంటనే విడుదల చేసి ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను కాపాడుకునేందుకు అత్యవసరంగా అదనపు ట్రాన్స్ఫార్మర్లను తాత్కాలిక ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రిజర్వాయర్లో నీటిమట్టం తగ్గడంతో రైతులు వ్యవసాయ బోర్లపై ఆధారపడాల్సి వస్తోందని, ఈ సమయంలో విద్యుత్ లోడ్ సమస్యలు ఎదురైతే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే వివరించారు. రైతులకు నిరంతరాయంగా వ్యవసాయ విద్యుత్ అందించేందుకు అవసరమైన ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేసి, పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై సీఎండీ సానుకూలంగా స్పందించి, రైతుల అవసరాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతుల పంటల రక్షణకు విద్యుత్ శాఖ అధికారులు ప్రాధాన్యతనిస్తూ పనిచేయాలని బాలు నాయక్ కోరారు. ఈ కార్యక్రమంలో డిండి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికే రుణ సదుపాయం

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

దుగ్గొండి, అక్టోబర్ 16 మనం ప్రతినిధి: మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికే ప్రభుత్వం ఉచిత రుణ సదుపాయం కల్పిస్తోందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. దుగ్గొండి మండలంలోని చలపర్తి గ్రామంలో రూ. 10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న మహిళా సంఘం భవన నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. స్థానిక సర్పంచ్ కోటగిరి భాస్కర్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల ద్వారా పొందే రుణాలతో వ్యవసాయంతో పాటు చిన్న తరహా వ్యాపారాలు ప్రారంభించి మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు.

ఉచిత రుణాలతో నెలకు రూ.6 వేల అదనపు ఆదాయం

మహిళా సంఘాలకు అందించే రుణాల ద్వారా స్వయం ఉపాధి పొందితే నెలకు కనీసం రూ. 6,000 అదనంగా సంపాదించుకునే అవకాశం లభిస్తుందన్నారు. సంఘాలు తీసుకునే రూ. 10 లక్షల వరకు రుణాలకు సంబంధించి వడ్డీ మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. గ్రామంలో త్వరలోనే సీసీ రోడ్లు నిర్మిస్తామని, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే గౌడ సంఘం అభివృద్ధికి కమ్యూనిటీ హాల్ మంజూరు చేస్తామన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి,గ్రామాల్లోనే ఉపాధి పనులు

రాబోయే రోజుల్లో 'ఎల్ నినో' ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున, ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. రాబోయే రబీ సీజన్ లో తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.వ్యవసాయం, ఇతర పనుల కోసం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 40 శాతం నిధులు వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. రైతులు తమ పొలాల్లో పామ్ ఫండ్స్, నీటి గుంటలు (ఫార్మ్ పాండ్స్) నిర్మించుకోవాలని సూచించారు. గ్రామస్థులు బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సమ్మక్క,ఎంపిడిఓ డాక్టర్ లెక్కల అరుంధతి, పిఏసిఎస్ చైర్మన్లు తోకల శ్రీనివాస్ రెడ్డి, చెన్నూరు కిరణ్ రెడ్డి,ముత్యాల కుమారస్వామి గౌడ్ దుగ్గొండి,ఇంగోలీ రాజేశ్వరరావు,సర్పంచ్ ఇంద్రదేవ్, ఏపీఎం, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓలిగే నర్సింగారావు, పొగాకు వెంకటేశ్వర్లు గౌడ్, అమ్మ రోహిత్, తోటకూరి సురేష్,శివాజీ,భరత్ రెడ్డి,సుమంత్,ప్రతీష్, ప్రజా ప్రతినిధులు,స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాయిసన్నిధిలో వైభవంగా

మహా సరస్వతీదేవి అవతారం

- శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు.. పంచామృతాభిషేకం, కుంకుమార్చనతో ఆధ్యాత్మిక శోభ
- సీతారామ కల్యాణం హరికథతో భక్తిపారవశ్యం .. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

చింతపల్లి మండలం అక్టోబర్ 16(మనం న్యూస్) : దేవరకొండ నియోజకవర్గంలోని చింతపల్లి సాయిసన్నిధిలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మహా సరస్వతీదేవి అవతారాన్ని విశేషంగా అలంకరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో కళకళలాడగా, అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 9 గంటలకు మహా సరస్వతీదేవికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో జరిపి అమ్మవారికి ప్రత్యేక పూజలు సమర్పించారు. అనంతరం ఉదయం 10 గంటలకు కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. అమ్మవారి నామస్మరణతో సాయిసన్నిధి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులు పూజల్లో పాల్గొని అమ్మవారి అనుగ్రహాన్ని కోరుకున్నారు. అనంతరం సాయిబాబాకు మధ్యాహ్న హారతి నిర్వహించారు. హారతి కార్యక్రమం ముగిసిన తరువాత 108 కలశాలతో వివిధ రకాల పండ్లను ఉపయోగించి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ పూజా కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శరన్నవరాత్రి ఉత్స

పూల పండుగొచ్చె.. కలెక్టరేట్ మురిసె!

మహిళలు శాసించే స్థాయికి ఎదగాలి: మంత్రి దనసరి సీతక్క

ములుగు, అక్టోబర్ 16,మనం ప్రతినిధి: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం నుంచి పుట్టిన విశిష్టమైన పండుగ బతుకమ్మ అని రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అధ్యక్షతన నిర్వహించిన బతుకమ్మ సంబరాలకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం మహిళా అధికారులు, ఉద్యోగులతో కలిసి మంత్రి బతుకమ్మ ఆడి పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏ స్థాయిలో ఉన్నా మన పూర్వీకుల నుంచి వచ్చిన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని సూచించారు. పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగకు ఎంతో విశిష్టత ఉందన్నారు. పసుపుతో గౌరమ్మను రూపొందించి పూజించడం వంటి ఆచారాల్లో సంప్రదాయంతో పాటు శాస్త్రీయ దృక్పథం కూడా మిళితమై ఉందని పేర్కొన్నారు. బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ సంప్రదాయబద్ధంగా ఆడాలని సూచించారు. అందరూ కలిసి ఆడిపాడటం వల్ల ఆనందం, పరస్పర ఆత్మీయత పెరుగుతాయన్నారు. మహిళలు యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన, ఆశయమని మంత్రి పేర్కొన్నారు. ఆ లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున మహిళా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా, సామాజికంగా మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఉద్యోగులు తమ కుటుంబాలతో సంతోషంగా ఉంటూ, విధి నిర్వహణలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కష్టపడి పనిచేసి సాధించిన ఫలితం ఎంతో సంతృప్తిని, ఆనందాన్ని ఇస్తుందన్నారు. ప్రజల ముఖాల్లో సంతోషం నింపేలా అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ సద్దుల బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పే బతుకమ్మ పండుగ ప్రతి ఒక్కరిలో ఆనందాన్ని, ఐక్యతను నింపుతుందని అన్నారు. తాను మహారాష్ట్రకు చెందినప్పటికీ తెలంగాణకు వచ్చిన తర్వాత ఇక్కడి బతుకమ్మ, దసరా వేడుకల విశిష్టతను తెలుసుకున్నానని తెలిపారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, మహిళలంతా కలిసి పాటలు పాడుతూ ఆడిపాడే దృశ్యం ఎంతో ఆకట్టుకుంటుందన్నారు. మహిళా అధికారులు, ఉద్యోగులు ఉత్సాహంగా ఈ సంబరాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. మంత్రి సూచించిన విధంగా మరింత అంకితభావంతో పనిచేసి ప్రజలకు సేవలందిద్దామని పిలుపునిచ్చారు. అందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో కార్యాలయ ప్రాంగణం పూలవనంగా మారింది. మహిళా ఉద్యోగులు బతుకమ్మ పాటలతో లయబద్ధంగా అడుగులు వేస్తూ ఉత్సాహంగా ఆడిపాడారు. మంత్రి సీతక్క వారితో కలిసి బతుకమ్మ ఆడటంతో సంబరాల్లో మరింత ఉత్సాహం నెలకొంది. అనంతరం ములుగు మండలానికి చెందిన 25 మంది, మల్లంపల్లి మండలానికి చెందిన ఏడుగురు కలిపి మొత్తం 32 మంది లబ్ధిదారులకు ముప్పై రెండు లక్షల మూడు వేల ఏడు వందల పన్నెండు రూపాయల విలువైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంత్రి సీతక్క పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ములుగు మున్సిపాలిటీ చైర్పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ ఆసియా షాహిన్, రాష్ట్ర పంచాయతీ రాజ్ డైరెక్టర్ భగవాన్ రెడ్డి, కౌన్సిలర్లు, జిల్లా అధికారులు, మహిళా అధికారులు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ములుగులో నూతన బార్ అండ్ రెస్టారెంట్ కేటాయింపు ప్రక్రియ పూర్తి

- జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

ములుగు, అక్టోబర్ 16, మనం ప్రతినిధి: ములుగు మున్సిపాలిటీ పరిధిలో నూతన బార్ అండ్ రెస్టారెంట్ కేటాయింపునకు లక్కీ డ్రా ప్రక్రియ పూర్తయిందని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు. శుక్రవారం ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో లక్కీ డ్రా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 41 బార్ల ఏర్పాటుకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయగా, అందులో ములుగు మున్సిపాలిటీ పరిధిలో ఒక బార్కు అవకాశం కల్పించారు. దీనికి సంబంధించి సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 12 వరకు దరఖాస్తులు స్వీకరించగా, మొత్తం 376 దరఖాస్తులు అందాయి. వీటికి నిర్వహించిన లక్కీ డ్రాలో 349 టోకెన్ నంబరు గల దరఖాస్తుదారుడు బార్ అండ్ రెస్టారెంట్ కేటాయింపునకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి మండల అధ్యక్షుడి పరామర్శ

- ఇస్లావత్ రాజు నాయక్ మృతికి కాంగ్రెస్ నాయకుల సంతాపం

మంగపేట,అక్టోబర్ 16,మనం ప్రతినిధి: మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఇస్లావత్ కిషన్ నాయక్ తండ్రి ఇస్లావత్ రాజు నాయక్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి మృతుడి నివాసానికి వెళ్లి ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని, మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింత పున్నారావు, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యుడు మురుకుట్ల నరేందర్, జిల్లా నాయకుడు మాసిరెడ్డి వెంకటరెడ్డి, మండల నాయకుడు శానం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి మంత్రి సీతక్క ఆర్థిక సహాయం

- మండల పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు

మంగపేట, అక్టోబర్16, మనం ప్రతినిధి: మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఇండ్ల యాకయ్య తల్లి రామక్క ఇటీవల మరణించిన విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు పార్టీ నాయకులతో కలిసి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా రామక్క చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క తరపున,మృతురాలి దశదిన కర్మ ఖర్చుల నిమిత్తం రూ. 5,000 ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది.బాధిత కుటుంబానికి అండగా నిలిచి,వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని,కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ పరామర్శలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి చింత పున్నారావు,జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య,జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సభ్యులు మురుకుట్ల నరేందర్,జిల్లా నాయకులు మాసిరెడ్డి వెంకటరెడ్డి,మండల నాయకులు శానం సత్యనారాయణ మరియు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ పండుగ వేళ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ

- రూ.5.45 కోట్ల నిధులతో 109 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం
- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక
- వచ్చే ఏడాది సొంతింట్లో బతుకమ్మ సంబరాలు
- ఇందిరమ్మ ఇండ్లతో పేదల జీవితాల్లో అభివృద్ధి వెలుగులు
- ప్రకృతి మార్పులతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు
- మంత్రి దనసరి సీతక్క

ములుగు, అక్టోబర్ 16,మనం ప్రతినిధి: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక అత్యంత పారదర్శకంగా జరుగుతోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బతుకమ్మ పండుగ వేళ రెండో విడత లబ్ధిదారులకు ఇండ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్నామని, వచ్చే ఏడాది వారు తమ సొంతింట్లో బతుకమ్మ సంబరాలను వైభవంగా జరుపుకుంటారని పేర్కొన్నారు.

శుక్రవారం గోవిందరావుపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి మండల పరిధిలోని 13 గ్రామాలకు చెందిన 109 మంది లబ్ధిదారులకు ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.5.45 కోట్ల నిధులతో నిర్మించనున్న ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ సొంత నివాసం లేక ఇబ్బందులు పడుతున్న పేదలను గుర్తించి, వారి సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ములుగు నియోజకవర్గంలో మొదటి విడతలో సుమారు ఐదు వేల ఇండ్లను మంజూరు చేశామని, రెండో విడతలోనూ అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుత విడతలో ఇండ్లు రాని అర్హులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తదుపరి విడతల్లో అవకాశం కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

పేదలందరికీ సొంత నివాసం ఉండాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ప్రాధాన్యం ఇస్తున్నారని మంత్రి అన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకొని ఇండ్ల నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. పునాది స్థాయి నిర్మాణం పూర్తయిన తర్వాత బిల్లుల చెల్లింపులు ప్రారంభమవుతాయని తెలిపారు. మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉన్న లబ్ధిదారులకు ప్రారంభ నిర్మాణ ఖర్చుల కోసం సంఘాల ద్వారా రూ.లక్ష రుణం పొందే అవకాశం ఉందని వివరించారు.

ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను స్థానికంగా అందుబాటులో ఉంచేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. లబ్ధిదారుల వివరాలను ధ్రువీకరించి, నిబంధనల ప్రకారం ఇసుక అందించేలా జిల్లా కలెక్టర్, అటవీ శాఖ అధికారులు, తహసీల్దార్ చర్యలు చేపట్టాలని కోరారు. సర్పంచులు లబ్ధిదారులకు అండగా నిలిచి, ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా దగ్గరుండి సహకరించాలని సూచించారు.

కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరించామని, వాటికి సంబంధించిన క్షేత్రస్థాయి పరిశీలనను పూర్తి చేసి తదుపరి చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు. గృహాలకు ఉచిత విద్యుత్, రేషన్ బియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాలతో ప్రజా ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.

ఉపాధి హామీ పథకం కింద వంద రోజుల పనులను పెద్ద ఎత్తున కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. పని పరిమాణాన్ని బట్టి రోజుకు సుమారు రూ.310 వరకు కూలి పొందే అవకాశం ఉందన్నారు. పండుగ అనంతరం గ్రామాల్లో ఉపాధి పనులు విస్తృతంగా చేపట్టేలా సర్పంచులు చొరవ చూపాలని కోరారు. ఈ పనులతో కూలీలకు ఆదాయం సమకూరడంతో పాటు గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు లభిస్తుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రకృతి మార్పుల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఇటువంటి పరిస్థితుల్లో అధికారులు ప్రజలకు అండగా నిలవాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ ప్రవళిక అరెస్టును ఖండించిన లక్ష్మణ్‌బాబు

ఏటూర్ నాగారం, అక్టోబర్ 16, మనం ప్రతినిధి: తాడ్వాయి సర్పంచ్ ప్రవళిక అరెస్టును ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్బాబు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యలపై ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం సరికాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాప్రతినిధుల పట్ల అణచివేత ధోరణిని అవలంబిస్తోందని విమర్శించారు. సర్పంచ్ ప్రవళిక అరెస్టు విషయం తెలిసిన వెంటనే సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి ఆమెను విడుదల చేయించినట్లు లక్ష్మణ్బాబు తెలిపారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రజల గొంతుకను అణచివేయాలని చూస్తే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని, ప్రజాప్రతినిధుల హక్కులు, గౌరవం కోసం నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రవళిక అరెస్టుపై సమగ్ర విచారణ జరిపి ఆమెకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సమాచార హక్కుపై ప్రజల్లో అవగాహన పెంచాలి

- జిల్లా అదనపు కలెక్టర్లు రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, స్థానిక సంస్థలు సంపత్ రావు.

ములుగు, అక్టోబర్ 16,మనం ప్రతినిధి: సమాచార హక్కు చట్టంతో పాలనలో పారదర్శకత పెరుగుతుందని, ప్రజా భాగస్వామ్యంతో సుపరిపాలన సాధ్యమవుతుందని జిల్లా అదనపు కలెక్టర్లు రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి , స్థానిక సంస్థలు సంపత్ రావులు అన్నారు. సమాచార హక్కు వారోత్సవాలు-2026లో భాగంగా శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టం-2005 జిల్లా స్థాయి వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్లోని రవీంద్రభారతిలో తెలంగాణ సమాచార కమిషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా పాల్గొన్న సమాచార హక్కు వారోత్సవాలు-2026 రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని నూతన సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరం నుంచి జిల్లా అదనపు కలెక్టర్లు రెవెన్యూ సీహెచ్ మహేందర్, సంపత్ రావు, అధికారులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టాన్ని గౌరవిస్తూ, పౌరులు కోరిన సమాచారాన్ని సకాలంలో అందిస్తామని, విధుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన పెంచాలని సూచించారు. అక్టోబర్ 5 నుంచి 12 వరకు నిర్వహిస్తున్న వారోత్సవాల్లో జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల నుంచి సమాచారాన్ని కోరే విధానాన్ని ప్రజలకు వివరించాలని, ప్రజాప్రతినిధులు, పౌరులు, పౌరసమాజ సంస్థల భాగస్వామ్యంతో కార్యక్రమాలను నిర్వహించాలని పేర్కొన్నారు. చట్టం అమలులో ప్రజా సమాచార అధికారులు, సహాయ ప్రజా సమాచార అధికారులు, మొదటి అప్పీళ్ల అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. తమ విధులు, బాధ్యతలు, చట్టంలో నిర్దేశించిన గడువు, విధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రజలు కోరిన సమాచారాన్ని సకాలంలో అందించాలని, సెక్షన్ 4(1)(బి) ప్రకారం స్వచ్ఛందంగా వెల్లడించాల్సిన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టానికి సంబంధించిన అవగాహన పత్రాలు, నోటీసులను స్పష్టంగా కనిపించే ప్రదేశాల్లో ప్రదర్శించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల పనితీరుపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందుబాటులో ఉంచడం ద్వారా పాలనపై విశ్వాసం పెరుగుతుందని తెలిపారు. సమాచారం కోసం వచ్చే పౌరులకు దరఖాస్తు ప్రక్రియపై తగిన మార్గనిర్దేశం చేయాలని సూచించారు. పారదర్శకత, జవాబుదారీతనాన్ని రోజువారీ విధుల్లో భాగంగా పాటించాలని, ప్రజలకు సమాచారాన్ని చేరువ చేయడంలో ప్రతి అధికారి తన వంతు బాధ్యత నిర్వర్తించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏ ఓ రాజ్ కుమార్, జిల్లా అధికారులు, పిఐఓ లు, అసిస్టెంట్ పిఐఓలు , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచి నిర్బంధానికి నిరసన

- బాడిశ నాగ రమేష్‌ను మధ్యలోనే ఆపిన పోలీసు

తాడ్వాయి, అక్టోబర్ 16, మనం ప్రతినిధి: తాడ్వాయి మండల సర్పంచి కొట్టెం ప్రవళిక, ఆమె భర్తను పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ, వారికి మద్దతుగా బయలుదేరిన భారత రాష్ట్ర సమితి ములుగు జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి బాడిశ నాగ రమేష్ ను పోలీసులు మార్గమధ్యలో అడ్డుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనపై ప్రశ్నించినందుకే సర్పంచి ప్రవళికను, ఆమె భర్తను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని భారత రాష్ట్ర సమితి నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రజా సమస్యపై నిలదీసినందుకు ప్రజా ప్రతినిధినే నిర్బంధించడం దారుణమని చెబుతున్నారు. ఈ అక్రమ నిర్బంధాన్ని నిరసించేందుకు, సర్పంచికి మద్దతు తెలిపేందుకు బాడిశ నాగ రమేష్ తాడ్వాయికి బయలుదేరారు. ఈ క్రమంలో కమలాపురం మార్గంలో పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. ఆయన ప్రయాణిస్తున్న వాహనాన్ని ముందుకు వెళ్లనీయకుండా నిలిపివేసి, అక్కడే నిర్బంధించారు.ఈ సందర్భంలో బాడిశ నాగ రమేష్ మాట్లాడుతూ...ఇది ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు. ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛ కూడా లేకుండా చేస్తున్నారని అన్నారు. కాంగ్రెసు ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తి చూపితే జైలులో వేస్తారా అని నిలదీశారు. ఇది ఎంత వరకు సబబు అని అన్నారు. ఈ విశాల భారతదేశంలో ప్రతి పౌరుడికి స్వేచ్ఛగా మాట్లాడే హక్కును రాజ్యాంగం కల్పించిందని, ఆ హక్కును కాలరాయడం సరి కాదని చెప్పారు. ఇలాంటి దుర్మార్గపు చర్యకు పాల్పడటం, నీచ రాజకీయం చేయడం తగదని అన్నారు.సమస్యపై ప్రశ్నించడం ప్రతి ఒక్కరి హక్కు అని, కుదిరితే సమస్యను పరిష్కరించాలి తప్ప, ప్రశ్నించిన వారిని జైలులో వేయడం, మానసిక ఒత్తిడికి గురి చేయడం సరైన పద్ధతి కాదని స్పష్టం చేశారు. ప్రజా గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని, అక్రమ నిర్బంధాలకు భయపడేది లేదని, ప్రజా పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా నాయకురాలు కొమరం ధనలక్ష్మి, మండల నాయకులు మునిగెల సంబుల్, సోయం ఈశ్వర్, రూపా భద్రయ్య, కొమరం పుల్లారావు, మండల సంతోష్, మునిగెల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు 24 గంటల విద్యుత్ ఏదీ?

విద్యుత్ సరఫరాలో కోతలను నిరసిస్తూ బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సబ్‌స్టేషన్ ముట్టడి

ములుగు, అక్టోబర్ 16, మనం ప్రతినిధి: రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రస్తుతం కనీసం 12 గంటలు కూడా విద్యుత్ ఇవ్వడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ములుగు జిల్లా కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ను బీజేపీ నాయకులు ముట్టడించారు. బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జాడి రామరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సిరికొండ బలరాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో వరంగల్ డిక్లరేషన్ పేరుతో రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భర్తపురం నరేష్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దండి వెంకటేశ్వర్లు, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు మాదరి శ్రీకాంత్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పళ్ళ బుచ్చయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు రాయంచు నాగరాజు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు వెల్దండి వెంకన్నతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతిని దేవతగా కొలిచే పండుగ బతుకమ్మ

- దుగ్గొండి మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు
- ఉత్సాహంగా పాల్గొన్న ఎంపీడీవో అరుంధతి, ఎమ్మార్వో సమ్మక్క, ఉద్యోగులు ప్రజాప్రతినిధులు

దుగ్గొండి, అక్టోబర్ 16 మనం ప్రతినిధి: ప్రకృతి నుండి వచ్చే పువ్వులను దేవతలగా పోలుస్తూ పూజించే ఏకైక పండుగ బతుకమ్మ పండుగ అని ఎంపీడీవో డాక్టర్ లెక్కల అరుంధతి, ఎమ్మార్వో సమ్మక్క తెలిపారు. దుగ్గొండి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డాక్టర్ లెక్కల అరుంధతి, ఎమ్మార్వో సమ్మక్క ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆ మండల పరిషత్తు కార్యాలయం సిబ్బంది, రెవెన్యూ కార్యాలయం సిబ్బంది,పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు తెలంగాణ సాంప్రదాయ పద్ధతిలో బతుకమ్మలను వేడుక ఘనంగా నిర్వహించారు. వివిధ పూలతో చేర్చిన బతుకమ్మల వద్ద పసుపు కుంకుమలతో గౌరమ్మకు ఎమ్మార్వో,ఎంపీడీవో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బతుకమ్మ పాటలు తెలంగాణ సాంస్కృతిక పాటలతో దృశ్యాలు చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణం పండగ వాతావరణం నెలకొన్నది. ఈ సందర్భంగా ఎంపీడీవో డాక్టర్ లెక్కల అరుంధతి, ఎమ్మార్వో తమక మాట్లాడుతూ తెలంగాణలో బతుకమ్మ పండుగకు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంటుందని పేర్కొన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఐకెపి సిబ్బంది, ఫీల్ అసిస్టెంట్స్ మహిళలు పాల్గొనడం సంతోషకరమని వారు తెలిపారు.ఎస్సై మహేందర్ మాట్లాడుతూ సద్దుల బతుకమ్మ,దసరా పండుగలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని సర్పంచులకు ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ చంద్రమోహన్ స్వామి,ఏపీఓ శ్రీనివాస్,సర్పంచులు పొగాకు శోభారాణి వెంకటేశ్వర్లు గౌడ్,మారేడుగొండ శ్రీమాలత,కూరతోట స్వప్న సురేష్, వ

ఐదో టీ20.. అభిమానులకు బ్యాడ్‌న్యూస్!

టీమిండియా-వెస్టిండీస్ మధ్య ఐదు మ్యాచ్ ల టీ20 సిరీస్ రసవత్తరంగా సాగుతోంది. లక్నో వేదికగా తొలి టీ20లో భారత్ గెలవగా.. రాంచిలో జరిగిన రెండో రెండో మ్యాచ్ లో కరేబియన్ జట్టు విజయం సాధించింది. అనంతరం ఇండోర్ మూడో మ్యాచ్ జరగ్గా టీమిండియా జయకేతనం ఎగుర వేసింది.

2-2తో సమంగా....

అయితే, హైదరాబాద్ లో బుధవారం నాటి నాలుగో టీ20లో గెలిచి వెస్టిండీస్ ఈ సిరీస్ను 2-2తో సమం చేసింది. ఈ నేపథ్యంలో ఇరుజట్ల మధ్య శనివారం జరిగే ఐదో టీ20తో సిరీస్ ఫలితం తేలనుంది. ఇందుకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదిక.

ప్రాక్టీస్ సెషన్ రద్దు

కాగా బెంగళూరులో శుక్రవారం భారీగా వర్షం పడింది. లోతట్టు ప్రాంతాలు కొన్ని నీటమునిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో చిన్నస్వామి స్టేడియంలో జరగాల్సిన ప్రాక్టీస్ సెషన్ రద్దైపోయింది. ఇక శనివారం సైతం వాన పడే సూచనలు ఉన్నట్లు ఆక్యూవెదర్ తెలిపింది.

వర్షం పడేందుకు 90 శాతం అవకాశం

బెంగళూరులో శనివారం వర్షం పడేందుకు 90 శాతం అవకాశం ఉన్నట్లు ఆక్యూవెదర్ పేర్కొంది. మధ్యాహ్నం 12 గంటల వరకు వర్షం పడేందుకు 11 శాతం, ఆ తర్వాత రెండు గంటల్లో వాన కురిసేందుకు 34 శాతం.. మూడు గంటల తర్వాత ఇందుకు 40 శాతం ఛాన్స్ ఉన్నట్లు తెలిపింది.

కాగా మ్యాచ్ ఏడు గంటలకు మొదలుకానుండగా.. ఆ సమయంలో వర్షం పడేందుకు 64 శాతం అవకాశం ఉందని.. రాత్రి పదకొండు గంటల వరకు కూడా వాన కొనసాగవచ్చని ఆక్యూ వెదర్ అంచనా వేసింది.

నిరాశలో అభిమానులు

దీంతో బెంగళూరులో భారత్- విండీస్ మ్యాచ్ చూద్దామనుకున్న అభిమానులు నిరాశ చెందుతున్నారు. చిన్నదైన చిన్నస్వామి స్టేడియంలో పరుగుల వరద చూద్దామనుకుంటే.. వర్షం వల్ల అంతా తుడిచిపెట్టుకుపోయే పరిస్థితి వచ్చిందని సోషల్ మీడియా వేదికగా ఉసూరుమంటున్నారు.

ఇది మిక్స్‌డ్ జెండర్ క్రికెట్..

ఒకే జట్టులో అమ్మాయిలు, అబ్బాయిలు

టెన్నిస్, బ్యాడ్మింటన్, ఆర్చరీ.. ఇలాంటి క్రీడల్లో మిక్స్‌డ్ డబుల్స్ అనే పదం ఎక్కువగా వింటాం. పురుష, మహిళా ప్లేయర్లు కలిసి ఒక జట్టుగా బరిలోకి దిగుతారు. ఇప్పుడు క్రికెట్ లోనూ తొలిసారి మిక్స్డ్ జెండర్ మ్యాచులను చూడబోతున్నాం. అదీనూ 80 ఓవర్ల ఫార్మాట్ కావడం గమనార్హం. అందుకు వేదిక శ్రీలంక రాజధాని కొలంబో. సింహాలెస్ స్పోర్ట్స్ క్లబ్ నవంబర్ 14 నుంచి 29 వరకూ 'టెస్టు ట్వంటీ' పేరుతో ఈ టోర్నీని నిర్వహించనుంది.

రెండు బంతులు.. పారిటీ రూల్

- నాలుగు ఖండాల నుంచి 13 నుంచి 21 ఏళ్ల వయసు కలిగిన దాదాపు 160 మందిని టోర్నీ కమిటీ ఎంపిక చేసింది. నాలుగు జట్లుగా విడగొట్టింది.
- ఒకే టీమ్ లో 20 మంది అబ్బాయిలు, 20 మంది అమ్మాయిలు ఉంటారు. ఒకే రోజులో 80 ఓవర్ల మ్యాచ్ ఆడేస్తారు.
- 80 ఓవర్లు అనగానే.. ఒకే జట్టు ఆడేస్తుందేమో అనుకోవద్దు. ఒక్కో టీమ్ 40 ఓవర్లు ఆడుతుంది. కాకపోతే.. రెండుసార్లు బ్యాటింగ్ చేస్తుంది.
- తొలి 20-20 మ్యాచ్ ను రెడ్ బాల్ తో తెల్ల దుస్తులు ధరించి పగలు సమయంలో ఆడతారు. రెండో 20-20 మ్యాచ్ ను తెల్ల బంతితో రంగుల జెర్సీలు ధరించి ఫ్లడ్ లైట్ల వెలుతురులో ఆడాల్సి ఉంటుంది.
- ఈ మ్యాచ్ కు టాస్ అత్యంత కీలకం. టాస్ నెగ్గిన జట్టు బ్యాటింగ్ లేదా బౌలింగ్ ను ఎంచుకోవడంతోపాటు.. తొలుత బాలికలు ఆడతారా? బాలురు ఆడతారా? అనేది నిర్ణయించుకోవచ్చు.
- మిక్స్‌డ్ జెండర్ క్రికెట్ లో ప్రత్యేక ఆకర్షణ పారిటీ రూల్. పారిటీ అంటే సమానత్వం. బాల, బాలికలకు సమాన అవకాశాలు ఇవ్వడమే దీని ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు చెబుతున్నారు.
- బాల, బాలికల రెండు టీమ్ లూ కలిసి మెరుగ్గా ఆడితేనే విజయం సాధించేందుకు అవకాశాలు మెరుగ్గా ఉంటాయి. వీరందరూ చేసిన పరుగులను కలిపి తుది ఫలితాన్ని నిర్ణయిస్తారు.

సరిసమానంగా అవకాశాలు..

''టెస్టు ట్వంటీ టోర్నీతో బాలబాలికలకు సమాన అవకాశాలు వస్తాయి. ఇందులో టాస్ కూడా అత్యంత కీలక కానుంది'' అని టోర్నీ వ్యవస్థాపకుడు గౌరవ్ భిర్వాని తెలిపారు. టోర్నమెంట్ కు సంబంధించి అడ్వైజరీ బోర్డులో ఏబీ డివిలియర్స్, మాథ్యూ హేడెన్, సర్ క్లైవ్ లాయిడ్ ఉన్నట్లు పేర్కొన్నారు. గ్లోబల్ సెలక్షన్ కమిటీ అధ్యక్షుడిగా దిల్లీ కోచ్ రాజ్ కుమార్ శర్మ, టోర్నీ కార్యకలాపాలకు మైక్ ఫోర్డమ్ నాయకత్వం వహిస్తారు.

బౌలర్లనేమీ అనలేం.. బ్యాటర్లదే బాధ్యత

భారత బ్యాటర్లు ఛేదనలో మరింత బాధ్యతగా ఆడాలని మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ సూచించాడు. వెస్టిండీస్తో నాలుగో టీ20లో టీమ్ఇండియా 24 పరుగుల తేడాతో పరాజయంపాలైన నేపథ్యంలో ఆయన ఇలా అన్నాడు. బ్యాటింగ్కు బాగా అనుకూలించే హైదరాబాద్లాంటి పిచ్ భారత బ్యాటర్లు ఆధిపత్యం ప్రదర్శించాల్సిందని చెప్పాడు. ''టీమ్ఇండియా ప్రధానంగా ఛేదనలో మెరుగవ్వాలి. బ్యాటింగ్ విభాగం మరింత బాధ్యతాయుతంగా ఆడాలి. లేదంటే భారత్ విజయం సాధించడం కష్టమవుతుంది. బ్యాటింగ్కు స్వర్గధామంలాంటి ఉప్పల్లో మన బ్యాటర్లు మరింత చెలరేగాల్సింది. సంజు శాంసన్ గొప్ప ఆరంభం అందించినా.. భారత్ సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఆరంభంలో అభిషేక్ తన స్థాయికి తగ్గ ఇన్నింగ్స్ ఆడకపోవడం దెబ్బతీసింది. కీమో పాల్ బిగించిన ఉచ్చుకు ఇషాన్ కిషన్ తేలికగా చిక్కాడు. తొలి మ్యాచ్లో సెంచరీ తర్వాత శ్రేయస్ అయ్యర్ నుంచి పెద్ద ఇన్నింగ్స్ రాలేదు'' అని గావస్కర్ పేర్కొన్నాడు. అయితే టీమ్ఇండియా బౌలర్లను మాత్రం నిందించలేమని అతడు చెప్పాడు. ''మన బౌలర్ల ప్రదర్శన పేలవమని అంగీకరిస్తా.

నా మనసుకు నచ్చిందే చేస్తాను - అనీత్ పడ్డా

'సైయారా' లాంటి బ్లాక్ బస్టర్ విజయం తర్వాత యంగ్ హీరోయిన్ అనీత్ పడ్డా మ్యాడ్డాక్ హారర్ కామెడీ యూనివర్స్ లో తెరకెక్కుతున్న 'శక్తి షాలిని' చిత్రంతో సిద్ధమవుతోంది. ప్రేక్షకులను మునుపెన్నడూ చూడని పవర్ ఫుల్ అండ్ గ్లామరస్ అవతారంలో ఆమె అలరించేందుకు శరవేగంగా జరుగుతున్న సమయంలో.. తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో అనీత్ పడ్డా పలు ఆసక్తికర విషయాలను వెల్లడించింది. ఈ చిత్రంలో తన పాత్ర గత రొమాంటిక్ బ్లాక్ బస్టర్ కు పూర్తిగా భిన్నంగా ఉంటుందని చెప్పింది. మొదటి సినిమా తెచ్చిన విజయం వల్ల ప్రేక్షకుల నుంచి ఎన్నో అంచనాలు ఉంటాయని, కానీ తాను ఎప్పుడూ తలకు ఎక్కించుకోలేదని స్పష్టం చేసింది. ఒత్తిడికి భారాన్ని తాను ఎప్పుడూ తలకు ఎక్కించుకోలేదని స్పష్టం చేసింది. ఒత్తిడికి గురికాకుండా కేవలం నటనమైపే పూర్తి దృష్టి పెట్టానని చెప్పింది. మార్కెట్ లెక్కింపుల కోసమో కాకుండా, నటిగా తనకు సృజనాత్మక సంతృప్తిని ఇచ్చే పాత్రలకే ఓటు వేస్తానని తెలిపింది. ప్రజల అంచనాల కోసం తాను బతకనని.. తన మనసుకు నచ్చిందే చేస్తానని స్పష్టం చేసింది. 'శక్తి షాలిని' షూటింగ్ ప్రారంభంలో నచ్చిందే చేస్తానని స్పష్టం చేసింది. 'శక్తి షాలిని' షూటింగ్ ప్రారంభంలో సక్సెస్ భారం ఉంటుందేమోనని అనుకున్నానని.. కానీ సెట్ లోకి అడుగుపెట్టాక ఆ ఆలోచన పోయిందని అనీత్ పేర్కొంది. 'శక్తి షాలిని' కథలో యాక్షన్, రొమాన్స్, హారర్ ఎలిమెంట్స్ అన్నీ ఉండటం తనకు సరికొత్త అనుభూతిని ఇచ్చిందని చెప్పింది. ముఖ్యంగా కెరీర్ రెండో సినిమాకే కథను తన భుజాలపై మోసే రోల్ దక్కడం నిజంగా అదృష్టమని, దీని ఫలితం ఎలా ఉన్నా పూర్తి బాధ్యత తనదేనని పేర్కొంది.

ఆ స్థాయికి రావడమే నా జీవితంలో అసలైన విజయం: సాయి పల్లవి

నేచురల్ బ్యూటీ సాయి పల్లవి త్వరలోనే 'రామాయణ' వంటి అత్యంత భారీ పాన్-ఇండియా ప్రాజెక్ట్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రం రాబోయే దీపావళి కానుకగా నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతోంది. ఈ క్రమంలో సినిమా ప్రమోషన్స్లో భాగంగా సాయి పల్లవి తాజాగా 'జయమ్ము నిశ్చయమ్మురా సీజన్-2' టాక్ షోలో పాల్గొని, తన కెరీర్ తొలినాళ్లలోని చేదు తీపి అనుభవాలను పంచుకున్నారు. నటుడు జగపతి బాబు హోస్ట్ గా వ్యవహరిస్తున్న ఈ షోలో.. 'మీ జీవితంలో జయమ్ము నిశ్చయమ్మురా అనిపించిన ప్రత్యేక సంఘటన ఏది?' అని సాయి పల్లవిని ప్రశ్నించారు.

దానికి ఆమె రియాక్ట్ అవుతూ.. తన డాన్స్ కెరీర్ ప్రారంభంలో ఒక ప్రముఖ డాన్స్ రియాలిటీ షో వేదికపై ఓడిపోయానని, కానీ సరిగ్గా అదే స్టేజ్ కొన్నాళ్ల తర్వాత ప్రభుదేవా మాస్టర్ కొరియోగ్రఫీలో తాను 'రౌడీ బేబీ' పాటకు డాన్స్ చేయడం జీవితంలో మర్చిపోలేని మలుపు అని చెప్పారు. ఓటమి ఎదురైన చోటే తనను తాను నిరూపించుకుని, అంతటి గొప్ప స్థాయికి చేరుకోవడాన్ని తన నిజమైన విజయంగా భావిస్తానని ఆమె తెలిపారు. కేవలం అదృష్టం ఉంటేనే విజయం వస్తుందంటే తాను నమ్మనని సాయి పల్లవి స్పష్టం చేశారు. మనం పడే కష్టమే మనల్ని సరైన స్థానంలో నిలబెడుతుందని, కష్టపడి పనిచేస్తే సక్సెస్ అనేది వెతుక్కుంటూ ఆటోమేటిక్గా వస్తుందని చెప్పారు. తన జీవిత ప్రయాణంలో ఎదురైన అనుభవాలే దీనికి ప్రత్యక్ష నిదర్శనమని సాయి పల్లవి వెల్లడించారు.

పురుషులు నోళ్లు మూసుకొని ఇంట్లో కూర్చోండి.. - స్వరా భాస్కర్

బాలీవుడ్ బ్యూటీ స్వరా భాస్కర్ సినిమాలకు దూరమైనప్పటికీ 'రైజ్ అండ్ ఫాల్' అనే క్రేజీ రియాలిటీ షోలో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. తన మూడేళ్ల కూతురితో ఎక్కువ సమయం గడపడానికి రియాలిటీ షోలే బెస్ట్ ఆప్షన్ అని స్వరా భాస్కర్ స్పష్టం చేశారు. సినిమాల్లో నటిస్తే ఎక్కువ రోజులు క్యారెక్టర్ మూడ్లోనే ఉండిపోవాల్సి వస్తుందని, కానీ రియాలిటీ షోలు అయితే తక్కువ సమయంలో పూర్తయి పాపతో ఉండేందుకు వీలవుతుందని ఆమె వెల్లడించారు. అలాగే తన నిజమైన వ్యక్తిత్వాన్ని చూపించడానికి ఇది మంచి ప్లాట్ ఫామ్ గా ఉపయోగపడతాయని అన్నారు.

ఇక ప్రసవం తర్వాత తనపై వస్తున్న ట్రోల్స్, బాడీ షేమింగ్ పై స్వరా భాస్కర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తల్లులయ్యే మహిళల శరీర ఆకృతిపై దారుణమైన కామెంట్లు చేసేవారికి కనీస మానవత్వం, తెలివితేటలు ఉండవని మండిపడ్డారు. ఐశ్వర్య రాయ్, కత్రినా కైఫ్ వంటి స్టార్లను కూడా ఇలాగే టార్గెట్ చేశారని గుర్తుచేస్తూ.. సన్నగా ఉండటంలోనే సౌందర్యం లేదని, ఆరోగ్యంగా ఉండటమే ముఖ్యమని తేల్చి చెప్పారు. ముఖ్యంగా మహిళల శరీరాలపై ఉచిత సలహాలు, కామెంట్లు ఇచ్చే మగవాళ్లు తమ నోళ్లు మూసుకొని ఇంట్లో కూర్చోవాలని స్వరా ఘాటుగా హెచ్చరించారు.

బాడీ డబుల్స్ వద్దన్న హీరోయిన్

ఓటీటీలో విడుదలైన సంచలన సెన్సేషనల్ సిరీస్ 'లస్ట్ స్టోరీస్ 3' ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్న విషయం తెలిసిందే. ప్రముఖ దర్శకుడు విశాల్ భరద్వాజ్ తెరకెక్కించిన ఈ సిరీస్ లో రియల్ లైఫ్ కపుల్ అయిన అదితి రావ్ హైదరి, సిద్ధార్థ్ జంటగా నటించారు. ఈ నేపథ్యంలో దర్శకుడు విశాల్ భరద్వాజ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో వీరిద్దరితో పనిచేసిన అనుభవం గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. నిజ జీవితంలో అదితి రావ్ హైదరి, సిద్ధార్థ్ లు భార్యభర్తలు అయినప్పటికీ.. కెమెరా ముందు మాత్రం వారు ఆ బంధాన్ని ఎక్కడా ప్రదర్శించలేదని విశాల్ భరద్వాజ్ తెలిపారు. 'సెట్ లో వారిద్దరి మధ్య ఉన్న బంధం వల్ల కొంత ఇబ్బంది తలెత్తిపోయిన మాట వాస్తవమే. అయితే, వారిద్దరి మధ్య కెమిస్ట్రీని చూసినప్పుడు నాకు మాత్రం వారు నిజజీవితంలో భార్యాభర్తలనే భావనే ఎప్పుడూ కలగలేదు. నటులుగా వారు పూర్తిగా పాత్రల్లో లీనమైపోయి జీవించారు' అని ఆయన పేర్కొన్నారు.



బాడీ డబుల్ ను తిరస్కరించిన జంట..

ఈ చిత్రంలోని కొన్ని రొమాంటిక్ సన్నివేశాల కోసం మేకర్స్ బాడీ డబుల్ ను సిద్ధం చేసినప్పటికీ.. అదితి, సిద్ధార్థ్ వాటిని ఉపయోగించడానికి నిరాకరించినట్లు విశాల్ భరద్వాజ్ వెల్లడించారు. ఒక నిర్దిష్టమైన సన్నివేశంలో షాట్ గురించి మాట్లాడేటప్పుడు, ''నా కాళ్లు అంత లావుగా లేవు'' అంటూ అదితి స్వయంగా ఆ సీన్ లో నటించడానికి ముందుకు వచ్చారని, అలాగే సిద్ధార్థ్ కూడా తన వెర్షన్ ను ఎంతో నిబద్ధతతో ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తి చేశారని ఆయన ప్రశంసించారు. విక్రమాదిత్య మోత్వానే, కిరణ్ రావు, శకున్ బత్రాలతో పాటు విశాల్ భరద్వాజ్ సంయుక్తంగా తెరకెక్కించిన ఈ ఆంథాలజీ ప్రస్తుతం నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ అవుతూ ప్రేక్షకులను విశేషంగా అలరిస్తోంది.

4,000 కోట్ల విజన్ ను ఎగతాళి చేయడం సరికాదు.. : యష్

బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణ'. ప్రముఖ నిర్మాత నమిత్ మల్హోత్రా అత్యంత భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్న ఈ సినిమాపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ విజువల్ వండర్ లో రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా కేజీఎఫ్ స్టార్ యష్, హనుమంతుడిగా సన్నీ డియోల్, శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్, మండోదరిగా కాజల్ అగర్వాల్ నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న యష్.. సినిమాపై సోషల్ మీడియాలో వస్తున్న నెగెటివిటీకి, విమర్శలకు తనదైన శైలిలో గట్టి సమాధానమిచ్చారు. సుమారు నాలుగు వేల కోట్ల భారీ విజన్ తో తెరకెక్కుతున్న ఇలాంటి గొప్ప ప్రాజెక్ట్ కు అందరి మద్దతు, మంచి ఆశయం అవసరమని, అంతేకానీ సోషల్ మీడియాలో నిత్యం ఎగతాళి చేయడం సరికాదని ఆయన అన్నారు.

సినిమాపై నిర్మాణాత్మక విమర్శలు ఉండవచ్చు కానీ, అసలు మూవీని చూడకుండానే ముందుగానే దాన్ని తప్పుబట్టడం సమంజసం కాదనిస్పష్టం చేశారు. భారతీయ సినిమాను గౌరవించాలని యష్ పిలుపునిచ్చారు. ఇక తన గత చిత్రం 'టాక్సిక్' గురించి మాట్లాడుతూ.. అన్ని అడ్డంకులను ఎదుర్కొని ప్రేక్షకులు ఆ సినిమాను ఎన్నోసార్లు చూసి, భారీ కలెక్షన్లతో దానిని ఎంతగానో ప్రేమించారని, ఆదరించారని గుర్తుచేసుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. తను కూడా ఒక నిర్మాతగా వ్యవహరిస్తున్నానని, ఈ 'రామాయణం' కూడా కర్ణాటక ఉత్పత్తి అని గర్వంగా చెబుతున్నానని యష్ పేర్కొన్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.